www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 20-10-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 203 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: తదియ ఉ. 6.47, చవితి తె. 4.16 వరకు; నక్షత్రం: కృత్తిక ఉ. 8.31 తదుపరి రోహిణి; వర్జ్యం: రా.11.23-12.52; దుర్ముహూర్తం: సా.4.13-5.00; అమృతఘడియలు: ఉ.6.20-7.47, తె.3.51-5.20; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.13; సూర్యాస్తమయం: 5.46 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తీతువు పిట్టల్లా లొల్లి..!

పోలీసు కేసులు, వేధింపులు, పత్రికా స్వేచ్ఛ అంటూ ఏపీలో జగన్ అండ్ కోతో పాటు కొంత మంది వారి తాబేదార్లు గగ్గోలు పెట్టడం చూస్తే కౌరవ మూక హాహాకారాలను వింటూ 'ఆర్తనాదాలు శ్రవణానందకరంగా ఉన్నాయి' అని మాయాబజార్ చిత్రంలో ఘటోత్కచుడు చెప్పిన డైలాగ్ గుర్తుకొస్తుంది.

జగన్ రెడ్డి రోత మీడియాపై పోలీసులు ఒక కేసు పెట్టినందుకే ఇప్పుడు పత్రికా స్వేచ్ఛ అంటూ పెడబొబ్బలు పెడుతున్నారే? నిన్నటిదాకా మీరు చేసిందేమిటి? రఘురామకృష్ణరాజుతోపాటు నాపైనా, మా సహచరులపైనా దేశద్రోహం కేసు పెట్టిన విషయం మరిచారా? 'ఆంధ్రజ్యోతి' సంస్థలపై సీఐడీ అధికారులు ఎన్నో కేసులు పెట్టారు కదా! ఆ కేసులలో మా సిబ్బంది కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు కదా?



కొత్త పలుకు

రోత పత్రికపై కేసు పెట్టడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని... జగన్ రెడ్డి దయవల్ల ఐదేళ్ల పాటు మీడియా సలహాదారు పదవిలో కొనసాగిన దేవులపల్లి అమర్ అనే జర్నలిస్టు నాయకుడు ఇప్పుడు అంటున్నారు. ఆయనకు అప్పుడు పత్రికా స్వేచ్ఛ కనిపించలేదా? 'ప్రచురించిన వార్తల విషయమై ప్రభుత్వానికి అభ్యంతరం ఉంటే వివరణ ఇవ్వాలి! సదరు వివరణను ప్రచురించకపోతే పరువు నష్టం దావా వేసుకోవచ్చునుగానీ కేసులు పెట్టడం ఏవిటి?' అని ఇప్పుడు ప్రవచనాలు చెప్పడం ఏమిటి? ఇదే సలహా జగన్ రెడ్డి ప్రభుత్వానికి మీడియా సలహాదారుడిగా ఎందుకివ్వలేదు? మాపై కేసులు పెట్టినప్పుడు ప్రభుభక్తి మత్తులో దేవులపల్లి అమర్ నిద్రపోయారా?

ఐదేళ్ల పాటు శాసనసభ కార్యక్రమాలను ప్రసారం చేయకుండా ఏబీఎన్‌పై నిషేధం విధించడాన్ని మరచిపోతే ఎలా? ముఖ్యమంత్రి కార్యాలయానికి, నివాసానికి వెళ్లకుండా 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులపై నిషేధం విధించడాన్ని ఏమనాలి? రోత మీడియాతోపాటు మరో రెండు కూలి మీడియా చానళ్ల ప్రసారాలను ఇప్పుడు అడ్డుకోవడంపై పెడబొబ్బలు పెడుతున్నారే! మీరు అధికారంలో ఉన్నప్పుడు ఏబీఎన్‌తో పాటు టీవీ5 ప్రసారాలను ఐదేళ్ల పాటు అడ్డుకోలేదా? కర్మ మనల్ని వదలదు- తప్పు ఎవరు చేసినా తప్పే! జగన్ రెడ్డి ప్రభుత్వం చేసిన ఈ దురాగతాలను అప్పుడు ఖండించి ఉంటే ఇప్పుడు ఎవరికైనా ఏడ్చే అర్హత, హక్కు వచ్చి ఉండేవి.

అప్పుడు ప్రభువు కళ్లలో ఆనందం చూసి నోళ్లకు తాళం వేసుకున్న వాళ్లు ఇప్పుడు తీతువు పిట్టల్లా లొల్లి చేసినా లాభం లేదు. మీరు ఏం చేశారో ప్రజలు మరచిపోలేదు కనుకే ఇప్పుడు జరుగుతున్న దాన్ని కూడా పట్టించుకోవడం లేదు. తగిన శాస్తి జరిగిందని సరిపెట్టుకుంటున్నారు.

గతంలో హద్దులు మీరి ప్రవర్తించిన వారిపై చర్యలు ఉండాల్సిందే. లేనిపక్షంలో అలాంటి వారిలో లెక్కలేనితనం వస్తుంది. అది రాజకీయాలకే కాదు- సమాజానికి మంచిది కాదు.

4



గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనకు మద్దతుగా వెళ్లిన బండి సంజయ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రాష్ట్రంలో రిజర్వేషన్ల

రద్దుకు కుట్ర

- దాంట్లో భాగంగానే జీవో 29 జారీ
- గ్రూప్ 1 పరీక్ష రద్దు కావాలనటం లేదు
- అభ్యర్థులు రీషెడ్యూల్‌నే కోరుకుంటున్నారు
- లాఠీచార్జిలో పోలీసులు గర్భిణినీ కొట్టారు
- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజయ్

చలో సచివాలయం ఉద్రిక్తం

- అభ్యర్థులకు మద్దతుగా పాల్గొన్న బండి
- బీఆర్ఎస్ పార్టీ నేతలకు నిరసన సెగ
- అట్టుడికిన హైదరాబాద్‌లోని అశోక్‌నగర్

హైదరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రిజర్వేషన్ల రద్దుకు కుట్ర జరుగుతోందని, ఇందులో భాగంగానే జీవో 29 జారీ అయ్యిందని బీజేపీ నేత, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు ఉంచుతారా? రద్దు చేస్తారా? అన్నదానిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 పరీక్షను నిజాయితీగా నిర్వహించాలన్న ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. శనివారం గ్రూప్-1 అభ్యర్థులు హైదరాబాద్‌లో నిర్వహించిన చలో సచివాలయం ముట్టడి ర్యాలీలో బండి సంజయ్ పాల్గొన్నారు. దాదాపు నాలుగు గంటల పాటు ఉద్రిక్తత మధ్య జరిగిన ర్యాలీలో బండి సంజయ్‌ని పోలీసులు అదుపులో తీసుకొని.. బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తరలించారు. అక్కడే సంజయ్ విలేకరుల

మిగతా 12వ పేజీలో...

గ్రూప్-1 మెయిన్స్‌కు పటిష్ఠ భద్రత

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- ముత్యాలమ్మ గుడి ధ్వంసంపై సమగ్ర విచారణ
- సుజాత తెలంగాణ పోలీసుల అదుపులో లేరు: డీజీపీ

3

ఆర్థిక ఉగ్రవాదుల

భరతం పడతాం

రియల్ ఎస్టేట్‌ను దెబ్బతీయాలని, అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారు

- సోషల్ మీడియా, వాట్సాప్ వర్సిటీలో ప్రచారం
- అనుమతులున్న సంస్థలకు అండగా ఉంటాం
- హైడ్రా భూతం కాదు.. కబ్జాదారుల పనిపడుతుంది
- తాగేనీళ్లలో డ్రైనేజీ నీళ్లు కలిపినవాళ్లు కిరాతకులు
- బలుపు, అహంకారం చూసే కబ్జాలను కూలగొట్టినం
- ఫామ్‌హౌజ్‌ల కోసమే కేటీఆర్, హరీశ్ డ్రామాలు
- నిజనిర్ధారణ కమిటీ వేద్దామా.. అఖిలపక్షంగా వెళ్దామా?
- రాజీవ్ సద్భావన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి
- నిర్వాసితుల్ని ఒప్పించకుండా ఏమీ చేయమని భరోసా



డ్యూటీ మీట్‌లో పోలీసులకు జ్ఞాపిక అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నాడు కలవని వాళ్లు

నేడు పిలుస్తున్నారు

- గ్రూప్-1పై కావాలనే గందరగోళం
- ఎందుకు చేస్తున్నారో అర్థం చేసుకోండి
- అపోహ వీడి ఆందోళన విరమించండి
- 95 శాతం హాల్‌టికెట్లు డౌన్‌లోడ్
- మిగతా అభ్యర్థులూ తీసుకోండి: రేవంత్

గ్రూప్-1 వాయిదా కుదరదు!

నేడు ప్రభుత్వం ప్రకటించే అవకాశం

12

హైడ్రా ఇప్పటి వరకూ మూసీ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. మూసీ పునరుజ్జీవం వేరు.. హైడ్రా వేరు.. హైడ్రా అనగానే హరీశ్ రావు, కేటీఆర్, ఈటల బయటకు వస్తున్నారు. వారి కిరాయి మనుషులు తప్ప.. పేదోళ్లు ఎవ్వరూ బయటకు రావడం లేదు. పేదలూ.. నిశ్చింతంగా ఉండండి. మెరుగైన నష్ట పరిహారం, జీవితాన్ని అందించే మంచి విధానాన్ని తీసుకొస్తాం.

- సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): "రియల్ ఎస్టేట్‌ను దెబ్బతీయాలని, రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవాలని కొంతమంది చూస్తున్నారు. ఉన్నవీ లేనివీ చిలువలు పలువలు చేసి సోషల్ మీడియాలో పెడుతున్నారు. వాట్సాప్ వర్సిటీలో ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని ప్రయత్నం చేస్తున్నారు. ఆ ఆర్థిక ఉగ్రవాదుల భరతం పడతాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. అనుమతులున్న రియల్ ఎస్టేట్ సంస్థలు భయపడాల్సిన అవసరం లేదని, ఎవరైనా మీ దగ్గరకు వస్తే ప్రభుత్వ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు. వారికి అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు. సొంతంగా ఆస్తులు, అనుమతులున్నవారు ఎవ్వరూ భయపడాల్సిన పని లేదని, వారిని ఏవిధంగా కాపాడుకోవాలో ప్రభుత్వానికి తెలుసునని వ్యాఖ్యానించారు. హైడ్రా ఎవ్వరి పట్ల భూతం కాదని, ఆక్రమణలకు పాల్పడే బడా బాబుల భరతం పడుతుందని తేల్చి చెప్పారు. రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర కమిటీ

మిగతా 13వ పేజీలో...

పేదల కోసం 3 నెలలు కాదు.. మూడేళ్లు

మూసీ పక్కనుంటా!

14



- మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీకి డబ్బులు అవసరం
- మూటలు పంపేందుకే మూసీ ప్రాజెక్టు
- మేం చందా ఇస్తాం.. ఢిల్లీకి పంపు
- నాగోల్ ఎస్టీపీ పరిశీలనలో కేటీఆర్

ఇందిరమ్మ ఇళ్లు

నెలాఖరులోగా..

- తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 నుంచి 4 వేలు
- గోషామహల్‌లో పట్టాల పంపిణీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రానున్న నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ నెలాఖరు వరకు తొలివిడతలో నియోజకవర్గానికి 3500 నుంచి 4వేల వరకు ఇళ్లను కేటాయిస్తామని, అన్ని వర్గాల ప్రజలకు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో గోషామహల్ నియోజకవర్గానికి చెందిన 144 మంది పేదలకు

మిగతా 13వ పేజీలో...

సాగు భూములకే

రైతు భరోసా

- మంత్రివర్గ ఉప సంఘం నివేదిక ఇచ్చిన తర్వాతే..
- వచ్చే పంటకాలం నుంచే
- త్వరలో పంటల బీమా
- మంత్రి తుమ్మల

13

విమానాలకు

బెదిరింపుల మోత

2

- ఒక్కరోజే 30కిపైగా సర్వీసులకు.. అన్నీ ఒట్టివే
- వారంలో 70కిపైగా విమానాలకు హెచ్చరికలు
- పండగ సీజన్‌లో సంస్థలకు రూ.కోట్లలో నష్టం
- కంపెనీల సీఈవోలతో బీసీఏఎస్ డీజీ సమావేశం
- ఎన్నికలతో.. రాజకీయ కోణంపై అనుమానాలు



ముత్యాలమ్మ ఆలయం వద్ద భారీగా గుమిగూడిన ఆందోళనకారులు

సికింద్రాబాద్‌లో ఉద్రిక్తత

- ముత్యాలమ్మ గుడి వద్ద హిందూ సంఘాల ఆందోళన
- ఓ ప్రార్థనా మందిరంలోకి దూసుకెళ్లే యత్నం
- లాఠీచార్జ్‌తో ఆగ్రహం.. పోలీసులపైకి రాళ్లు, చెప్పులు
- ఇద్దరు బీజేపీ కార్యకర్తలు, ఏసీపీ, సీఐకి గాయాలు
- ఇంటర్నెట్ సేవల నిలిపివేత.. తెరుచుకోని దుకాణాలు
- బీజేపీ కార్యకర్తలకు కిషన్‌రెడ్డి, బండి పరామర్శ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం వద్ద హిందూ సంఘాల ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో పోలీసులు పలుమార్లు లాఠీ చార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తేవాల్సి వచ్చింది. పలువురికి గాయాలయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. హిందూ సంఘాల బంద్ పిలుపుతో

మిగతా 2వ పేజీలో...

పట్టించిన ఫోన్



- మద్యం మత్తులో వృద్ధురాలిపై లైంగికదాడికి యత్నించి హత్య
- అడ్డొచ్చిన ఆమె భర్తనూ కొడవలితో నరికి చంపిన ఉన్మాది
- తన మొబైల్‌ను వెతుక్కునే క్రమంలో హతుల సెల్ నుంచి కాల్
- దీంతో పట్టివేత.. రంగారెడ్డి జిల్లా కందుకూరులో ఘటన
- నిరుడు ఓ మహిళను చంపిందీ ఇతడే.. విచారణలో వెలుగులోకి

14

నిజామాబాద్‌లో మహిళపై గ్యాంగ్ రేప్.. నమ్మించి అఘాయిత్యానికి పాల్పడ్డ నలుగురు 3

రుణానికి భూ తనఖా?

- రూ.10 వేల కోట్ల సమీకరణకు యత్నం
- 'రుణ మాఫీ'కి అవసరమైన నిధుల కోసమే
- టీజీఐఐసీ భూముల తాకట్టుకు ప్రతిపాదనలు
- ఆడిటింగ్ కాకపోవడంపై ఆర్‌బీఐ అభ్యంతరం
- వెనక్కొచ్చిన దస్త్రం.. ఆడిటింగ్‌పై సర్కారు దృష్టి



హైదరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక వనరుల సమీకరణలో భాగంగా భూములను తాకట్టు పెట్టి, అప్పు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఐఐసీ) ఆధీనంలోని భూములను తనఖా పెట్టనుంది. ఈ మేరకు ఇప్పటికే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ఇండియా(ఆర్‌బీఐ)కు ప్రతిపాదనలు పంపించింది. వాస్తవానికి రైతు రుణమాఫీ ఇప్పటికే ప్రభుత్వం రూ.18వేల కోట్లకు పైగా వ్యయం చేసింది. ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలంటే... ఇంకా నిధుల అవసరం ఉంది. ఇందులో భాగంగానే టీజీఐఐసీ భూములను తనఖా పెట్టి రూ.10వేల కోట్లను అప్పుగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి ఇటీవలే ఆర్‌బీఐకి ప్రతిపాదనను పంపించింది. టీజీఐఐసీ అధీనంలోని భూములను తనఖా పెట్టుకుని, ఆర్థిక సంస్థల నుంచి రూ.10వేల కోట్ల అప్పు తీసుకోవడానికి అనుమతించాలని కోరింది. టీజీఐఐసీ పేరిటే ఈ రుణాన్ని తీసుకుంటామని, దీనికి భరోసాగా భూములను తనఖా పెడతామని వివరించింది. ఈ రుణాన్ని ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి

మిగతా 13వ పేజీలో...

బీమాపై జీఎస్టీ మినహాయింపు!

- టర్మ్ పాలసీల ప్రీమియంపై అందరికీ..
- ఆరోగ్య బీమాపై సీనియర్ సిటిజన్లకు!
- మిగతావారికి 5 లక్షల్లోపు కవరేజీ వరకు
- 20 లీటర్లు, ఆపై ప్యాకేజ్డ్ తాగునీరు,
- 10 వేలలోపు సైకిళ్లపై 5 శాతానికి తగ్గింపు
- ఖరీదైన బూట్లు, వాచీలపై 28 శాతం
- మంత్రుల సంఘం కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీ, అక్టోబరు 19: టర్మ్, ఆరోగ్య బీమాల ప్రీమియంపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విషయంలో మంత్రుల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. టర్మ్ పాలసీలు, సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీని మినహాయించాలని ప్రతిపాదించింది. సీనియర్ సిటిజన్లు మినహా మిగతావారికి రూ.5 లక్షల్లోపు కవరేజీ

మిగతా 2వ పేజీలో...



పారిశ్రామిక వ్యర్థాలతో ఢిల్లీలోని కాళిందీ కుంజ్ వద్ద యమునా నదిలో విషపు నురగలు ఇలా మేఘాల్లా దట్టంగా ఏర్పడ్డాయి. దీంతో, ఆప్ ప్రభుత్వంపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. కాలుష్యాన్ని అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఢిల్లీ విషపు వాయువుల చాంబర్‌లాగా మారిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది.

జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదాకు ఎల్జీ ఆమోదం

శ్రీనగర్, అక్టోబరు 19: జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా ఇవ్వాలని సీఎం ఒమర్ అబ్దుల్లా ఆధ్వర్యంలోని మంత్రిమండలి చేసిన తీర్మానానికి లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) మనోజ్ సిన్హా ఆమోదం తెలిపారు. తీర్మానాన్ని యథాతథంగా ఆమోదించినట్లు ప్రభుత్వ అధికార ప్రతినిధి ఒకరు శనివారం మీడియాకు చెప్పారు. లెఫ్టినెట్ గవర్నర్ ఆమోదం తెలపడంతో జమ్మూకశ్మీర్‌కు కేంద్ర పెద్దలు త్వరలోనే రాష్ట్ర హోదా కల్పిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ అంశంపై త్వరలోనే సీఎం ఒమర్ అబ్దుల్లా.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులతో భేటీ కానున్నట్లు నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు తెలిపారు. మరోవైపు ప్రొటెం స్పీకర్‌గా ముబారిక్ గుల్‌ను నియమిస్తూ ఎల్జీ నిర్ణయం తీసుకున్నారు. నవంబరు 4న జమ్మూకశ్మీర్ అసెంబ్లీ సమావేశం జరగనుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

ఝార్ఖండ్‌లో సీట్ల పంపకంపై ఆర్జేడీ అసంతృప్తి

రాంచీ, అక్టోబరు 19: వచ్చే నెలలో ఎన్నికలు జరగనున్న ఝార్ఖండ్‌లో ఇండియా కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకం విభేదాలకు దారితీసింది. మొత్తం 81 సీట్లున్న ఈ రాష్ట్రంలో జేఎంఎం, కాంగ్రెస్ 70 సీట్లలో పోటీ చేయనున్నట్లు సీఎం హేమంత్ సోరెన్ శనివారం ప్రకటించారు. దీనిపై ఆర్జేడీ అసంతృప్తి వ్యక్తం చేసింది. తమకు, వామపక్షాలకు కలిపి 11 సీట్లు మాత్రమే ఇస్తారా? అంటూ మండిపడింది. 15 నుంచి 18 సీట్లలో తమకు గట్టి పట్టు ఉందని, అక్కడ బీజేపీని సొంతంగా ఓడిస్తామని పేర్కొంది. అయితే, ఆర్జేడీ విమర్శలను కాంగ్రెస్ ఖండించింది. కూటమిలో ఎలాంటి అసంతృప్తి లేదని ఆ పార్టీ నాయకుడు పవన్ ఖేరా స్పష్టం చేశారు. అన్ని పక్షాలతో సమగ్రంగా చర్చించాకే 70 సీట్లలో జేఎంఎం-కాంగ్రెస్ పోటీకి నిర్ణయించాయని కాంగ్రెస్ నాయకుడు గులామ్ అహ్మద్ మిర్ తెలిపారు. కాగా, ఝార్ఖండ్‌లో విపక్ష ఎన్డీఏ కూటమి నామినేషన్ల దాఖలు మొదలైన శుక్రవారమే సీట్ల పంపకం పూర్తిచేసింది. బీజేపీ 68, ఏజేఎస్‌యూ 10, జేడీయూ 2, ఎల్జేపీ (రాంవిలాస్) ఒక్కో స్థానంలో పోటీ చేయనున్నాయి. బీజేపీ 66 మందితో కూడిన జాబితాను శనివారం రాత్రే ప్రకటించింది.

రైల్వేలో రిటైర్ అయిన వాళ్లకు మళ్లీ ఉద్యోగాలు

» సిబ్బంది కొరతతో రైల్వే బోర్డు నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబరు 19: రిటైర్డ్ ఉద్యోగులకు రైల్వే బోర్డు మళ్లీ ఉద్యోగాలు ఇవ్వనుంది. రైల్వేలలో సిబ్బంది కొరత పెద్ద సమస్యగా మారడంతో ఈ నిర్ణయం తీసుకుంది. దేశ వ్యాప్తంగా వివిధ జోన్లలో 25 వేల ఖాళీల భర్తీకి రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ప్రారంభించింది. 65 ఏళ్ల లోపు వయసు గల రైల్వే రిటైర్డ్ ఉద్యోగులను సూపర్‌వైజర్లు, ట్రాక్‌మెన్‌లుగా తాత్కాలికంగా విధుల్లోకి తీసుకోనుంది. తమ సర్వీసులో చివరిసారి తీసుకున్న జీతం ఇవ్వడంతో పాటు ట్రావెల్ అలవెన్స్‌లు, అధికారిక టూర్లు వంటి ప్రయోజనాలు ఉంటాయి. అయితే జీతంలో పెరుగుదల లేదా ఇతర అదనపు ప్రయోజనాలు ఉండవు. పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుంది. అవసరాన్ని బట్టి పదవీకాలాన్ని పొడిగించే అవకాశముంటుంది. రైల్వే ప్రమాదాలు, ఉద్యోగులపై పని ఒత్తిడి పెరగడంతో సమస్య పరిష్కారానికి త్వరితగతిన రిటైర్డ్ ఉద్యోగులను తీసుకోవాలని నిర్ణయించారు.

30కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు

» వారం రోజుల్లో 70కిపైగా విమానాలకు..

» కంపెనీల సీఈవోలతో బీసీఏఎస్ డీజీ భేటీ

» పండగ సీజన్‌లో రూ.కోట్లలో నష్టం



న్యూఢిల్లీ, అక్టోబరు 19: విమానాలకు బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. శనివారం ఒక్కరోజే ఏకంగా 30కిపైగా విమానాలకు బెదిరింపులు వచ్చాయి. అయితే, అవన్నీ కూడా ఒట్టివేనని తనిఖీల్లో తేలింది. ఎయిర్ ఇండియా, ఇండిగో, ఆకాశ ఎయిర్, విస్తారా, స్పైస్ జెట్, స్టార్ ఎయిర్, అలయెన్స్ ఎయిర్ సంస్థలకు చెందిన విమానాలకు తాజాగా బెదిరింపులు వచ్చాయి. వీటిలో దేశీయ సర్వీసులతో పాటు అంతర్జాతీయ సర్వీసులు కూడా ఉన్నాయి. విస్తారాకు చెందిన 'ఉదయ్‌పూర్-ముంబయి' విమానం మరుగుదొడ్డిలో.. విమానంలో బాంబు పెట్టినట్లుగా ఓ బెదిరింపు లేఖ కూడా లభ్యమైంది. వారం రోజుల్లో ఇప్పటి వరకూ కనీసం 70 విమానాలకు ఈ రకంగా బాంబు బెదిరింపులు వచ్చాయి. లండన్, అమెరికా, జర్మనీ, కెనడా తదితర దేశాల నుంచి ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ఇవి వస్తున్నట్లు ఇంటర్నెట్ ప్రొటోకాల్ (ఐపీ) అడ్రస్‌ల ద్వారా అధికారులు గుర్తించారు. ఈ వరుస ఘటనల నేపథ్యంలో, దేశీయ విమానయాన సంస్థల సీఈఓలతో 'బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ' (బీసీఏఎస్) డైరెక్టర్ జనరల్ జుల్ఫికర్ హసన్ శనివారం సమావేశమయ్యారు. నకిలీ బెదిరింపుల నివారణకు అవసరమైన చర్యల గురించి చర్చించారు. అనంతరం హసన్ ఒక ప్రకటన జారీ చేస్తూ.. 'భారత గగనతలం పూర్తిగా సురక్షితంగా ఉంది. ప్రస్తుత పరిస్థితిని ఎదుర్కోవటానికి పటిష్ఠమైన నిబంధనలు అమలులో ఉన్నాయి. ఎటువంటి భయాందోళన లేకుండా విమానయానం చేయవచ్చని ప్రయాణికులకు హామీ ఇస్తున్నాం' అని పేర్కొన్నారు. బీసీఏఎస్‌తోపాటు, పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) త్వరలో నూతన మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బెదిరింపు ఘటనలకు సంబంధించి ముంబై, ఢిల్లీల్లో డజనుకుపైగా కేసులు నమోదయ్యాయి. బుధవారం 17 ఏళ్ల బాలుడిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. 4 విమానాలకు అతడు బెదిరింపులు పంపినట్లు వెల్లడైంది. తన స్నేహితులతో గొడవల నేపథ్యంలో వారిని ఇరికించటానికి ఈ పని చేసినట్లు విచారణలో ఆ బాలుడు వెల్లడించాడు.


రూ.కోట్లలో నష్టం

నకిలీ బాంబు బెదిరింపుల వల్ల విమానయాన సంస్థలకు తీవ్రమైన ఆర్థిక నష్టం కలుగుతోంది. విమానాలను మార్గ మధ్యంలోనే దింపివేయటం, ప్రయాణికులకు వసతి ఏర్పాట్లు చేయటం, వేరే విమానాల్లో వారిని గమ్యస్థానానికి పంపించటం, ఇంధనం వృథా మొదలైన వాటితో.. ఒక్కో బాంబు బెదిరింపు ఘటనలో కంపెనీపైన సగటున రూ.3 కోట్ల భారం పడుతున్నట్లు సమాచారం. ఈ నెల 14న ఎయిర్‌ఇండియా బోయింగ్ 777 విమానం ముంబై నుంచి న్యూయార్క్‌కు బయల్దేరింది. 16 గంటలపాటు ప్రయాణించాల్సిన విమానం.. బాంబు బెదిరింపుతో రెండు గంటల్లోనే ఢిల్లీలో అత్యవసరంగా ల్యాండ్ అయ్యింది. అలాగే, ఎయిర్ ఇండియాకే చెందిన ఢిల్లీ-షికాగో విమానానికి కూడా ఈ నెల 15వ తేదీన బాంబు బెదిరింపు రావటంతో విమానాన్ని కెనడాలోని ఓ నగరంలో దింపివేశారు. ఎంతో డిమాండ్ ఉండే పండగ సీజన్‌లో ఈ విధమైన బాంబు బెదిరింపులతో విమానయాన సంస్థలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

రాజకీయ కోణం?

మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో.. విమానాలకు బెదిరింపులు మొదలుకావటం, అవి రోజురోజూకూ పెరిగిపోవటంతో.. వీటి వెనుక ఏమైనా రాజకీయ కుట్ర దాగి ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా.. పలు రాష్ట్రాల్లో ముఖ్యంగా ఉత్తరాదిన వందలాది స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చిన సంగతిని పలువురు గుర్తు చేస్తున్నారు. అప్పట్లో పలు దశల పోలింగులో, పోలింగ్‌కు సరిగ్గా 2-3 రోజుల ముందు స్కూళ్లలో బాంబు పెట్టినట్లుగా బెదిరింపులు వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. ఇప్పటి విమానాల బాంబు బెదిరింపుల్లాగే నాడు స్కూళ్లకు వచ్చిన బెదిరింపులన్నీ ఒట్టివేనని తేలింది. పిల్లలు, తల్లిదండ్రులు మాత్రం ఆందోళనకు గురయ్యారు.

లోకం తీరు



నెతన్యాహు ప్రైవేట్ నివాసంపై హెజ్‌బొల్లా డ్రోన్ దాడి

టెల్ అవీవ్, గాజా, బీరుట్, అక్టోబరు 19: సెంట్రల్ ఇజ్రాయెల్ సిజేరియా నగరంలోని నెతన్యాహు ప్రైవేట్ నివాసంపై హెజ్‌బొల్లా శనివారం డ్రోన్ దాడి జరిపింది. దాడి సమయంలో ఇంట్లో నెతన్యాహు, ఆయన సతీమణి సారా లేరని, ఎవ్వరికీ గాయాలు కాలేదని ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం స్పష్టం చేసింది. లెబనాన్ నుంచి 70 కిలోమీటర్ల దూరంలోని సిజేరియాలో ఉన్న నెతన్యాహు ప్రైవేట్ నివాసంపై హెజ్‌బొల్లా డ్రోన్ దాడి జరపడాన్ని భద్రతా వైఫల్యంగా భావించిన ఇజ్రాయెల్ ఆర్మీ దీనిపై దర్యాప్తునకు ఆదేశించింది. హెజ్‌బొల్లా మూడు డ్రోన్లు ప్రయోగించగా తాము రెండింటిని కూల్చివేశామని ప్రకటించింది. డ్రోన్ దాడిపై నెతన్యాహు స్పందించారు. తమనెవరూ నిలువరించలేరని, యుద్ధంలో విజయం సాధించి తీరతామని అన్నారు. ఈ డ్రోన్ దాడిలో ఇరాన్ ప్రమేయం ముందని ఓ ప్రభుత్వ అధికారి ధ్రువీకరించారంటూ ఇజ్రాయెల్ మీడియా సంస్థ ఛానెల్ 12 తెలిపింది. మరోవైపు, గాజాలో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 50 మంది చనిపోయారు.

ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్‌గా విజయ కిశోర్



న్యూఢిల్లీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) నూతన చైర్‌పర్సన్‌గా విజయ కిశోర్ రహట్కర్ నియమితులయ్యారు. ఆమెతో పాటు కమిషన్ సభ్యురాలిగా అర్చనా మజుందార్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరి పదవీకాలం మూడు సంవత్సరాలు. విజయ కిశోర్ గతంలో 2016 నుంచి 2021 వరకు మహారాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు.

బీమాపై జీఎస్టీ మినహాయింపు!

(మొదటి పేజీ తరువాయి)

ఉండే ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీని తీసేయాలని సిఫారసు చేసింది. కవరేజీ రూ.5 లక్షలు దాటిన పాలసీలకు చెల్లించే ప్రీమియంపై 18% జీఎస్టీని కొనసాగించాలని సూచించింది. టర్మ్ పాలసీలపై అందరికీ జీఎస్టీ ఎత్తివేయాలని ప్రతిపాదించింది. వీటిపైనా ప్రస్తుతం 18% జీఎస్టీ వసూలు చేస్తున్నారు. ఈ సిఫారసులపై త్వరలో జరిగే జీఎస్టీ మండలి భేటీలో తుది నిర్ణయం తీసుకుంటారు. బీమా ప్రీమియంలపై జీఎస్టీ తొలగించాలన్న డిమాండ్లు వస్తున్న తరుణంలో గత నెల జీఎస్టీ కౌన్సిల్ సమావేశమైంది. దీనిపై చర్చించేందుకు మంత్రుల సంఘం ఏర్పాటైంది. కాగా, 20 లీటర్లు, అంతకుమించి ప్యాకేజ్డ్ తాగునీటిపై జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి, నోటు పుస్తకాలు, రూ.10వేల కంటే తక్కువ ధర సైకిళ్లపై 12 నుంచి 5 శాతానికి తగ్గించాలని మంత్రుల సంఘం ప్రతిపాదించింది. రూ.15వేల కంటే ఎక్కువైన బూట్లు, రూ.25వేల కంటే ఖరీదైన చేతి గడియారాలపై జీఎస్టీని 18% నుంచి 28శాతానికి పెంచాలని సిఫారసు చేసింది.

భారత దౌత్యవేత్తలపై నిఘా!

» కెనడా విదేశాంగ మంత్రి మెలానీ వెల్లడి



టొరంటో, అక్టోబరు 19: కెనడాలోని మిగిలిన భారత దౌత్యవేత్తలపై గట్టి నిఘా ఉంచామని ఆ దేశ విదేశాంగ మంత్రి మెలానీ జోలీ తెలిపారు. "వియన్నా ఒప్పందాన్ని ఉల్లంఘించిన, కెనడా పౌరుల జీవితాలను ఇబ్బందుల్లోకి నెట్టేందుకు ప్రయత్నించిన ఏ ఒక్క దౌత్య వేత్తను మా ప్రభుత్వం ఉపేక్షించదు" అని శుక్రవారం తెలిపారు. సోమవారం భారత ప్రభుత్వం కెనడాకు చెందిన ఆరుగురు దౌత్యవేత్తలను బహిష్కరించిన దరిమిలా.. కెనడా కూడా తమ దేశంలోని ఆరుగురు భారత దౌత్యవేత్తలను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించింది. ఈ నేపథ్యంలో జోలీ మీడియాతో మాట్లాడుతూ.. భారత్‌ను రష్యాతో పోల్చారు. భారత దౌత్యవేత్తలకు కెనడాలో జరిగిన హత్యలు, హత్యా బెదిరింపులతో సంబంధాలు ఉన్నాయని తమ జాతీయ పోలీసు దళం గుర్తించినట్టు సంచలన ఆరోపణలు చేశారు. "కెనడా గడ్డపై ఇలాంటి అంతర్జాతీయ అణిచివేతలను చూస్తూ ఊరుకోం. ఇలాంటి ఘటనలు ఐరోపాలో చూశాం. జర్మనీ, బ్రిటన్‌లలో రష్యా ఇలాంటి దురాగతాలకు పాల్పడింది" అని జోలీ అన్నారు.

భారత జర్నలిస్టులపై కూడా

భారత జర్నలిస్టులు, సోషల్ మీడియా యాక్టివిస్టులపైనా కెనడా ప్రభుత్వం డేగ కన్ను సారించింది. వారి ప్రతి కదలికను నిశితంగా పరిశీలిస్తోంది. నిజ్జర్ హత్యపై కెనడా ప్రధాని ట్రూడో చేసిన వ్యాఖ్యల అనంతరం.. అంతర్జాతీయ సమాచార మార్పిడిలో అవకతవకలు, జర్నలిస్టుల వైఖరికి సంబంధించి కెనడా ర్యాపిడ్ రెస్పాన్స్ మెకానిజం(ఆర్‌ఆర్‌ఎం) సెప్టెంబరు 26న ఓ నివేదిక రూపొందించింది. ఈ నివేదికలో.. "గోడి మీడియా... ప్రధాని ట్రూడో సహా కెనడా సంస్థలను ఉగ్రవాదానికి దోహదపడే సంస్థలుగా పేర్కొంది" అని ఆర్‌ఆర్‌ఎం వెల్లడించింది.

సికింద్రాబాద్‌లో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)



సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ గుడి వద్ద నిరసన కారులపై పోలీసుల లాఠీ చార్జ్

ఆయా ప్రాంతాల్లో ఒక్క షాపు కూడా తెరుచుకోలేదు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనకు నిరసనగా వీహెచ్‌పీ (విశ్వ హిందూ పరిషత్) శనివారం ర్యాలీ చేపట్టింది. ఇందులో పలు ధార్మిక సంఘాలు పాల్గొనగా.. వేలాదిగా జనం తరలివచ్చారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ వారు డిమాండ్ చేశారు. ఉదయం మహాకాళి ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బాటా, మోండా చౌరస్తా మీదుగా ముత్యాలమ్మ ఆలయం వరకు సాగింది. ఆ సమయంలో కొంతమంది సమీపంలోని ఓ వర్గానికి చెందిన ప్రార్థనా మందిరం వైపు దూసుకెళ్లేందుకు యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. అయినా వారు వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు లాఠీ చార్జ్ చేశారు. ఇంతలోనే మరో ర్యాలీ ఆలయానికి చేరుకోగా.. ఆందోళన తీవ్రమైంది. దీంతో పోలీసులు మరోసారి లాఠీచార్జ్ చేయగా.. పలువురికి గాయాలయ్యాయి. ఇద్దరు బీజేపీ కార్యకర్తల తలలు పగిలాయి. ఈ నేపథ్యంలోనే పోలీసులపై ఆందోళనకారులు రాళ్లు, చెప్పులు, వాటర్ బాటిళ్లు విసిరారు. నిరసనకారులను అడ్డుకోవడానికి పోలీసులు మహిళా కానిస్టేబుళ్లను ముందు వరుసలో నిలబెట్టి నిలువరించే ప్రయత్నం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అదనపు బలగాలను మోహరించారు. కొంతమందిని ఆలయం వద్ద నుంచి బలవంతంగా పంపించేశారు. ఈ సమయంలోనే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రధాన రోడ్డుపై పెద్ద సంఖ్యలో ఆందోళనకారులు చేరుకుని రాస్తారోకో చేయడంతో మరోసారి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చివరకు సాయంత్రం ఆలయం ముందున్న వారు వెళ్లి పోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం రాస్తారోకో చేస్తున్న వారిని సైతం పోలీసులు లాఠీలు ఝుళిపిస్తూ పంపించేశారు. అదనపు సీపీ శేఖర్ రెడ్డి, నార్త్‌జోన్ డీసీపీ రశ్మీ పెరుమాల్, టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్రల పర్యవేక్షణలో పోలీసులు నిరసనకారులను కట్టడి చేశారు. ఇటు ర్యాలీలో పాల్గొన్న బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. శాంతిభద్రతలను కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు చేపట్టి రాబోయే కాలంలో హిందూ దేవాలయాలపై ఎవడూ కన్నెత్తి చూడకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'ప్రశాంతంగా ఉన్న నగరంలో అల్లర్లు సృష్టించడానికి కుట్రలు జరుగుతున్నాయి. కొందరు ఉన్మాదులు ఓ హోటల్‌లో సమావేశమై మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు' అని నిలదీశారు.

అంతకుముందు నిరసనకారులు సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయం ఎదుట ఉన్న మెట్రోపోలీస్ హోటల్‌పై దాడికి యత్నించారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడితో పాటు సుమారు 150 మంది ఆ హోటల్‌లో కొద్ది రోజుల క్రితం సమావేశమయ్యారని తెలిసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికే ఆ హోటల్ సీజ్ చేసినా.. దానిలోకి దూసుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకుని లాఠీ చార్జ్ చేశారు. ఈ నేపథ్యంలోనే పరిస్థితి చేయిదాటిపోతుందని గుర్తించిన పోలీసులు.. సికింద్రాబాద్ ప్రాంతంలో కొద్దిసేపు ఇంటర్నెట్ సేవలను నిలిపేశారు. మరోవైపు.. వీహెచ్‌పీ పిలుపు మేరకు సికింద్రాబాద్‌లో వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ప్యాట్నీ, ప్యారడైజ్, జనరల్ బజార్, పాన్‌బజార్, మహంకాళి వీధి, బర్తన్ బజార్, మోండా మార్కెట్ తదితర ప్రాంతాల్లోని దుకాణాలు, వర్తక, వాణిజ్య సంస్థలు, హోటళ్లు తెరుచుకోలేదు.

ర్యాలీకి అనుమతే లేదు..: నార్త్‌జోన్ డీసీపీ

హిందూ ధార్మిక సంఘాలు తలపెట్టిన ర్యాలీకి ఎటువంటి అనుమతి లేదని నార్త్‌జోన్ డీసీపీ రశ్మీ పెరుమాల్ తెలిపారు. ఎంత సర్దిచెప్పినా వినకుండా ఓ వర్గం ప్రార్థనా మందిరాన్ని కూల్చేసే ఆలోచనతో దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతోనే లాఠీచార్జ్ చేయాల్సి వచ్చిందన్నారు. మీడియాతో ఆమె మాట్లాడుతూ.. దాదాపు 6 వేల మంది ర్యాలీలో పాల్గొన్నారని.. రెండు గ్రూపులుగా ఆలయం వద్దకు వచ్చి ఆందోళన సృష్టించారన్నారు. ఓ హోటల్ సమీపంలో కొందరు ఆర్టీసీ బస్సులపై రాళ్లు రువ్వారని.. సీసీ కెమెరాల ఆధారంగా వారిని గుర్తించామన్నారు. రెండు, మూడ్రోజుల్లో వారిపై కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. ఆందోళనల్లో కొందరు నిరసనకారులతో పాటు ఓ ఏసీపీ, సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయని చెప్పారు.

హనుమంతుని విగ్రహంపై దాడికి నిరసనగా సదాశివపేట్‌లో బంద్

సదాశివపేట/సంగారెడ్డి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విగ్రహ దాడులను నిరసిస్తూ సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో బంద్ పాటించారు. స్థానిక ప్రభుమందిరం వద్ద గల హనుమాన్ మందిరంలోని వినాయక విగ్రహం ధ్వంసం చేసిన ఘటనను నిరసిస్తూ హిందూసంఘాల పిలుపుమేరకు వ్యాపార, వాణిజ్య, సముదాయాలతో పాటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. నిరసనకారులు ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, హిందూవాహిని సంఘాలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా.. ఆలయాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామని, దోషులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని హిందూ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. అనంతరం సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కాగా, వినాయక విగ్రహం ధ్వంసం చేసింది పశువులని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ స్పష్టం చేశారు. తాళం లేకపోవడంతో ఆవులు గుడిలోకి ప్రవేశిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అవి వినాయక, హనుమాన్ విగ్రహాలను నాకాయని స్పష్టం చేశారు.

బీజేపీ కార్యకర్తలకు కేంద్రమంత్రుల పరామర్శ

లాఠీచార్జ్‌లో బీజేపీ కార్యకర్తలు సికింద్రాబాద్ పికెట్‌కు చెందిన వెంకటేశ్, ఓల్డ్‌బోయిన్‌పల్లికి చెందిన సాయికుమార్‌కు తీవ్ర గాయాలవ్వగా.. వారిని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పరామర్శించారు. వెంకటేశ్ తలకు 8 కుట్లు పడగా.. కేంద్రమంత్రులు వేర్వేరుగా ఇంటికి వెళ్లి కలిశారు. భయపడొద్దని, కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.. ఇటు సాయి తలకు 6 కుట్లు పడగా.. ఆయన ఇంటి వెళ్లి సంజయ్ పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆలయాలపై దాడులు చేస్తున్న మతోన్మాదులపై చర్యలు తీసుకోకుండా.. శాంతియుతంగా నిరసన చేస్తున్న హిందువులపై లాఠీచార్జ్ చేయడం సిగ్గు చేటని మండిపడ్డారు.

మానసిక సమస్యలపై ప్రచారానికి పర్వతారోహణ

» 55 రోజుల యాత్రకు సిద్ధమైన సతీశ్ గోగినేని

» సౌత్‌పోల్ పర్వతారోహణ ప్రారంభించనున్న తొలి భారతీయుడు

» కార్పొరేట్ కంపెనీలు చేయూతనివ్వాలని విజ్ఞప్తి



సతీశ్ గోగినేని

హైదరాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఏ సాహసం వెనుకైనా రికార్డు సృష్టించాలనో.. లేదంటే ఉన్న రికార్డును బద్దలు కొట్టాలనో తపన ఉండటం సహజం. కానీ ఆయన సాహసం వెనుక సామాజిక శ్రేయస్సు ఉంది. ఆయనే హైదరాబాద్‌కు చెందిన సతీశ్ గోగినేని. పర్వతారోహకుడైన ఆయన ప్రస్తుతం రకరకాల మానసిక సమస్యలతో బాధపడే ప్రజలకు, ఆ సమస్యల చికిత్సపై అవగాహన కల్పించేందుకు భారీ సాహసానికి సిద్ధమయ్యారు. అదే 55 రోజుల పాటు సుదీర్ఘంగా సాగే సౌత్ పోల్ యాత్ర! సతీశ్ ఇంటర్ దాకా హైదరాబాద్‌లోనే చదివారు. పుణెలో బీటెక్ పూర్తిచేసి, అమెరికాలో ఎంఎస్ చదివి అక్కడే స్థిరపడ్డారు. పాఠశాల విద్య అనంతరం పర్వతారోహణపై శిక్షణ పొంది.. అనేక పర్వతాలను సునాయసంగా అధిరోహించారు. రెండేళ్ల క్రితం ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరాన్నీ సతీశ్ అధిరోహించారు. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద పర్వతం మౌంట్ లోట్సేను 19 గంటల్లోనే అధిరోహించి ఈ ఘనత సాధించిన తొలి భారతీయుడయ్యారు. లా ప్లాటా (5968 మీటర్లు), మౌంట్ డేనాలీ (6190 మీటర్లు), మౌంట్ మకాలూ (6600 మీటర్లు), సెరో అకాంకగువ (6961 మీటర్లు), మౌంట్ అన్నపూర్ణ-1 (8091 మీటర్లు), మౌంట్ ధౌలగిరి (8167 మీటర్లు), మౌంట్ లోట్సే (8516 మీటర్లు).. పర్వతాలను అధిరోహించిన తొలి భారతీయుడు సతీశ్ గోగినేని కావడం గమనార్హం. అయినా ఇంకా సాధించాలన్న తాజాగా ఏ భారతీయుడూ వెళ్లని సౌత్ పోల్ యాత్రకు సిద్ధమవుతున్నారు సతీశ్. ఇది నవంబరు18న ప్రారంభమై ఏకధాటిగా 55 రోజులు సాగనుంది. జనవరి7న ముగియనుంది. రెండేళ్ల క్రితం సతీశ్ సోదరి స్పందన మానసిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని.. మానసిక సమస్యలు భరించలేకే ఆమె ప్రాణాలు కోల్పోయిందని సతీశ్ చెప్పారు. మానసిక చికిత్స అంటే ప్రజల్లో, సమాజంలో ఒకరకమైన దురభిప్రాయం ఉందని, హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్, వైజాగ్‌లోని మెంటల్ హాస్పిటల్ అంటేనే.. ఏదో పిచ్చోళ్లు వెళ్లే ఆస్పత్రి అన్న అపోహ ఉందని.. ఫలితంగా మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు, చికిత్సకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానసిక వైద్యం, చికిత్స గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో రెండేళ్ల నుంచి తాను పర్వతారోహణ చేస్తున్నానని సతీశ్ చెప్పారు. ఆయన కృషిని ఇప్పటికే అనేకమంది ప్రముఖులు ప్రశంసించారు. మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ సతీశ్ ఉన్నత ఆశయాన్ని ప్రత్యేకంగా అభినందించారు. మానసిక వైద్యంపై సమాజానికి అవగాహన కల్పించాలన్న లక్ష్యంతోనే వచ్చేనెలలో సౌత్ పోల్ యాత్రకు సతీశ్ సిద్ధమవుతున్నారు. ఇది అత్యంత ఖర్చుతో కూడుకున్నదని, ఉన్నత ఆశయం కోసం చేపట్టబోయే ఈ యాత్రకు కార్పొరేట్ కంపెనీలు, పారిశ్రామికవేత్తలు సహకారం అందించాలని సతీశ్ గోగినేని విజ్ఞప్తి చేస్తున్నారు.

'నా శరీరాన్ని ప్రయోగశాల చేశారు'

» సీఎంఆర్ ఆస్పత్రి ఎదుట ఓ మహిళ ఆందోళన



సీఎంఆర్ ఆస్పత్రి వద్ద బాధితురాలు, ఆమె కుటుంబీకులు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శస్త్రచికిత్సల పేరిట వైద్యులు తన శరీరాన్ని ప్రయోగశాలగా వాడుకున్నారని ఆరోపిస్తూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కండ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రి వద్ద ఓ మహిళ శనివారం ఆందోళనకు దిగింది. తన కుటుంబసభ్యులతో కలిసి ఆస్పత్రి వద్దకు న్యాయం కోరింది. మేడ్చల్‌కు చెందిన అరుణ అనే మహిళ అనారోగ్యంతో గత అక్టోబరులో సీఎంఆర్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించింది. గర్భసంచి సమస్యతో అరుణ రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించిన వైద్యులు శస్త్రచికిత్స చేసి గర్భసంచి తొలగించారు. అనంతరం అరుణ మూత్రనాళంలో కొత్త సమస్య ఉత్పన్నమై ఆరోగ్యం దెబ్బతినగా వైద్యులు మరో శస్త్రచికిత్స నిర్వహించారు. అయినా, ఆరోగ్యం కుదుటపడకపోవడంతో పరీక్షించిన వైద్యులు మళ్లీ శస్త్రచికిత్స చేయాలని సూచించారు. నెలలు గడుస్తున్నా నయం కాకపోవడంతో అరుణ మరో ప్రైవేటు ఆస్పత్రిని సంప్రదించగా.. సీఎంఆర్ వైద్యులు సరైన విధానంలో చికిత్స అందించలేదని, మళ్లీ శస్త్రచికిత్స చేయాలని, రూ.5లక్షలు ఖర్చవుతాయని తెలిపారు. దీంతో ఆగ్రహించిన అరుణ, తన కుటుంబసభ్యులతో కలిసి వచ్చి సీఎంఆర్ ఆస్పత్రి యాజమాన్యాన్ని నిలదీసింది. అనుభవం లేని వైద్యులతో శస్త్రచికిత్సలు చేయించి తన శరీరాన్ని ప్రయోగశాలగా వాడుకున్నారని ఈ సందర్భంగా ఆరోపించింది. తనకు నష్టపరిహారం చెల్లించాలని, శస్త్ర చికిత్సకు అవసరమైన రూ.5లక్షలను సీఎంఆర్ యాజమాన్యమే భరించాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం స్పందించి సీఎంఆర్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం కోరింది. కాగా, శస్త్రచికిత్స అనంతరం కోలుకునేందుకు కొందరి శరీరాలు సహకరించక కొత్త ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, అరుణ విషయంలోనూ అదే జరిగిందని సీఎంఆర్ ఆస్పత్రి డీన్ వెంకటరామయ్య పేర్కొన్నారు. తిరిగి శస్త్ర చికిత్స చేయటానికి తాము సిద్ధంగా ఉన్నా సదరు రోగి అంగీకరించటం లేదన్నారు.

ఐఏఎస్ అమోయ్ కుమార్‌కు ఈడీ నోటీసులు

హైదరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్, సీనియర్ ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీ చేసింది. ఆయన రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో జరిగిన భూకేటాయింపుల్లో అవకతవకలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు నోటీసులు పంపింది. బుధవారం(23వ తేదీన) విచారణకు హాజరు కావాలని సమన్లలో పేర్కొంది. బీఆర్‌ఎస్ హయాంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా సుదీర్ఘ కాలం పని చేసిన అమోయ్ కుమార్ ప్రస్తుతం పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా ఉన్నారు. అయితే, అబ్దుల్లాపూర్ మెట్ మండలం పిగ్లిపూర్ రెవెన్యూ పరిధిలోని 17వ నెంబర్ సర్వే నెంబర్‌లో ప్రభుత్వ రికార్డుల ప్రకారం 386 ఎకరాల భూమి ఉండగా అందులో 61 ఎకరాలు ప్రభుత్వ భూమి. ఇందులోని 53 ఎకరాల సీలింగ్ భూమిలో 16 మంది రైతులకు 45 ఎకరాలు ఉంది. ఈ భూమిని ఆ రైతుల కుటుంబాలు ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాయి. అయితే, సర్వే నెంబర్ 17లోని 26 ఎకరాల ప్రైవేటు భూమిలో మెరుగు గోపాల్ యాదవ్ అనే వ్యక్తి వెంచర్ వేసి సీలింగ్ భూమిని కూడా కలుపుకున్నాడు. దీనిపై రైతులు.. పోలీసులకు, రెవెన్యూ అధికారులకు, అప్పటి కలెక్టర్ అమోయ్ కుమార్‌కు ఫిర్యాదులు చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదు. బీఆర్‌ఎస్ నేతల అండతో సదరు రియల్టర్ తమ భూములను సొంతం చేసుకున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలోనే అమోయ్ కుమార్‌ను ఈడీ విచారణకు పిలిచినట్టు సమాచారం. ఈ కేసుకు సంబంధించి ఈసీఐఆర్(ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) నమోదైంది. ఆయన్ను నిందితుడుగా కానీ సాక్షిగా కానీ పిలవలేదని భూలావాదేవీలకు సంబంధించి ఆయన పాత్ర ఏమేరకు ఉందో తెలుసుకోవాల్సి ఉందని ఈడీ వర్గాలు తెలిపాయి. మాదాపూర్, మొకిలా, శేరిలింగంపల్లిలోని ప్రభుత్వ భూములు, మియాపూర్ మెట్రో భూముల కేటాయింపుల అంశంలోనూ అమోయ్ కుమార్‌పై ఆరోపణలు ఉన్నాయి. కాగా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా అమోయ్ కుమార్ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించారు.

తన ఎదుట స్టయిల్‌గా తలదువ్వారని..
ముగ్గురికి ఎస్సై శిరోముండనం

- అచ్చంపేట నియోజకవర్గం లింగాలలో ఘటన
- అవమానంతో ఓ యువకుడి ఆత్మహత్యాయత్నం
- పరిస్థితి విషమం.. మావాడికేదైనా జరిగితే ఎస్సైదే బాధ్యత
- ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

నాగర్‌కర్నూల్, నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విచారణకు అని పిలిస్తే తన ఎదుట స్టయిల్‌గా తల దువ్వుతూ పోజిచ్చారనే ఆగ్రహంతో ఓ ఎస్సై, ముగ్గురు యువకులకు శిరోముండనం చేయించారు. గుండుతో ఇంటికొచ్చిన కుమారుడిని ప్రశ్నించిన తల్లిదండ్రులు విషయం తెలిసి, కొడుకునే మందలించడంతో అతడు మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేశాడు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. లింగాలకు చెందిన అఖిల్, నిఖిల్, వినీత్ 13న రాత్రి ఓ పెట్రోల్ బంక్‌కు వెళ్లి రూ.20 పెట్రోల్ వేయాలని బంక్ సిబ్బందిని కోరారు. అంత చిన్న మొత్తానికి పెట్రోలు పోయలేమని వారు చెప్పడంతో ఘర్షణ జరిగింది. విషయం పోలీసుల దాకా వెళ్లడంతో లింగాల పోలీసులు ఆ ముగ్గురు యువకులను స్టేషన్‌కు పిలిపించారు. ఎస్సై జగన్ సమక్షంలో ముగ్గురు యువకులు స్టయిల్‌గా తల దువ్వడంతో ఆగ్రహానికి గురైన ఎస్సై స్టేషన్‌లోనే ఈ ముగ్గురికి శిరోముండనం చేయించి వదిలిపెట్టారు. ముగ్గురిలో వినీత్ ఇంటికి వెళ్లగా.. ఎందుకు గుండు గీయించుకున్నావని తల్లిదండ్రులు ప్రశ్నించారు. ఈ పరిస్థితి ఎందుకు తెచ్చుకున్నావంటూ మందలించారు. మనస్తాపం చెందిన వినీత్ ఉరివేసుకున్నాడు. కుటుంబసభ్యులు అతడిని నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది. కాగా, 4 రోజుల నుంచి లింగాల ఎస్సై అందుబాటులో లేరు. మరోవైపు.. ముగ్గురు యువకులను స్టేషన్‌కు రప్పించిన పోలీసులు వారితో 3 రోజుల పాటు స్టేషన్‌లోనే వివిధ రకాల పనులు చేయించి, ఇబ్బందులకు గురిచేసినట్లు వినీత్ ద్వారా తెలిసింది. కాగా, తమ కొడుకుకు ఏమైనా జరిగితే ఎస్సై జగనే బాధ్యత వహించాలని వినీత్ తల్లి లక్ష్మి తండ్రి సుధాకర్ చెప్పారు. తమ కొడుకుకు శిరోముండనం చేసేంత తప్పు ఏం చేశాడని వారు ప్రశ్నించారు. తమ పరువును బజారుకీడ్చి తమ కొడుకు ఆత్మహత్యాయత్నానికి కారకుడైన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

శ్రీశైలం, సాగర్‌కు స్వల్పంగా పెరిగిన వరద

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్) : కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద స్వల్పంగా పెరిగింది. శనివారం శ్రీశైలానికి 1.19 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. రెండు వైపుల జలవిద్యుత్ ఉత్పాదన, పోతిరెడ్డిపాడు నుంచి, అలాగే నాలుగు గేట్ల ద్వారా నీటిని వదులుతూ 1.79 లక్షలను జలాశయం నుంచి బయటికి తరలించారు. నాగార్జునసాగర్‌కు 1.08 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 18 గేట్లు ఎత్తి, జలవిద్యుదుత్పాదన చేస్తూ దిగువకు తరలిస్తున్నారు.

నేడు భారీ వర్ష సూచన

తెలంగాణలో ఆది, సోమవారాల్లో కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నెల 22 వరకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాగల మూడు రోజుల పాటు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు పటిష్ఠ భద్రత

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు.. ముత్యాలమ్మ గుడి ధ్వంసంపై సమగ్ర విచారణ

- మావోయిస్టు సుజాత మా అదుపులో లేరు: డీజీపీ జితేందర్



హైదరాబాద్, చర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని డీజీపీ జితేందర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద తనిఖీలకు ప్రత్యేక బృందాలు మోహరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముత్యాలమ్మ గుడి ధ్వంసం కేసులో సమగ్ర విచారణ జరుపుతున్నామని వెల్లడించారు. ఇది ఒక వ్యక్తి చేసిన దాడిగా ప్రాథమిక విచారణలో తేలిందని, దీని వెనక సంస్థల ప్రమేయం లేదన్నారు. మావోయిస్టు సుజాత తెలంగాణ పోలీసుల అదుపులో లేరని డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. సుజాతను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. రాష్ట్రంలో మావోయిస్టుల కదలికలు లేవని, ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ వైపు వచ్చే ప్రయత్నం చేస్తే నిలువరిస్తున్నామని చెప్పారు.

సుజాతక్క అరెస్టు ప్రచారం బూటకం: మావోయిస్టు పార్టీ

మావోయిస్టు పార్టీ అగ్రనేత సుజాత క్షేమమేనని, ఆమె అరెస్టయినట్లు పాలకవర్గాలు చేస్తున్న ప్రచారం నమ్మొద్దని మావోయిస్టు పార్టీ పేర్కొంది. ఈ మేరకు శనివారం దక్షిణ సబ్ జోనల్ బ్యూరో సమత పేరుతో లేఖను విడుదల చేసింది. పార్టీ నిర్మూలనకు కేంద్రం, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని సమత ఆరోపించారు. ఆపరేషన్ కగార్ పేరుతో 2024లో జరిపిన దాడుల్లో 200పైగా మావోయిస్టులు చనిపోయారని, 2026 నాటికి మావోయిస్టులను నామరూపాల్లేకుండా చేస్తామని అమిత్‌షా ప్రకటించారని, అందులో భాగంగానే ఉద్యమంలో క్రియాశీలకంగా ఉన్న వారిపై సామ, దాన, దండోపాయాలు ప్రయోగిస్తున్నారన్నారు. పార్టీ క్యాడర్‌లో భయం కల్గించేందుకే సుజాతక్కను అరెస్టు చేసినట్లు బూటకపు ప్రచారం చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు.

రోడ్లకు పోలీసు అమరుల పేర్లు

పోలీసు అమరుల సేవలకు గుర్తింపుగా గ్రామీణ, పట్టణ రోడ్లకు వారి పేర్లు పెట్టాలని డీజీపీ జితేందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి అందజేశామని తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21 వరకు ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నట్లు డీజీపీ వెల్లడించారు. ఈ ఏడాది రాష్ట్ర గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సహా సహా దేశవ్యాప్తంగా 240 మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారన్నారు.

మందుపాతర పేలి ఇద్దరు జవాన్ల మృతి

- కాంగ్రెస్ నాయకుడిని హత్య చేసిన మావోయిస్టులు
- ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్, బీజాపూర్‌లలో ఘటనలు

చర్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు దుశ్చర్యలకు తెగబడ్డారు. వారు అమర్చిన మందుపాతర పేలి ఇద్దరు జవాన్లు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అలాగే, కాంగ్రెస్ నాయకుడిని దారుణంగా హత్య చేశారు. మావోయిస్టుల కదలికల నేపథ్యంలో మొహండి, ఇరాక్ బట్టికి చెందిన సాయుధ బలగాలు నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లోని దుర్బె అడవులకు కూబింగ్ వెళ్లాయి. ఈ క్రమంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ మందుపాతరపై కాలు వేయగా అది పేలిపోయి ఇద్దరు జవాన్లు మృతి చెందారు. మృతి చెందిన వారిలో మహారాష్ట్రకు చెందిన అమర్ పన్వర్ (36), ఏపీలోని కడప జిల్లాకు చెందిన కె. రాజేష్ (36) ఉన్నారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. అలాగే, బీజాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు, రేషన్ డీలర్ అయిన బండారి తిరుపతి(40)ని శనివారం మావోయిస్టులు కత్తులతో పొడిచి హత్య చేశారు. తిరుపతి శనివారం బీజాపూర్ నుంచి ఊసూరు వెళ్లి కార్డుదారులకు రేషన్ అందిస్తుండగా అక్కడికి వచ్చిన మావోయిస్టులు తిరుపతిపై కత్తులతో దాడి చేశారు. దాంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

ఢిల్లీ మద్యం కేసు విచారణ మళ్లీ వాయిదా

న్యూఢిల్లీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో సీబీఐ దాఖలు చేసిన అనుబంధ అభియోగ పత్రంపై విచారణను శనివారం రౌస్ అవెన్యూ కోర్టు మరోసారి వాయిదా వేసింది. కవితతో పాటు, ఇతర సహ నిందితులు వర్చువల్ విధానంలో కోర్టు విచారణకు హాజరయ్యారు. ఛార్జిషీట్‌లో పలు పేజీలు లేకపోవడంపై నిందితుల తరపు న్యాయవాదులు లేవనెత్తిన అభ్యంతరాలను కోర్టు పరిగణనలోకి తీసుకొంది. వాటిని సరిచేసి ఇవ్వాలని సీబీఐ అధికారులను ఆదేశిస్తూ తదుపరి విచారణను నవంబరు 8కి వాయిదా వేసింది. పేజీలను సరైన పద్ధతిలో పేర్చి ప్రతులను అందచేయాలని సీబీఐని ఆదేశించింది.

వీసీల భర్తీలో దళితులకు ప్రాధాన్యం భేష్

- సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యేల ధన్యవాదాలు

హైదరాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వివిధ వర్సిటీలకు వీసీల నియామకంలో దళితులకు ప్రాధాన్యత ఇచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మందుల సామేలు, కవ్వంపల్లి సత్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు. ఉస్మానియా వర్సిటీకి తొలి సారి ఒక ఎస్సీని, మహిళా వర్సిటీకి గిరిజన మహిళను వీసీగా నియమించడం గర్వకారణమన్నారు. అన్ని వర్గాలకూ సీఎం రేవంత్ రెడ్డి న్యాయం చేస్తున్నారని కొనియాడారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

- సిద్దిపేట జిల్లాలో ఘటన

దుబ్బాక, అక్టోబరు 19: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన వేల్పుల అంజయ్య (51)కు రెండు ఎకరాల భూమి ఉండగా.. మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. అంజయ్య కొన్నాళ్లుగా కుటుంబ కలహాలతోపాటు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం తాను కౌలుకు చేస్తున్న పోతరెడ్డిపేట శివారులోని పొలం వద్దకు వెళ్లి శనివారం వరకూ ఇంటికి తిరిగిరాలేదు. పొలం సమీపంలోని చెట్టుకు ఆయన ఉరేసుకుని కనిపించగా స్థానికులు భూంపల్లి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య గంగమణి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

నిజామాబాద్‌లో మహిళపై గ్యాంగ్ రేప్

- నమ్మించి అఘాయిత్యానికి పాల్పడ్డ నలుగురు
- కేసు నమోదు.. పరారీలో నిందితులు

నిజామాబాద్ అర్బన్/డిచ్‌పల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళను నమ్మించి నలుగురు వ్యక్తులు సామూహికంగా అత్యాచారానికి పాల్పడిన ఘటన నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలానికి చెందిన 36 ఏళ్ల మహిళ శుక్రవారం షాపింగ్ కోసమని నిజామాబాద్ నగరానికి వచ్చింది. షాపింగ్ ముగిసిన తర్వాత రాత్రి వేళ బోధన్‌కు వెళ్లేందుకు నిజామాబాద్ బస్టాండ్ వద్ద నిలబడింది. డిచ్‌పల్లికి చెందిన ఆటో డ్రైవర్లు జైనోద్దీన్, మోసీన్, సుల్తాన్, నగేశ్.. తాము కూడా బోధన్‌కు వెళ్తున్నామని, ఆటోలో బోధన్‌లో దిగబెడతామని చెప్పారు. నమ్మిన మహిళ ఆటో ఎక్కింది. అయితే వారు వాహనాన్ని బోధన్ వైపునకు కాకుండా డిచ్‌పల్లి వైపు తీసుకెళ్లారు. సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. తర్వాత పారిపోయారు. బాధిత మహిళ శనివారం నిజామాబాద్ 1వ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని, వీలైనంత త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

మీకు కోర్టులపైనా గౌరవం లేదా?

- దేశానికి మంత్రివా.. హైదరాబాద్‌కా?
- సంజయ్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యేల మండిపాటు

హైదరాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): "గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై హైకోర్టు ఇప్పటికే తీర్పు వెలువరించింది. ఒక కేంద్ర మంత్రిగా కోర్టులపై మీకు గౌరవం లేదా?" అని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. బాధ్యత గల కేంద్ర మంత్రి.. రోడ్లపై రచ్చ చేయడం దుర్మార్గమన్నారు. కొందరు వ్యక్తులతో కేటీఆర్ సుప్రీం కోర్టులో కేసు వేయించి డ్రామా చేస్తున్నాడని ధ్వజమెత్తారు. విద్యార్థిని ప్రవళిక ఆత్మహత్య చేసుకున్నప్పుడు.. కేటీఆర్ ఎక్కడికి వెళ్లారని నిలదీశారు. జీవో 29పై అపోహలు వద్దని, ప్రతిపక్షాల మాటలు నమ్మి భవిష్యత్తును ఆగం చేసుకోవద్దని విద్యార్థులను కోరారు. బండి సంజయ్.. దేశానికి మంత్రా? లేక హైదరాబాద్‌కా? అని ఎమ్మెల్యే మందుల సామేలు ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా దేశ సమస్యలపై పోరాటం చేయాలని సంజయ్‌కు హితవు పలికారు. బీఆర్ఎస్ అధ్యక్ష పదవి కోసం కేటీఆర్, హరీశ్‌రావు కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సంజయ్‌కు రాష్ట్రంపైన ప్రేమ ఉంటే జాతీయ విద్యాలయాలను ఏర్పాటు చేయించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ సూచించారు. గ్రూప్-1 పరీక్షలపై ఆయనకు అవగాహన లేదన్నారు. జీవో 29తో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నష్టం లేదని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటే బీజేపీ, బీఆర్ఎస్‌ను నల్లగొండ ప్రజలు తరిమికొడతారని హెచ్చరించారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- పరిస్థితి విషమం... నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఘటన

మిర్యాలగూడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థిని దోమల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న సిబ్బంది బాలికను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నల్లగొండ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తెలిపిన వివరాల ప్రకారం... దామరచర్ల మండలానికి చెందిన బాలిక 9వ తరగతి చదువుతోంది. దసరా సెలవుల్లో ఇంటికి వెళ్లిన బాలికను శుక్రవారం మధ్యాహ్నం తండ్రి హాస్టల్‌కు తీసుకువచ్చాడు. సాయంత్రం స్టడీ అవర్స్‌లో తోటి విద్యార్థినులతో కలిసి చదువుకున్న బాలిక తర్వాత గదిలోకి వెళ్లి పడుకుంది. రాత్రి భోజనానికి రమ్మని స్నేహితురాళ్లు పిలువగా తన కాళ్లు, చేతులు వణుకుతున్నాయని, కళ్లు తిరుగుతున్నాయని చెప్పడంతో ఈ విషయాన్ని పాఠశాల సిబ్బందికి తెలియజేశారు. దీంతో క్లాస్ టీచర్ బాలికను ప్రశ్నించగా... తాను ఇంటి వద్ద పురుగుమందు తాగి వచ్చినట్లు చెప్పింది. వెంటనే బాలికను చికిత్స నిమిత్తం తొలుత మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, అనంతరం జిల్లా ఆస్పత్రికి తరలించారు. రాత్రి 9 గంటల సమయంలో తల్లిదండ్రులు వచ్చి బాలికను పురుగు మందు ఎక్కడ తాగావని ప్రశ్నించగా, నానమ్మ ఇంట్లో నిల్వ చేసిన దోమల మందు తాగినట్లు తెలిపింది. ఈ సంఘటనపై పాఠశాల సిబ్బంది టూటౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు.

వివాదాలకు ఆస్కారం లేకుండా కులగణన

- మేధావులతో సమావేశమైన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



మేధావులతో సమావేశమైన బీసీ కమిషన్‌చైర్మన్ నిరంజన్

హైదరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో న్యాయపరమైన వివాదాలకు ఆస్కారం లేకుండా నిపుణుల సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకుని కులగణన చేపట్టేందుకు కృషి చేస్తామని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. శనివారం ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో ఆయా రంగాల్లోని పలువురు బీసీ మేధావులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. కులగణనలో పారదర్శకంగా వివరాలను సేకరించాలని, రిజర్వేషన్ల నిర్ధరణకు కుల సర్వే డేటా ప్రాతిపదికగా ఉండాలని వారు సూచించారు. ఇతర రాష్ట్రాల్లో కులగణన అనంతరం ఏర్పడిన వివాదాలను పరిగణనలోకి తీసుకుని తెలంగాణలో అలాంటి సమస్యలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కులగణనపై ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, అవగాహన కల్పించేందుకు సదస్సులు, చర్చాగోష్ఠులు అవసరమన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు తదితరులు పాల్గొని తమ సూచనలను అందించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

తీతువు పిట్టల్లా లొల్లి..!

అమంగళం ప్రతిహతం అవుగాక! మళ్లీ ప్రతిపక్షంలో కూర్చోడానికి కూడా సిద్ధమే అని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పడంతో వైసీపీకి చెందిన పలువురు 'మాయాబజార్' చిత్రంలో శకుని చెప్పిన ఈ డైలాగ్‌ను గుర్తు చేసుకున్నారు. జగన్‌రెడ్డి మాటల్లో ఈ మధ్య తడబాటు కనిపిస్తోంది. తాను మళ్లీ అబద్ధాలు చెప్పి ఉంటే అధికారంలోకి వచ్చి ఉండేవాడినని ఆయన చెప్పుకోవడంతో వైసీపీ నాయకులు ఆశ్చర్యపోయారు. ఈ మాటకు అర్థాలు తీస్తే 2019 ఎన్నికలకు ముందు అబద్ధాలు చెప్పడం వల్లనే అధికారంలోకి వచ్చామని ఆయన చెప్పకనే చెప్పారని సరిపెట్టుకున్నారు. రాజకీయాల్లో అబద్ధాలు చెప్పడం సహజమేగానీ ఇలా అసంకల్పితంగా నిజాలు చెప్పుకొంటే ఎలా అని విస్తుపోతున్నారు. ఆడిన మాట తప్పని సత్య హరిశ్చంద్రుడిని అని చెప్పుకోవడానికి జగన్‌రెడ్డి ఈ మాట అని ఉండవచ్చుగానీ, ఫలితంగా అతడి అంతరంగం ఆవిష్కృతమైంది. వాస్తవానికి జగన్‌రెడ్డి నోరు తెరిస్తే అబద్ధాలు అలవోకగా ప్రవహిస్తాయి. 2019 ఎన్నికలకు ముందు, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అసత్యాలే పునాదులుగా ఆయన రాజకీయాలు సాగాయి. తాజా వ్యాఖ్యలతో ఆయన గతంలో చెప్పిన అబద్ధాలను ప్రజలు మళ్లీ గుర్తు చేసుకున్నారు. దీంతో తలలు పట్టుకోవడం వైసీపీ నాయకుల వంతైంది. "వచ్చే ఎన్నికల తర్వాత కూడా ప్రతిపక్షంలో కూర్చోవడానికి సిద్ధమే కానీ అబద్ధాలు మాత్రం చెప్పను" అని జగన్‌రెడ్డి చెప్పుకోవడంతో ఆయన కుటుంబ సభ్యులు కూడా విస్తుపోయారు.

> బోసడీకే అన్న పదం వాడినందుకే రక్తం మరిగి దాడులు చేసే పరిస్థితి ఉంటే, చంద్రబాబు ధర్మపత్నిని నిండు సభలో దారుణంగా అవమానించి వ్యక్తిత్వ హననానికి పాల్పడినప్పుడు అవతలి వారి రక్తం ఇంకెంత మరగాలి? తన సతీమణిని అవమానించడంతో తట్టుకోలేక చంద్రబాబు బోరున విలపించారేగానీ కత్తులు, కర్రలు తీసుకొని వెళ్లమని కార్యకర్తలను ఉసిగొల్పలేదే? బోరుగడ్డ అనిల్ అనే వ్యక్తి తిట్టిన తిట్లను ఎవరైనా మరచిపోగలరా? ఇళ్లలోని ఆడవాళ్లకు కూడా మినహాయింపు లేకుండా దారుణంగా దూషించినా తెలుగుదేశం కార్యకర్తలు కానీ, జనసేనాని పవన్ కల్యాణ్ అభిమానులుగానీ రెచ్చిపోలేదే? అది వారి సంస్కారం. ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కొడాలి నాని, వల్లభనేని వంశీ, పేర్ని నాని, జోగి రమేశ్, రోజా వంటి వారి మాటలు, వాడిన భాష విన్నప్పుడు రక్తం మరగదా? ఇళ్లలోని ఆడవాళ్లను సైతం బజారుకు ఈడ్చిన వాళ్లను ఏం చేయాలి?

మరి... నిజం చెప్పాలి కదా!

వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సమకూర్చుకున్న ఆస్తులలో తన కుమార్తె షర్మిలకు కూడా సమాన వాటా ఉండాలని, తన భార్య విజయలక్ష్మికి వాటా అవసరం లేదని ఆడిటర్లకు ఆయన సూచించడం వాస్తవమో కాదో జగన్‌రెడ్డి స్పష్టం చేయాలి. వాస్తవమే అయితే ఆస్తుల్లో షర్మిలకు వాటా ఇవ్వడానికి ఎందుకు నిరాకరించారో చెప్పాలి కదా! తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకొని వందల, వేల కోట్ల పెట్టుబడులను సేకరించి, సొంత మీడియాను ఏర్పాటు చేసుకొని కూడా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తనకు మీడియా లేదని చెప్పుకోవడం అబద్ధం కాదా? రోత మీడియా తనది కాకపోతే తన భార్య భారతీరెడ్డి దానికి చైర్‌పర్సన్ ఎలా అవుతారో, మెజారిటీ షేర్లు తన పేరిట, తన కంపెనీల పేరిట ఎలా ఉంటాయో వివరించాలి కదా! సొంత బాబాయ్ వివేకానందరెడ్డిని హత్య చేసింది, చేయించిందీ ఎవరో తెలిసి కూడా ఆ నెపాన్ని చంద్రబాబు మీదకు నెట్టడానికి ప్రయత్నించింది నిజం కాదా? 2019కి ముందు కోడి కత్తితో దాడి చేయించుకొని, అది కూడా చంద్రబాబు పనేనని ప్రచారం చేయించి రాజకీయ లబ్ధి పొందడం నిజం కాదని చెప్పగలరా? అవినీతి కేసులలో తండ్రి రాజశేఖర రెడ్డి పేరు చేర్పించి తాను తప్పించుకోవాలని ప్రయత్నించడం నిజం కాదా? అమరావతిలోనే రాజధాని ఉంటుందని, అందుకే అక్కడ ఇల్లు కట్టుకున్నానని ఎన్నికలకు ముందు చెప్పడం నిజం కాదా? ఎన్నికల తర్వాత మూడు రాజధానులు అని చెప్పి ప్రభుత్వ సొమ్ముతో ప్రధాన నగరాలు, పట్టణాల్లో ప్యాలెస్‌లు నిర్మించుకోవాలనుకోవడంలో నిజం లేదా? అధికారం ఇస్తే మద్యపాన నిషేధం అమలు చేస్తానని చెప్పి... అత్యంత నాసిరకం మద్యాన్ని ప్రజలకు విక్రయించి అక్కడ కూడా డబ్బు సంపాదించుకొనే నీచానికి ఒడిగట్టింది ఎవరో జగన్‌రెడ్డి చెప్పగలరా? ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో! 'నువ్వు అబద్ధమాడితే బాగుండు అని ఎవరైనా చెబితే.. లేదు, ప్రతిపక్షంలో కూర్చోవడానికి కూడా సిద్ధమే. కానీ, అబద్ధం మాత్రం చెప్పలేను' అని చెప్పడమే పెద్ద అబద్ధం కదా?

మరవగలమా మీ పాలన...

అబద్ధాల విషయం అలా ఉంచితే, ప్రజలు తన పాలనను ఎక్కడ మరచిపోతారోనని జగన్‌రెడ్డి గుర్తు చేస్తున్నారు. ప్రజలకు జ్ఞాపకశక్తి తక్కువని అంటారు. అందుకే తాము ఓడించిన పార్టీలనే ఐదేళ్ల తర్వాత ఆశీర్వదిస్తుంటారు. అయితే 2029 ఎన్నికల తర్వాత కూడా ప్రతిపక్షంలో కూర్చోవడానికి సిద్ధమైనందునే జగన్‌రెడ్డి తన రాక్షస పాలనను తానే ప్రజలకు పదే పదే గుర్తుచేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఇసుక, మద్యం వ్యవహారాల్లో ఏదో జరిగిపోతోందని చెబుతూ తన దోపిడీని ప్రజలకు గుర్తు చేస్తున్నారు. చంద్రబాబు పాలనలో కక్ష సాధింపులు, వేధింపులు పరాకాష్ఠకు చేరాయని, నాలుగు నెలలకే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందని చెబుతూ తన పాలనను మళ్లీ మళ్లీ ప్రజలకు గుర్తు చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ వేధింపులే అజెండాగా పాలన సాగించి చంద్రబాబును జైల్లో పెట్టే వరకు శాంతించని తనను ప్రజలు ఎక్కడ మరచిపోతారోనని గుర్తు చేస్తూనే ఉన్నారు. పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేయడంలో సరికొత్త రికార్డులు నెలకొల్పడం ద్వారా తన ప్రత్యర్థులపైకి ఉసిగొల్పిన జగన్‌రెడ్డి అప్పుడు ఏం జరిగిందో గుర్తు చేస్తున్నారు. జగన్‌రెడ్డి గతంలో చెప్పినవన్నీ అబద్ధాలని తెలుసుకోవడం వల్లనే ప్రజలు తాజా ఎన్నికల్లో ఆయన పార్టీని పదకొండు సీట్లకే పరిమితం చేయడం మాత్రం సత్యం. చంద్రబాబు ప్రభుత్వం జగన్‌రెడ్డి అడుగుజాడల్లో నడవడం లేదు. అయినా అధికారంలో ఉన్నప్పుడు తానేం చేశానో, ఎంత అరాచకంగా ప్రవర్తించానో గుర్తు చేస్తూ చంద్రబాబు ప్రభుత్వానికి దిశానిర్దేశం చేస్తున్నారా అన్నట్టుగా జగన్‌రెడ్డి వ్యాఖ్యలు ఉంటున్నాయి. అబద్ధాలే పునాదులుగా అధికారంలోకి వచ్చిన వ్యక్తి తాను అబద్ధాలే ఆడనని చెప్పుకోవడం వింతగా ఉన్నప్పటికీ... అతగాడి మనస్తత్వానికి ఆ మాటలు అద్దం పట్టడం లేదా? ప్రజల జ్ఞాపకశక్తి తక్కువే అయివుండవచ్చునుగానీ తమరి పాలనను ప్రజలు అంత తొందరగా ఎలా మరచిపోగలరు? జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనను ఒక పీడ కలగా ప్రజలు గుర్తుపెట్టుకుంటూనే ఉంటారు. ఆ రాక్షస పాలనను మరచిపోదామన్నా మరచిపోలేని పరిస్థితి! ప్రతిపక్ష నాయకుడి స్థాయి నుంచి సామాన్య ప్రజల వరకు ఎవరికీ స్వేచ్ఛ లేకుండా జగన్‌రెడ్డి పాలన సాగింది. అప్పట్లో ఎవరైనా స్వేచ్ఛగా ఫోన్లలో మాట్లాడుకోగలిగారా? జగన్‌రెడ్డి సొంత మనుషులు, కలెక్షన్ ఏజెంట్లు కూడా ఫోన్లలో స్వేచ్ఛగా మాట్లాడుకోగలిగారా? లేదే! 'మీరు ఎవరెవరితో మాట్లాడేదీ, మీకు వచ్చే మెసేజులు అన్నీ నాకు తెలుస్తాయి' అని తన అంతరంగికులలో ఒకరిని జగన్‌రెడ్డి హెచ్చరించడం నిజం కాదా? ఇప్పుడు చంద్రబాబు పాలన ఎలా ఉన్నది, ఎలా ఉండబోతున్నది అన్న విషయం పక్కన పెడితే... ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుకోగలుగుతున్నారు. ఫేస్ టైం, సిగ్నల్ వంటి యాప్‌ల అవసరం లేకుండా ఫోన్లలో మామూలుగా మాట్లాడుకోగలుగుతున్నారు. ప్రజలకు కనీస స్వేచ్ఛ లేకుండా సాగించిన పాలన కూడా పాలన అవుతుందా? కాదు.. కాజాలదు!

హవ్వ... ఆ నోట ఈ మాటా!

అధికారం ఉన్నది సొంత ఆదాయం పెంచుకోవడానికి మాత్రమే అని నమ్మి ప్రభుత్వ వనరులను కొల్లగొట్టి, నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన జగన్‌రెడ్డి ఇప్పుడు ప్రవచనాలు చెబుతున్నారు. సత్యహరిశ్చంద్రుడే జీవించి ఉంటే... 'నేను అబద్ధాలు చెప్పను' అనే జగన్ మాటలు విని సిగ్గుతో చచ్చిపోయేవారేమో! పురాణాల్లో పౌండ్రక వాసుదేవుడి గురించి చెప్పారుగానీ ఇలాంటి అపర సత్యహరిశ్చంద్రుడి గురించి చెప్పలేదు. నోరు తెరిస్తే అబద్ధాలు మాత్రమే చెప్పే జగన్‌రెడ్డి వంటి కేరెక్టర్లు కూడా ఉంటాయని ఎవరూ ఊహించి ఉండరు. కొంత మంది నోటి వెంట కొన్ని మాటలు వింటే వినసొంపుగా ఉంటాయి. జగన్‌రెడ్డి వంటి వారు నీతి, నిజాయితీ, విలువలు, విశ్వసనీయత వంటి మాటలు వల్లెవేస్తే వినడానికే రోతగా ఉంటుంది. రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసి ప్రజలను అడుక్కునే వారి స్థాయికి దిగజార్చడం ద్వారా అధికారాన్ని అంటిపెట్టుకోవాలని చూసిన జగన్‌రెడ్డి కుయుక్తులను ప్రజలే తిప్పికొట్టారు. సంక్షేమం పేరిట ప్రజలకు డబ్బు పంచిపెట్టినా ఎన్నికల్లో తనకు ఓటమి ఎందుకు ఎదురైందో తెలుసుకునే ప్రయత్నం చేయకపోగా 'నేను అబద్ధం చెప్పను' అని చెప్పుకోవడం ఆత్మవంచన కాదా? ప్రతిపక్షంలో కూర్చోవడానికి కూడా సిద్ధమేగానీ అబద్ధాలు మాత్రం చెప్పనని జగన్‌రెడ్డి అన్నప్పుడు ఆ కార్యక్రమంలో పాల్గొన్న కొంత మంది చప్పట్లు కొట్టడం చూస్తే వైసీపీలో ఇంకా ఉన్మాదుల సంఖ్య తగ్గలేదనిపిస్తోంది. తాను అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత చంద్రబాబు హైదరాబాద్‌లో నివసించడమేమిటి? అని ప్రశ్నించిన జగన్‌రెడ్డి ఇప్పుడు తాను బెంగళూరులోని ప్యాలెస్‌లో ఎందుకు సేదదీరుతున్నారో చెప్పాలి. ఇదంతా కాదుగానీ నిత్యం బైబిల్ పఠనం చేస్తానని చెప్పే జగన్‌రెడ్డి... బైబిల్ చేత పట్టి ఏసు ప్రభువు సమక్షంలో ఆత్మపరిశీలన చేసుకుంటే తత్వం బోధపడుతుంది. అయినా మన పిచ్చిగానీ ఏసుప్రభువును కూడా తన స్వార్థానికి వాడుకుంటున్న విషయం అతనికి తెలియదా? అలాంటి వారిలో పరివర్తన రావాలనుకోవడం అమాయకత్వమే అవుతుంది. అరాచక మనస్తత్వంతో పాలించడం దైవ ప్రేరణ ఎలా అవుతుంది? ఇతరులను ప్రేమించడం గురించి చెప్పిన బైబిల్ పైశాచికంగా ప్రవర్తించమని బోధించలేదే?

> సత్యహరిశ్చంద్రుడే జీవించి ఉంటే... 'నేను అబద్ధాలు చెప్పను' అనే జగన్ మాటలు విని సిగ్గుతో చచ్చిపోయేవారేమో! పురాణాల్లో పౌండ్రక వాసుదేవుడి గురించి చెప్పారుగానీ ఇలాంటి అపర సత్యహరిశ్చంద్రుడి గురించి చెప్పలేదు. నోరు తెరిస్తే అబద్ధాలు మాత్రమే చెప్పే జగన్‌రెడ్డి వంటి కేరెక్టర్లు కూడా ఉంటాయని ఎవరూ ఊహించి ఉండరు.



> తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకొని వందల, వేల కోట్ల పెట్టుబడులను సేకరించి, సొంత మీడియాను ఏర్పాటు చేసుకొని కూడా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తనకు మీడియా లేదని చెప్పుకోవడం అబద్ధం కాదా? రోత మీడియా తనది కాకపోతే తన భార్య భారతీరెడ్డి దానికి చైర్‌పర్సన్ ఎలా అవుతారో, మెజారిటీ షేర్లు తన పేరిట, తన కంపెనీల పేరిట ఎలా ఉంటాయో వివరించాలి కదా! సొంత బాబాయ్ వివేకానందరెడ్డిని హత్య చేసింది, చేయించిందీ ఎవరో తెలిసి కూడా ఆ నెపాన్ని చంద్రబాబు మీదకు నెట్టడానికి ప్రయత్నించింది నిజం కాదా? అమరావతిలోనే రాజధాని ఉంటుందని, అందుకే అక్కడ ఇల్లు కట్టుకున్నానని ఎన్నికలకు ముందు చెప్పడం నిజం కాదా? ఎన్నికల తర్వాత మూడు రాజధానులు అని చెప్పి ప్రభుత్వ సొమ్ముతో ప్రధాన నగరాలు, పట్టణాల్లో ప్యాలెస్‌లు నిర్మించుకోవాలనుకోవడంలో నిజం లేదా? అధికారం ఇస్తే మద్యపాన నిషేధం అమలు చేస్తానని చెప్పి... అత్యంత నాసిరకం మద్యాన్ని ప్రజలకు విక్రయించి అక్కడ కూడా డబ్బు సంపాదించుకొనే నీచానికి ఒడిగట్టింది ఎవరో జగన్‌రెడ్డి చెప్పగలరా? ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో!

గతం మరిచిపోయి కథలు

అధికారంలో ఉన్నప్పుడు చెయ్యాల్సిన దురాగతాలన్నీ చేసి ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి, పత్రికా స్వేచ్ఛ గురించి, పోలీసుల వేధింపుల గురించి వైసీపీ మూక మాట్లాడటం జుగుప్సాకరంగా ఉంది. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని తెలుగుదేశం అధికార ప్రతినిధి పట్టాభి బోసడీకే అని తిట్టడం వల్ల తమ కార్యకర్తల రక్తం మరిగి, తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేస్తే చేసి ఉండవచ్చునని సజ్జల రామకృష్ణారెడ్డి అనే మాజీ జర్నలిస్టు చెబుతున్నారు. ఈ కేసులో పోలీసులు తనను విచారణకు పిలవడం ఏమిటి? అని కూడా ఆయన ప్రశ్నిస్తున్నారు. బోసడీకే అన్న పదం వాడినందుకే రక్తం మరిగి దాడులు చేసే పరిస్థితి ఉంటే, చంద్రబాబు ధర్మపత్నిని నిండు సభలో దారుణంగా అవమానించి వ్యక్తిత్వ హననానికి పాల్పడినప్పుడు అవతలి వారి రక్తం ఇంకెంత మరగాలి? తన సతీమణిని అవమానించడంతో తట్టుకోలేక చంద్రబాబు బోరున విలపించారేగానీ కత్తులు, కర్రలు తీసుకొని వెళ్లమని కార్యకర్తలను ఉసిగొల్పలేదే? బోరుగడ్డ అనిల్ అనే వ్యక్తి తిట్టిన తిట్లను ఎవరైనా మరచిపోగలరా? ఇళ్లలోని ఆడవాళ్లకు కూడా మినహాయింపు లేకుండా దారుణంగా దూషించినా తెలుగుదేశం కార్యకర్తలు కానీ, జనసేనాని పవన్ కల్యాణ్ అభిమానులుగానీ రెచ్చిపోలేదే? అది వారి సంస్కారం. ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కొడాలి నాని, వల్లభనేని వంశీ, పేర్ని నాని, జోగి రమేశ్, రోజా వంటి వారి మాటలు, వాడిన భాష విన్నప్పుడు రక్తం మరగదా? ఇళ్లలోని ఆడవాళ్లను సైతం బజారుకు ఈడ్చిన వాళ్లను ఏం చేయాలి? జగన్‌రెడ్డిలో ఉన్న లక్షణాల్లో పదోవంతు చంద్రబాబులో ఉండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. పోలీసు విచారణకు హాజరైన సజ్జల రామకృష్ణారెడ్డి గంటల వ్యవధిలోనే బయటకు వచ్చి తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడిని సమర్థించుకోగలిగేవారా? ఎంపీ అని కూడా చూడకుండా రఘురామకృష్ణ రాజును పోలీసులతో చితగ్గొట్టించిన విషయం మరచిపోతే ఎలా? పోలీసు ఉన్నతాధికారులైన పి.సునీల్ కుమార్, పీఎస్సార్ ఆంజనేయులు, రఘురామిరెడ్డి కిరాయి సైనికులుగా మారి చేసిన దురాగతాలను సజ్జల మరచిపోయినా ప్రజలు మరచిపోతారా? జగన్‌రెడ్డి రోత మీడియాపై పోలీసులు ఒక కేసు పెట్టినందుకే ఇప్పుడు పత్రికా స్వేచ్ఛ అంటూ పెడబొబ్బలు పెడుతున్నారే? నిన్నటిదాకా మీరు చేసిందేమిటి? రఘురామకృష్ణరాజుతోపాటు నాపైనా, మా సహచరులపైనా దేశద్రోహం కేసు పెట్టిన విషయం మరిచారా? 'ఆంధ్రజ్యోతి' సంస్థలపై సీఐడీ అధికారులు ఎన్నో కేసులు పెట్టారు కదా! ఆ కేసులలో మా సిబ్బంది కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు కదా? రోత పత్రికపై కేసు పెట్టడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని... జగన్‌రెడ్డి దయవల్ల ఐదేళ్ల పాటు మీడియా సలహాదారు పదవిలో కొనసాగిన దేవులపల్లి అమర్ అనే జర్నలిస్టు నాయకుడు ఇప్పుడు అంటున్నారు. ఆయనకు అప్పుడు పత్రికా స్వేచ్ఛ కనిపించలేదా? 'ప్రచురించిన వార్తల విషయమై ప్రభుత్వానికి అభ్యంతరం ఉంటే వివరణ ఇవ్వాలి! సదరు వివరణను ప్రచురించకపోతే పరువు నష్టం దావా వేసుకోవచ్చునుగానీ కేసులు పెట్టడం ఏమిటి?' అని ఇప్పుడు ప్రవచనాలు చెప్పడం ఏమిటి? ఇదే సలహా జగన్‌రెడ్డి ప్రభుత్వానికి మీడియా సలహాదారుడిగా ఎందుకివ్వలేదు? మాపై కేసులు పెట్టినప్పుడు ప్రభుభక్తి మత్తులో దేవులపల్లి అమర్ నిద్రపోయారా? ఐదేళ్ల పాటు శాసనసభ కార్యక్రమాలను ప్రసారం చేయకుండా ఏబీఎన్‌పై నిషేధం విధించడాన్ని మరచిపోతే ఎలా? ముఖ్యమంత్రి కార్యాలయానికి, నివాసానికి వెళ్లకుండా 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులపై నిషేధం విధించడాన్ని ఏమనాలి? రోత మీడియాతోపాటు మరో రెండు కూలి మీడియా చానళ్ల ప్రసారాలను ఇప్పుడు అడ్డుకోవడంపై పెడబొబ్బలు పెడుతున్నారే! మీరు అధికారంలో ఉన్నప్పుడు ఏబీఎన్‌తో పాటు టీవీ5 ప్రసారాలను ఐదేళ్లపాటు అడ్డుకోలేదా? కర్మ మనల్ని వదలదు– తప్పు ఎవరు చేసినా తప్పే! జగన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన ఈ దురాగతాలను అప్పుడు ఖండించి ఉంటే ఇప్పుడు ఎవరికైనా ఏడ్చే అర్హత, హక్కు వచ్చి ఉండేవి. అప్పుడు ప్రభువు కళ్లలో ఆనందం చూసి నోళ్లకు తాళం వేసుకున్న వాళ్లు ఇప్పుడు తీతువు పిట్టల్లా లొల్లి చేసినా లాభం లేదు. మీరు ఏం చేశారో ప్రజలు మరచిపోలేదు కనుకే ఇప్పుడు జరుగుతున్న దాన్ని కూడా పట్టించుకోవడం లేదు. తగిన శాస్తి జరిగిందని సరిపెట్టుకుంటున్నారు. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన కొత్తలో ఇప్పుడు కూలి మీడియాగా మారిన ఒక చానల్ ప్రసారాలను కొద్ది రోజులు ఆపించడంతో అలా చేయడం తప్పు అని నేను స్వయంగా ముఖ్యమంత్రికి చెప్పగలిగాను. ఏబీఎన్, టీవీ5 ప్రసారాలను ఐదేళ్లపాటు నిలిపివేసినా మాట్లాడని వారు ఇప్పుడు తమకు అన్యాయం జరిగిందని రోదించే అర్హత కోల్పోయారు. దుష్ట సంప్రదాయాలకు తలపడితే దాని పర్యవసానాలు ఇలాగే ఉంటాయి. మీడియాపై పోలీసు కేసు పెట్టడమేమిటి? అని రోత మీడియా ప్రతినిధి ప్రశ్నించగా, 'ఐదేళ్లుగా ఏం జరిగిందో నేను చూశాను. అప్పుడు ఎలా ఏం చేశారో ఇప్పుడు అలాగే చేశాం. అంతా చట్టప్రకారమే జరుగుతోంది. ఇందులో ఆక్షేపించడానికి ఏమీ లేదు' అని డీజీపీ ద్వారకా తిరుమలరావు కూల్‌గా బదులిచ్చారు.

అందుకు సంతోషించండి...

ఇప్పుడు పోలీసు కేసులు, వేధింపులు, పత్రికా స్వేచ్ఛ అంటూ జగన్ అండ్ కోతో పాటు కొంత మంది వారి తాబేదార్లు గగ్గోలు పెట్టడం చూస్తే కౌరవ మూక హాహాకారాలను వింటూ 'ఆర్తనాదాలు శ్రవణానందకరంగా ఉన్నాయి' అని మాయాబజార్ చిత్రంలో ఘటోత్కచుడు చెప్పిన డైలాగ్ గుర్తుకొస్తుంది. జగన్‌రెడ్డి సాగించిన అరాచకాల ప్రభావం ఇప్పట్లో తొలగిపోదు. జగన్‌రెడ్డికి 2019లో లభించిన మెజారిటీ కంటే ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి ఎక్కువ మెజారిటీ వచ్చింది. అయినా గతంలో జరిగిన వాటిని, రెడ్ బుక్‌లో రాసుకున్న వాటిని గుర్తుకు తెచ్చుకొని తాడూ బొంగరం లేని కేసులు పెట్టి వేధించనందుకు సంతోషించకుండా గగ్గోలు పెట్టడం అస్సలు బాగోలేదు. చంద్రబాబుకు జగన్ పూనితే పరిస్థితి ఏమిటో మీకే తెలుస్తుంది. అలా జరగడం లేదు కనుకే స్వేచ్ఛగా ప్రవచనాలు చెప్పుకోగలుగుతున్నారు. సొంత పార్టీ కార్యకర్తల నుంచి ఎంత ఒత్తిడి వస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు సంయమనం కోల్పోవడం లేదు. తప్పులు చేయడంలో కూడా హద్దులు మీరిన వారిని కూడా చట్టప్రకారమే శిక్షించాలనుకుంటున్నారు. తన వ్యక్తిగత జీవితం గురించి అవాకులు చవాకులు పేలినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రక్తం ఎంత మరగాలి? ప్రజలు అధికారం ఇచ్చింది కక్ష సాధింపులకు కాదు కదా అని అటు చంద్రబాబు, ఇటు పవన్ కల్యాణ్ నమ్ముతున్నందున వైసీపీ మూక స్వేచ్ఛగా తిరగగలుగుతోంది. కొంత మంది వ్యక్తులపై కేసులు పెడుతున్నా, పాత కేసులలో దర్యాప్తు వేగం పెరుగుతున్నా అదంతా చట్ట పరిధిలోనే జరగాలనుకుంటున్నారు. అనాగరికంగా ఆలోచించేవారే అయితే బూతులకు పేటెంట్ తీసుకున్న కొడాలి నాని వంటి వారికి పోలీస్ ట్రీట్‌మెంట్ చేయించడం ఎంత సేపు? పోలీసులు తనను దారుణంగా కొడుతున్నప్పుడు బాధతో రఘురామకృష్ణ రాజు అరచిన అరుపులు జగన్ అండ్ కోకు శ్రవణానందకరంగా అనిపించి ఉండవచ్చునుగానీ ప్రస్తుత ప్రభుత్వంలో అటువంటి పైశాచిక మనస్తత్వం ఉన్నవాళ్లు లేరనే చెప్పవచ్చు. అయితే గతంలో హద్దులు మీరి ప్రవర్తించిన వారిపై చర్యలు ఉండాల్సిందే. లేనిపక్షంలో అలాంటి వారిలో లెక్కలేనితనం వస్తుంది. అది రాజకీయాలకే కాదు– రాష్ట్రానికీ మంచిది కాదు. దుష్టశిక్షణ ధర్మసమ్మతం, న్యాయ సమ్మతం అని దేవుడే చెప్పాడు. ఇందులో శషభిషలకు తావు ఉండకూడదు. అబద్ధాలు చెప్పడం అలవాటు లేదని అబద్ధం చెబుతున్న జగన్‌రెడ్డిని ప్రజలు ఇప్పట్లో విశ్వసించరు. సొంత పార్టీ వారే ఆయనను విశ్వసించడం లేదు. త్వరలోనే ఆ పార్టీకి చెందిన కీలక నేతలు జగన్‌కు బైబై చెప్పే అవకాశం ఉంది. ప్రస్తుతం చర్చల దశలోనే ఉన్నప్పటికీ వారు పార్టీని వీడితే మాత్రం మళ్లీ ప్రతిపక్షంలో కూర్చోవడానికి కూడా సిద్ధమే అన్న జగన్ మాటలు నిజమవుతాయి. తథాస్తు దేవతలు ఉండరా మరి! అభినవ సత్యహరిశ్చంద్రుడి రాజకీయ భవిష్యత్తు ఎలా ఉండబోతున్నదో వేచి చూద్దాం!

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

> జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనను ఒక పీడ కలగా ప్రజలు గుర్తుపెట్టుకుంటూనే ఉంటారు. ఆ రాక్షస పాలనను మరచిపోదామన్నా మరచిపోలేని పరిస్థితి! ప్రతిపక్ష నాయకుడి స్థాయి నుంచి సామాన్య ప్రజల వరకు ఎవరికీ స్వేచ్ఛ లేకుండా జగన్‌రెడ్డి పాలన సాగింది. అప్పట్లో ఎవరైనా స్వేచ్ఛగా ఫోన్లలో మాట్లాడుకోగలిగారా? జగన్‌రెడ్డి సొంత మనుషులు, కలెక్షన్ ఏజెంట్లు కూడా ఫోన్లలో స్వేచ్ఛగా మాట్లాడుకోగలిగారా? లేదే! 'మీరు ఎవరెవరితో మాట్లాడేదీ, మీకు వచ్చే మెసేజులు అన్నీ నాకు తెలుస్తాయి' అని తన అంతరంగికులలో ఒకరిని జగన్‌రెడ్డి హెచ్చరించడం నిజం కాదా? ఇప్పుడు చంద్రబాబు పాలన ఎలా ఉన్నది, ఎలా ఉండబోతున్నది అన్న విషయం పక్కన పెడితే... ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుకోగలుగుతున్నారు. ఫేస్ టైం, సిగ్నల్ వంటి యాప్‌ల అవసరం లేకుండా ఫోన్లలో మామూలుగా మాట్లాడుకోగలుగుతున్నారు. ప్రజలకు కనీస స్వేచ్ఛ లేకుండా సాగించిన పాలన కూడా పాలన అవుతుందా? కాదు.. కాజాలదు!

నక్సల్ సమస్యకు పరిష్కారమెలా?

> నక్సలైట్లను పెద్ద ఎత్తున నిర్మూలించినంత మాత్రాన మావోయిస్టు తీవ్రవాదం మూలమట్టుగా అంతమవదు. నక్సల్ ప్రభావిత రాష్ట్రాలలో రెండునెలల పాటు ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించే విషయాన్ని భారత ప్రభుత్వం పరిశీలించాలి. నక్సలైట్ నాయకులను శాంతి చర్చలకు ఆహ్వానించాలి. ప్రజల క్రియాశీల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధించాలి. ఇది మాత్రమే నక్సల్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని ఖాయం చేస్తుంది.



నక్సలైట్లపై పోరులో తన విజయాలను కేంద్రం ఇటీవల చాలా బిగ్గరగా ప్రకటిస్తోంది. కర్కశంగా మాట్లాడుతోంది. యుద్ధ సమాప్తికి చేరువయ్యామని కూడా గట్టిగా చెప్పుతోంది. హతులు, అరెస్టయినవారు, లొంగిపోయినవారి విషయమై కేంద్రం ఏకరువుపెడుతున్న గణాంకాలు ఉత్తేజకరంగా ఉన్నప్పటికీ నక్సలైట్ సమస్యను అవి పరిష్కరించగలవా అన్నది ప్రశ్నార్థకమే.

ఈ నెల 7న నక్సల్ ప్రభావిత రాష్ట్రాల సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లో 85 శాతం వామపక్ష తీవ్రవాదులను, మావోయిస్టు పార్టీ అగ్రనాయకులు 14 మందిని నిర్మూలించామని వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటికే 237 మంది మావోయిస్టులు హతమయ్యారని, 812 మందిని అరెస్ట్ చేశామని, 732 మంది లొంగిపోయారని ఆయన తెలిపారు నక్సలైట్ల హింసాకాండ 2014–24 సంవత్సరాల మధ్య, 2004–14 సంవత్సరాల మధ్య కాలంతో పోలిస్తే 53 శాతం తగ్గిందని అమిత్ షా చెప్పారు.


నక్సలైట్ల ఉద్యమం కచ్చితంగా వెనుకంజలో పడింది. అక్టోబర్ 4న బస్తర్‌లోని అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టు కార్యకర్తలు హతమవడం వారికి కోలుకోని నష్టమే. మార్చి 2026 నాటికల్లా మావోయిస్టు తీవ్రవాద కంటక భూతం నుంచి దేశాన్ని విముక్తం చేస్తామని కేంద్ర హోం మంత్రి తెలిపారు. 2010లోను, అప్పటి కేంద్ర హోంమంత్రి పి. చిదంబరం నక్సలైట్ల సమస్యను రాబోయే మూడేళ్లలో అధిగమించగలుగుతామని చెప్పడం గమనార్హం. చిదంబరం తడబడిన చోట అమిత్ షా సఫలమవుతారా? ఏ పరిస్థితులు నక్సలైట్ల ప్రభావ ప్రాబల్యాలకు కారణమవుతున్నాయనే విషయమై సమగ్ర అవగాహన కొరవడిన దృష్ట్యా పై ప్రశ్నకు ఇదమిత్థమైన సమాధానమివ్వడం కష్టం.

గత ఆగస్టు 24న నక్సలైట్ల ప్రభావిత రాష్ట్రాల సమావేశానికి అధ్యక్షత వహించిన అమిత్ షా మాట్లాడుతూ వామపక్ష తీవ్రవాదాన్ని నిర్దాక్షిణ్యంగా తుడిచిపెట్టాల్సిన సమయమాసన్నమయిందని అన్నారు. దృఢ సంకల్పం ప్రశస్తమే కాని మన సొంత ప్రజలతో కనికరం లేని రీతిలో వ్యవహరించడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. వామపక్ష తీవ్రవాదాన్ని చావుదెబ్బ తీయడంలో సఫలమయినట్టు భారత రాజ్య వ్యవస్థ ఇంతకు ముందు రెండుసార్లు విశ్వసించింది. తొలుత 1972లో చారు మజుందార్ మరణించిన తరువాత, రెండోసారి 1990ల నడిమి కాలంలో కొండపల్లి సీతారామయ్య నాయకత్వం బలహీనపడిన తరువాత. అయితే ఈ రెండు సందర్భాలలోను నక్సలైట్ ఉద్యమం మరింత శక్తితో, మరింత చురుగ్గా పునర్ విజృంభించింది.

ఒక సంక్లిష్ట సమస్య పట్ల మన దృక్పథంలోని మౌలిక లోపాలను అక్టోబర్ 7 సమావేశం బయల్పరిచింది. సత్వర సత్ఫలితాలను సాధించేందుకు కేంద్ర హోం శాఖ భద్రతా దళాలపై పెద్ద ఎత్తున ఆధారపడుతోంది. కేంద్ర సాయుధ పోలీసు దళాలు (సిఏపీఎఫ్) తనకు అప్పగించిన బాధ్యత నిర్వహణలో సమర్థంగా పనిచేస్తోంది. అయితే ఆ భద్రతా దళాలు చేయగలిగేదానికి ఒక పరిమితి ఉన్నది. భద్రతాదళాలు ఒకసారి ఒక ప్రాంతంలో నక్సల్స్‌ను ఏరిపారేసిన తరువాత, అక్కడి గిరిజనుల జీవితాలను మెరుగుపరిచే సదుపాయాలను అభివృద్ధిపరచడం ప్రభుత్వ బాధ్యత. దురదృష్టవశాత్తు ఇదే జరగడం లేదు. ఫలితంగా ఆ ప్రాంతాలను నక్సలైట్లు పునరాక్రమించుకుంటున్నారు. ఈ పరిస్థితిని నివారించేందుకు అవసరమయిందేమిటి? సమస్య పరిష్కారానికి సమస్త ప్రభుత్వ విభాగాల సమష్టి సమన్వయ కృషి (హోల్ ఆఫ్ గవర్నమెంట్ అప్రోచ్). సరిగ్గా ఇవే కనిపించడం లేదు. మరో ముఖ్య లోపం రాష్ట్ర పోలీసు దళాలు సిఆర్‌పిఎఫ్‌కు సహాయక పాత్ర మాత్రమే వహించడం. అలా కాకుండా నక్సలైట్ల వ్యతిరేక పోరులో రాష్ట్ర పోలీసులు అగ్రస్థానంలో ఉండాలి. రాష్ట్ర పోలీసులు భూమి పుత్రులు. తాము పనిచేస్తున్న ప్రాంతం పట్ల వారికి సమగ్ర అవగాహన ఉంటుంది. అలాగే అక్కడి ప్రజల గురించి కూడా. కనుక నక్సల్ వ్యతిరేక పోరాటాలు ప్రారంభించేందుకు వారు మెరుగైన యోగ్యతలు కలిగివుంటారు. అయితే రాష్ట్రాల ప్రతినిధులు మరిన్ని కేంద్ర భద్రతా దళాలు కావాలని అభ్యర్థించడం నిరుత్సాహం కలిగిస్తోంది.

అభివృద్ధి సాధనకు ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. ఇక్కడ ఒక హెచ్చరిక చేయవలసిన అవసరం ఉన్నది. అభివృద్ధి అనేది గిరిజనులకు మౌలిక అవసరాలు తీర్చుతూనే వారి సంప్రదాయ జీవనశైలిని ఛిందరవందర చేయకూడదు. ఇది చాలా ముఖ్యం. స్థానిక హస్తకళలను ప్రోత్సహించాలి. గిరిజన కళలు, సంస్కృతి, భాషలను అభివృద్ధిపరచాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పవచ్చు. అయితే అడవుల విధ్వంసానికి, ఆదివాసీలు నిర్వాసితులు కావడానికి దారితీసే మెగా ప్రాజెక్టుల నిర్మాణాన్ని అనుమతించకూడదు. ఆ ప్రాజెక్టుల వల్ల ఆదివాసీలు తమ భూములను కోల్పోవలసివస్తుంది. భూముల నుంచి దూరమయిన ఆదివాసులు అశాంతికి లోనవుతారు. పర్యావరణ మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం ఏప్రిల్ 1, 2018 – మార్చి 31, 2023 మధ్య 88,903 హెక్టార్ల అటవీ భూమి అటవీయేతర ప్రయోజనాలకు మళ్లించబడింది. భూమిని కోల్పోవడమనేది గిరిజనులకు చాలా బాధాకరమైన విషయం. 'గిరిజనులు పూర్తిగా అలసిపోయారు, నిరుపేదలుగా కునారిల్లుతున్నారు, తీవ్ర మనోవ్యాకులతకు గురవుతున్నారు' అని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నివేదిక ఒకటి పేర్కొంది.

నక్సలైట్ల సమస్య గత ఐదు దశాబ్దాలుగా తీవ్ర స్థాయిలో ఉన్నది. ఈ హింసాకాండ, రక్తపంకిల చరిత్ర అంతమవ్వాలని అందరూ ఆశిస్తున్నారు. అయితే నక్సలైట్లను అంతమొందించడం ద్వారా మీరు ఆ సమస్యను పరిష్కరించలేరు. నిజానికి అటువంటి చర్యలు ప్రతికూల ఫలితాలనే ఇస్తాయి. దాదాపుగా ప్రతి నక్సలైట్‌కూ రాజ్యవ్యవస్థపై తీవ్ర అసంతృప్తి ఉన్నది. నక్సల్స్‌ను రాజ్యం అనేక ఇక్కట్లపాలు చేస్తోంది. వివక్ష, వేధింపుల, దోపిడీల గాథ అది. ఆ దురాగతాలను ప్రతిఘటించకుండా వారు ఎలా ఉంటారు. మార్గాంతరమేమిటి? పాత ఆలోచనా రీతులను విడనాడి కొత్త పద్ధతులలో ఆలోచించాలి. నక్సల్ ప్రభావిత రాష్ట్రాలలో రెండునెలల పాటు ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించే విషయాన్ని భారత ప్రభుత్వం పరిశీలించాలి. లొంగిపోవాల్సిందిగా నక్సల్స్‌కు విజ్ఞప్తి చేయాలి. లొంగిపోయినవారికి కేసుల నుంచి రక్షణ కల్పించి, వారి పునరావాసానికి పూర్తిగా తోడ్పడతామని అభయమివ్వాలి, అదే సమయంలో నక్సలైట్ నాయకులను శాంతి చర్చలకు ఆహ్వానించాలి. వారి ఇబ్బందులు, వ్యధలను సావధానంగా వినాలి. వాటిని వీలైనంతవరకు పరిష్కరించాలి, ప్రధానస్రవంతిలో కలిసిపోవాలని వారికి నచ్చజెప్పాలి. ఇటువంటి దృక్పథంతో వ్యవహరించినప్పుడు, బహుశా నక్సలైట్ల సంఖ్య తగ్గేందుకు అవకాశమున్నది. సాయుధ చర్యల కంటే ఆ మానవీయ పద్ధతే నక్సల్ ప్రభావం తగ్గేందుకు తోడ్పడుతుంది. ఎంతో రక్తపాతం జరిగింది, ఇంకా జరుగుతోంది. రాజ్య వ్యవస్థ కాఠిన్యం నుంచి నక్సలైట్లకు ఉపశమనం కలిగించాలి. వారి మనస్సులు, హృదయాలు గెలుచుకోవాలి. అది మాత్రమే నక్సల్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని ఖాయం చేస్తుంది.



▪ ప్రకాష్ సింగ్
సరిహద్దు భద్రతా దళాల మాజీ డైరెక్టర్ జనరల్

(టైమ్స్ ఆఫ్ ఇండియా సౌజన్యం)

కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు నియామకాల్లో అవకతవకలు
- డబ్బులకు అమ్ముకున్నట్లు ఆరోపణలు
- కౌన్సెలింగ్ కేంద్రం వద్ద నిరుద్యోగుల ఆందోళన
- రంగంలోకి దిగిన వరంగల్ జిల్లా కలెక్టర్
- ఒకరి సస్పెన్షన్, ఇద్దరికి మెమోల జారీకి ఆదేశం

6


- మెడికల్ కాలేజీకి ఆర్టీసీ బస్సుల్లో, ఆటోలో వెళ్లా..
- మెడిసిన్ చదివేటప్పుడే నజీర్‌తో ప్రేమలో పడ్డా..
- పేదలకు సేవ చేసేందుకే ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌గా చేరాను..
- చిన్నప్పటి నుంచే రాజకీయాలపై ఆసక్తి ఉండేది..
- పార్లమెంటులో అడుగుపెట్టిన రోజు మరిచిపోలేను..
- ఎంపీగా గెలవడం కన్నా.. పేదలకు మేలు చేయడమే మిన్న..
- రాజకీయాల్లో నాన్న చూపిన దారే నాకు రహదారి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో 'ఆంధ్రజ్యోతి ఇన్నర్ వ్యూ'

ఫీజు కట్టలేక స్కూల్లో నిలుచున్నా..

రాజకీయాల్లో ఉన్నా.. నాన్న కారు కూడా కొనలేదు..

8

ఇన్నర్ వ్యూ



పేరుమోసిన ప్రజాప్రతినిధి గారాల పట్టి ఆమె. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా, ఉప ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి కూతురికి ఎన్నో రాజభోగాలు ఉంటాయని సహజంగా అనుకుంటాం. కానీ ఆమె బాల్యం నుంచి వైద్యురాలి వరకు సాధారణ జీవితాన్నే గడిపింది. పాఠశాలల్లో ఫీజు కట్టలేక ఉపాధ్యాయులు నిల్చోబెట్టిన రోజులు ఆమె కళ్ల ముందు ఇంకా కదలాడుతూనే ఉన్నాయి. మెడికల్ కాలేజీకి ఆర్టీసీ బసుల్లో, ఆటోల్లో వెళ్లిన సందర్భాలూ ఉన్నాయి. డాక్టర్‌గా లక్షలు సంపాదించుకునే మార్గం ఉన్నా.. పేదలకు వైద్యం అందించాలని ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌గా చేరారు. ఎంతోమంది నిరుపేదలకు వైద్యం అందించి ప్రాణాలు నిలిపారు. అలాగే రాజకీయాల్లో నీతి, నిజాయితీ, విలువలకు కట్టుబడి ఉండాలని తండ్రి చెప్పిన మాటలే ఆమెకు స్ఫూర్తినిచ్చాయి. ఫలితంగా రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. తండ్రికి కొడుకులు లేని లోటు పూడ్చేందుకు రాజకీయ వారసురాలిగా అరంగేట్రం చేసి తొలి ఎన్నికల్లోనే విజయం సాధించి సత్తా చాటారు. గెలుపుకంటే ప్రజాసేవే పరమావధి అనుకుని.. వారి అభివృద్ధికి పాటు పడతానని చెబుతున్నారు వరంగల్ లోక్‌సభ సభ్యురాలు కడియం కావ్య. ఆమె జీవితంలో చోటు చేసుకున్న కొన్ని సంఘటనలను 'ఆంధ్రజ్యోతి ఇన్నర్ వ్యూ'లో పంచుకున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

క్లుప్తంగా..

సమయపాలన పాటించని టీచర్లు

- ఆరుగురికి డీఈవో షోకాజ్ నోటీసులు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై డీఈవో దౌలాగర్ వాసంతి కొరడా ఝులిపించారు. శనివారం ధర్మసాగర్ మండలంలోని ధర్మాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రార్థన సమయంలో ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆరుగురు ఉపాధ్యాయులు గైర్హాజరయినట్లు ఆమె గుర్తించారు. సమయపాలన పాటించని ఎ.ప్రభాకర్‌రెడ్డి ఇన్‌చార్జి హెడ్మాస్టర్, బి.రెబెకా, కె.సురేష్, కె.సత్యనారాయణ, ఎ.నర్సింహాచారి, టి.శ్రీదేవి తదితరులకు డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఇంకా ఆ పాఠశాలలో మూవ్‌మెంట్ రిజిస్టర్, అటెండెన్స్ రిజిస్టర్ల నిర్వహణ సరిగా లేదని డీఈవో గుర్తించారు. ఆరుగురు ఉపాధ్యాయులు షోకాజ్ నోటీసుకు ఒక్క రోజులో సమాధానం ఇవ్వాలని, లేదంటే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు.



పోలీసు అమరులకు ఘననివాళి

8

విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు వరంగల్ పోలీసు కమిషనరేట్ పోలీసులు, అమరుల కుటుంబసభ్యులు ఘనంగా నివాళులర్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని హనుమకొండ అశోకా జంక్షన్ నుంచి పోలీసు కమిషనరేట్ కార్యాలయం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సీపీ అంబర్ కిషోర్ ఝాతో పాటు డీసీపీలు, ఏసీపీలు, పోలీసు అధికారులతో పాటు అమరుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. అనంతరం అమరుల స్మారక స్థూపం వద్ద కొవ్వొత్తులు ఉంచారు.

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ



వీసీ ప్రతాప్‌రెడ్డిని అభినందిస్తున్న పాలక మండలి సభ్యులు

కేయూ వీసీగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

- అభినందనలు తెలిపిన వర్సిటీ వర్గాలు

రాష్ట్ర విద్య కమిషన్‌లో కేయూకు చోటు

8

- సలహాదారులుగా ఇద్దరు కేయూ ప్రొఫెసర్ల నియామకం
- కూరపాటి వెంకటనారాయణ, మురళీమనోహర్‌లకు అవకాశం



రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తడిచెత్తను ఎరువుగా మార్చాలంటే అవగాహన అవసరం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ఘన వ్యర్థాల నిర్వహణపై ఎక్స్‌పో ప్రారంభం

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తడిచెత్తను ఎరువుగా మార్చాలంటే ప్రతీఒక్కరికి అవగాహన అవసరమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. అస్కి (అడ్మినిస్ట్రేటీవ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) వారి సహాయంతో శనివారం వరంగల్ ములుగురోడ్డులోని వెంకటేశ్వర గార్డెన్స్‌లో బల్దియా ఆధ్వర్యంలో బల్క్ ఆర్గానిక్స్ వేస్ట్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ అండ్ ప్రాసెస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి రాజేందర్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తడిచెత్తను ఎరువుగా చేయడంలో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి స్వచ్ఛ వరంగల్‌గా తీర్చిదిద్దాలన్నారు. ప్రతీరోజు హోటళ్లు, హాస్టళ్ల నుంచి వెలువడు చెత్త ద్వారా బయోగ్యాస్ ఉత్పత్తి చేసే ప్రక్రియను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరిన విధంగా వరంగల్ నగరాన్ని స్వచ్ఛనగరం, పచ్చనగరంగా తీర్చిదిద్దుతామన్నారు. అస్కి సహకారంతో వరంగల్ నగరంలో ఇంకా చాలా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతీ రోజు నగరంలో 230 టన్నుల చెత్తను సేకరిస్తున్నామని, తడిచెత్తను కంపోస్ట్ చేసే యంత్రాలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వరంగల్ నగరంలో రెండు ద్వితీయ చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు అందుబాటులో ఉన్నాయని, ఇక్కడి నుంచి రాంపూర్‌కు చెత్తను తరలిస్తామన్నారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. వివిధ కంపెనీలు తడిచెత్తను కంపోస్ట్‌గా మార్చే విధానంపై యంత్రాల ద్వారా అవగాహన కల్పించారని చెప్పారు. త్వరలో అత్యున్నతమైన యంత్రాలను అందుబాటులోకి తెచ్చి బల్క్ ఆర్గానిక్ వ్యర్థాల ద్వారా ఎరువులు తయారు చేస్తామన్నారు. వివిధ కంపెనీలు బల్క్ ఆర్గానిక్ వ్యర్థాల ద్వారా ఎరువులు తయారు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కాగా, సాంకేతిక సహకారం అందించేందుకు పది స్టాళ్లను ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, మాసన, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, సెక్రెటరి విజయలక్ష్మి, డీసీలు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ఎంహెచ్‌వో రాజేశ్, అస్కి ప్రతినిధులు రాజ్‌మోహన్, అవినాష్, ప్రతిభతో పాటు పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బియ్యం బస్తాలో కోత

- 50 కిలోల బస్తాలో 5 కిలోలు మాయం
- గోదాముల్లో జరుగుతున్న గోల్‌మాల్
- లబోదిబోమంటున్న రేషన్ డీలర్లు

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల గోదాముల నుంచి రేషన్ డీలర్లకు సరఫరా అయ్యే బస్తాల్లో బియ్యం కిలోల కొద్దీ తక్కువగా వస్తున్నాయి. ప్రతీ నెలా రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేసే బియ్యంలో సైతం తక్కువగా వస్తుండటంతో రేషన్ డీలర్లు, లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదాముల నుంచి సరఫరా అయ్యే బియ్యం బస్తాల్లో కిలోల కొద్ది తక్కువగా వస్తుండడంతో డీలర్లు లబోదిబోమంటున్నారు. రేషన్ షాపులు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా అవుతోంది. 50 కిలోల బస్తాకు సుమారు ఐదు కిలోల మేర తరుగు వస్తుందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత గోదాము అధికారులను అడిగినా ఎలాంటి స్పందన రావడం లేదని డీలర్లు వాపోతున్నారు.

గోదాములో గోల్‌మాల్

ఎంఎల్ఎస్ (మిడిల్ లెవల్ స్టోర్) పాయింట్ల నుంచి ప్రతీ నెలా కోటా రేషన్ షాపులకు సరఫరా చేస్తారు. బస్తా బరువు 500 గ్రాములు ఉండగా, బియ్యం బరువు 49.500 గ్రాములు కలిపి మొత్తం 50 కిలోల తూకం వేసి షాపులకు పంపిస్తారు. కొన్ని ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి వచ్చే బియ్యం సంచుల్లో 44.900 కిలోలు, కొన్ని సందర్భాల్లో ఆరు నుంచి ఏడు కిలోల మేర తరుగు వస్తున్నట్లు రేషన్ డీలర్లు ఆరోపిస్తున్నారు. ప్రతీ నెల ఈ సమస్య ఎదుర్కోవడం తప్పడం లేదని, అధికారులు పర్యవేక్షణ లోపంతోనే ఐదారు కిలోల బియ్యం తక్కువగా వస్తున్నట్లు పేర్కొంటున్నారు. బియ్యం పారదర్శకంగా పంపిణీ చేయాలనే ఉద్దేశంతో ఈ-పాస్ యంత్రాలను అమలు చేసినా ఫలితం కనిపించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం గన్నీ సంచి బరువు పోను బియ్యం 50 కిలోలు ఉంటుందని చెబుతున్నా రేషన్ డీలర్లు మాత్రం తరుగు వస్తోందని అంటున్నారు. పౌర సరఫరాల అధికారులు నిరంతరం గోదాములను తనిఖీ చేసి బియ్యం బస్తాలు సరిగా ఉన్నాయా లేదా అని పరిశీలించాల్సిన అవసరం ఉంది.

డీలర్లకు నష్టం

బత్తుల రమేశ్‌బాబు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,



బియ్యం బస్తాల్లో ఐదారు కిలోలు తక్కువగా రావడం వల్ల రేషన్ డీలర్లు నష్టపోవాల్సి వస్తోంది. ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఒకేసారి క్వింటాళ్ల చొప్పున తూకం వేయడంతో సంచుల్లో కోత వస్తున్న విషయం తెలియడం లేదు. ప్రతీ నెల కొన్ని దుకాణాల్లో ఈ సమస్య తలెత్తుతున్నట్లు డీలర్లు చెబుతున్నారు. అరకొర వచ్చే కమీషన్‌తో కుటుంబాలను నెట్టుకొస్తున్న డీలర్లు.. కిలోల కొద్ది తరుగు భరించడం కష్టంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.



50 కిలోల బస్తాకు సుమారు ఐదు కిలోల మేర తక్కువగా చూపుతున్న దృశ్యం


అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

- ఇంజనీరింగ్ అధికారులతో మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలక్ట్రికల్, సివిల్, వెహికిల్ విభాగాలకు సంబంధించిన పనులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడుతూ.. కార్పొరేషన్‌కు సంబంధించి వివిధ పథకాల ద్వారా మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇందు కోసం అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రాజయ్య, ఈఈ మహేందర్, డీఈలు రంగారావు, సారంగం, శ్రీకాంత్, శివానంద్, కృష్ణమూర్తిలతో పాటు ఏఈ సంతోష్ పాల్గొన్నారు.

విగత జీవులుగా తల్లీ కొడుకులు

- పిడుగే కారణమని గ్రామస్థుల అనుమానం
- వరంగల్ జిల్లా బుధరావుపేటలో ఘటన




విజయ(ఫైల్)



విజయ మృతదేహం



విక్రమ్ మృతదేహం



విక్రమ్ (ఫైల్)

ఖానాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బుధరావుపేటలో అనుమానాస్పద స్థితిలో తల్లి, కుమారుడు మృతి చెందారు. పిడుగుపడడంతో మృతిచెందారా? లేక మరేదైనా కారణమా అనేది తెలియరావడం లేదు. శనివారం చోటు చేసుకున్న ఈ సంఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన గిరగాని శ్రీనుకు ఇద్దరు భార్యలున్నారు. సుమారు 20 ఏళ్ల కిందట మొదటి వివాహం చేసుకోగా వారికి ఇద్దరు పిల్లలున్నారు. విజయ (45)ను పదేళ్ల కిందట రెండో పెళ్లి చేసుకోగా ఆమెకు కుమారుడు విక్రమ్ (20) ఉన్నాడు. ఇద్దరు భార్యలు వేర్వేరు ఇళ్లలో నివాసమున్నారు. అయితే యేడాది కిందట ఆస్తి పంపకాల్లో గొడవ జరగడంతో విజయ తన తల్లిగారి ఊరైన నర్సంపేట మండలం ముత్తోజిపేటకు కొడుకుతో వెళ్లింది. శ్రీను మొదటి భార్యతో ఇదే గ్రామంలోని ఇందిరమ్మకాలనీలో ఉంటున్నాడు. అయితే ఇటీవల దసరా పండుగకు విజయ, విక్రమ్‌లు బుధరావుపేటకు వచ్చి ఇక్కడే ఉంటున్నారు.

ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఇంటి బయట తల్లి, ఇంట్లో కుమారుడు విగత జీవులుగా పడి ఉన్నారు. అయితే ఉరుములు, మెరుపులతో పిడుగుపడడంతో మృతి చెంది ఉండవచ్చనే అనుమానం గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. విక్రమ్ నర్సంపేటలోని ఓ పెట్రోలు బంకులో పనిచేస్తుండగా, విజయ గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇదిలా ఉండగా, తల్లి, కుమారుడు ఇద్దరూ మద్యానికి బానిసై కొన్ని రోజులుగా స్థిరత్వంలేని మాటలు మాట్లాడుతున్నారని ఇరుగుపొరుగువారు చర్చించుకుంటున్నారు. మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడ్డారా? లేక మరే ఇతర కారణాలు ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణ, ఎస్సై రఘుపతి విచారణ చేపట్టారు. ప్రస్తుతానికి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ రామ్ ప్రకాశ్
- ముగిసిన పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న కమాండెంట్ రామ్‌ప్రకాశ్

శంభునిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నిత్యం విధులతో ఒత్తిడికి గురయ్యే పోలీసు సిబ్బందికి క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని టీజీఎస్పీ ఫోర్త్ బెటాలియన్‌కమాండెంట్ బి.రామ్ ప్రకాశ్ అన్నారు. మామునూరు బెటాలియన్‌లో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం శనివారం బెటాలియన్‌లో నిర్వహించారు. కమాండెంట్ రామ్ ప్రకాశ్ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి బహుమతులు అందించి అభినందించారు. 2024 స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, హై జంప్, లాంగ్ జంప్, షటిల్, క్యారమ్, చెస్, 100, 400 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణప్రసాద్, శ్రీనివాస్‌రావు, వీరన్న, ఆర్‌ఐలు శోభన్, రవి, కిరణ్, సర్వర్, చంద్రన్న, పురుషోత్తం రెడ్డి, రాజిరెడ్డి, రమేష్, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ, అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు.


బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు

విశ్వబ్రాహ్మణ వృత్తిదారులందరినీ ఒకే కులంగా పరిగణించాలి

వడ్డెపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కమరం, వడ్రంగం, ఇత్తడి, శిల్పి, స్వర్ణకార వృత్తిదారులందరినీ ఒకే కులస్థులుగా పరిగణించాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్ మోహన్ కోరారు. శనివారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో గల బీసీ కమిషన్ భవన్‌లో బీసీ కమిషనర్ చైర్మన్ జి. నిరంజన్‌ను తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణామాచారి, కోశాధికారి రాగిఫణి రవీంద్రాచారితో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మదన్‌మోహన్ మాట్లాడుతూ.. సంప్రదాయ వృత్తులలో కార్పొరేట్ సంస్థలు ప్రవేశించడంతో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతీయులు పనులు కోల్పోయి ఉపాధి లేక కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉపాధి కోల్పోయి వందలాది మంది విశ్వబ్రాహ్మణ సంఘీయులు ఆకలి చావులకు గురయ్యారని పేర్కొన్నారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతి సమర్పించిన వారిలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘంతో పాటు తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ ఇత్తడి పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు రంగు లక్ష్మణాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు శశిధర్ శిల్పి, పులిగిళ్ల శ్రీనివాసాచారి, చిలుకూరి లక్ష్మీరామాచారి, వీణవంక సదానందచారి ఉన్నారు.

ఏనుమాముల మార్కెట్‌కు ఉద్యోగుల కొరత

- 70 శాతం ఖాళీలు.. 30 శాతం ఉద్యోగులు
- పని ఒత్తిడికి గురవుతున్న సిబ్బంది.. పట్టించుకోని ప్రభుత్వం


ఏనుమాముల వ్యవసాయ మార్కెట్

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల మార్కెట్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. పంటకు గిట్టుబాటు ధర, మార్కెట్‌కు వచ్చే రైతులకు తోడ్పాటును అందించేందుకు సరైన సిబ్బంది లేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క కాటన్ సీజన్ వచ్చేసింది. మార్కెట్ యార్డుల్లో రైతులకు సేవలందించేందుకు తగినంత మంది ఉద్యోగులు లేరు. దీంతో ఇదే అదనుగా కొంతమంది వ్యాపారులు అందినకాడికి దోచుకుంటున్నారు. ఏనుమాముల మార్కెట్‌లో పనిచేసేందుకు 1995లో మంజూరైన పోస్టులు (ఉద్యోగులు) 109. అప్పటి నుంచి ఇప్పటి వరకు కారుణ్య నియామకాలు మినహా కొత్తగా ఉద్యోగాలు భర్తీ చేయలేదు. ఉన్న ఉద్యోగుల్లో సీనియారిటీ ప్రకారం పదోన్నతులు పొందుతున్నారు. మరోవైపు కొందరు ఉద్యోగ విరమణ చేయడంతో ఆ పోస్టులు ఖాళీ అవుతున్నాయి. కొత్తగా నియామకాలు చేపట్టకపోవడంతో మార్కెట్లో రోజురోజుకూ ఉద్యోగుల సంఖ్య తగ్గిపోతోంది. మార్కెట్లో 109 మంది ఉద్యోగులు పనిచేయాల్సిన చోట 28 మంది ఉద్యోగులతోనే నెట్టుకువస్తున్నారు. 81 మంది ఉద్యోగులు లేకున్నా ఉన్న వారు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో ఉన్నతాధికారులు నిర్ణయించిన టార్గెట్లను పూర్తి చేస్తున్నారు.

ఉద్యోగులకు పనిభారం

మార్కెట్లో 109 మంది చేయాల్సిన పనిని 28 మంది నిర్వర్తిస్తున్నారు. కొత్తగా నియామకాలు లేకపోవడంతో ఉన్న ఉద్యోగులపై భారం పడుతోంది. మరోపక్క ఉన్న ఉద్యోగుల్లో సైతం రిటైర్ అవుతుండడంతో మరింత భారం పెరుగుతోంది. దీంతో చాలామంది ఉద్యోగులు పని ఒత్తిడికి గురవుతున్నారు. కొంత మంది అనారోగ్యం బారినపడ్డారు. మరికొంత మంది ఉద్యోగులు వైద్య చికిత్సలు పొందుతున్నారు.

ఉద్యోగాలు భర్తీ చేస్తే..

రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్లలో ఉన్న ఖాళీలను భర్తీ చేసినా ప్రభుత్వంపై ఎలాంటి భారం పడదు. మార్కెట్ కమిటీల్లో రైతు పంట క్రయవిక్రయాల సమయంలో మార్కెట్ ఫీజు వసూలు చేస్తారు. దీంతో మార్కెటింగ్‌శాఖకు రూ.వందల కోట్ల ఆదాయం సమకూరుతుంది. వచ్చే ఆదాయంతోనే ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపులు ఉంటాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఎలాంటి భారం పడదు. అయినా ఉద్యోగాలనుభర్తీ చేయ డంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తున్నాయని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉద్యోగులు	మంజూరైనవి	పని చేస్తున్నది	ఖాళీగా ఉన్నవి
ఉన్నతశ్రేణి కార్యదర్శి	1	1	----
గ్రేడ్ 2 కార్యదర్శులు	2	2	----
అసిస్టెంట్ సెక్రటరీ	4	2	2
అకౌంటెంట్	1	1	---
సూపర్‌వైజర్లు	16	11	5
యూడీసీ	2	2	----
ఎల్‌డీసీ	4	---	4
గ్రేడర్	4	---	4
ఏఎంఎస్	9	---	9
జెఎంఎస్	5	2	3
టైపిస్టు	1	--	1
డ్రైవర్	3	--	3
అటెండర్	6	3	3
వాచ్‌మెన్లు	51	4	47
మొత్తం	109	28	81

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం..
పోలెపాక నిర్మల, ఉన్నతశ్రేణి కార్యదర్శి



మార్కెట్లో ఉద్యోగుల కొరత ఉన్నప్పటికీ ఉన్న ఉద్యోగుల పనితీరును ఎప్పటికప్పుడు మెరుగు పరుస్తున్నాం. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవలు వాడుకుంటున్నాం. మార్కెట్లో ఎక్కడా ఎవరికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఉద్యోగుల కొరత ఉన్న అంశాన్ని ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు మతిన్ ఎంపిక



ఖానాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అశోక్ నగర్ గిరిజన సైనిక్ స్కూల్ విద్యార్థి జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ శనివారం తెలిపారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న మహ్మద్ మతిన్ ఈ నెల 16న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు న్యూ ఢిల్లీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా మతిన్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

కుక్కల బెడద

- చిన్నారులను వెంబడిస్తున్న శునకాలు
- పట్టించుకోని అధికారులు


కాలనీలో తిరుగుతున్న కుక్కలు

బాలసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలో కుక్కల బెడదతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఇటీవల నగరంలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ చిన్నారులపై దాడులు చేశాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కుక్కల బెడదకు తల్లిదండ్రులను వెంటబెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. కాలనీలలో విద్యుత్ వీధిలైట్లు లేకపోవడంతో రాత్రివేళల్లో ఒంటరిగా నడిచి వెళ్తున్న కాలనీ వాసులపై కుక్కలు దాడులు చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వీధి కుక్కల బెడద నుంచి కాలనీ ప్రజలను కాపాడాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

దేవాలయాలపై దాడులు చేసే వారిపై చర్యలు తీసుకోవాలి

- వీహెచ్‌పీ వరంగల్ విభాగ్ సహ ప్రముఖ్ శ్రీరామ్ ఉదయ్‌కుమార్
- హనుమకొండ చౌరస్తాలో మతోన్మాదుల దిష్టిబొమ్మ దహనం


హనుమకొండ చౌరస్తాలో హిందూ దేవాలయాలపై దాడి చేసిన మతోన్మాది దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

హనుమకొండ, చౌరస్తా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా హిందూ దేవాలయాలపై దాడి చేస్తున్న మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ వరంగల్ విభాగ్ సహ ప్రముఖ్ శ్రీరాం ఉదయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సికింద్రబాద్‌లోని ముత్యాలమ్మ గుడిపై మతోన్మాదులు చేసిన దాడికి నిరసనగా వీహెచ్‌పీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు హనుమకొండ చౌరస్తాలో శనివారం మతోన్మాది దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా శ్రీరామ్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మతోన్మాదులు హిందూ దేవాలయాల్లోకి ప్రవేశించి హిందువులు పరమ పవిత్రంగా పూజించే దేవి, దేవతామూర్తుల విగ్రహాలను పగలకొట్టడం హేయమైన చర్య అని మండిపడ్డారు. హిందువుల దేవాలయాల వద్ద విగ్రహాలను ధ్వంసం చేసిన వ్యక్తులను వదిలిపెట్టి సికింద్రాబాద్‌లో శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న హిందువులపై పోలీసులు లాఠీచార్జీ చేయడం దుర్మార్గమన్నారు. లాఠీచార్జీ చేసిన పోలీస్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ వరంగల్ మహానగర అధ్యక్షుడు కె.జయపాల్‌రెడ్డి, కార్యదర్శి వి.రాజు, సహాయకార్యదర్శి సందీప్‌రెడ్డి, భజరంగ్ దల్ వరంగల్ మహానగర సంయోజక్ ఆదిత్యసాయి, విశ్వవిద్యాలయ ప్రఖండ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ధర్మాచార్య ప్రముఖ్ గూడూరు రాకేష్, సభ్యులు రామానుజం, వెంకటేశ్, తారక్ రాజ్‌కుమార్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు నియామకాల్లో అవకతవకలు

- కౌన్సెలింగ్ కేంద్రం వద్ద నిరుద్యోగుల ఆందోళన
- రంగంలోకి దిగిన కలెక్టర్.. ఒకరి సస్పెన్షన్‌కు ఆదేశం

వరంగల్ మెడికల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్స్ ఉద్యోగాల ఎంపికలో భారీ అక్రమాలు జరిగాయని నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. తమకు అనుకూలమైన వారికి మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలంటూ ఫోన్ సందేశాలు పంపి అర్హులైన తమకు అన్యాయం చేశారని నిరుద్యోగులు నిరసనకు దిగారు. శనివారం ఉదయం హనుమకొండ జిల్లా పరిషత్ హాలులో వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని 15 కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు, ఎంఎల్‌హెచ్‌పీ ఉద్యోగాల కోసం ఎంపికైన వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలని అభ్యర్థులను ఆహ్వానించారు. ఎంపిక ప్రక్రియలో అర్హులైన వారికి అన్యాయం జరిగిందని నిరుద్యోగులు అక్కడికి చేరుకొని పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. తమ కంటే మార్కులు తక్కువగా వచ్చిన వారికి ఎలా ఉద్యోగాలు ఇస్తారంటూ నిలదీశారు. అదేవిధంగా రోస్టర్ పాయింట్లు తమకు అనుకూలంగా ఉన్న వారికి వచ్చేవిధంగా సగదిద్దారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

ఈ జాబితాపై కొందరు అభ్యర్థులు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన కలెక్టర్ డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్‌ను తీసుకొని నేరుగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి విచ్చేశారు. ఇందుకు బాధ్యులైన ఓ కాంట్రాక్టు ఉద్యోగిని సస్పెండ్ చేయాలని వెంటనే ఆదేశించారు. అలాగే కార్యాలయం సూపరింటెండెంట్, సీనియర్ అసిసెక్టంట్‌కు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. అదే విధంగా ఈ వ్యవహారంలో మొత్తం ఫైళ్లను తన వద్దకు తీసుకురావాలని ఆదేశించారు.

ఒక్కో పోస్టుకు రూ.5లక్షలు?

ఈ కాంట్రాక్టు స్టాఫ్ నర్సు ఉద్యోగాల భర్తీలో సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ నుంచి మొదలుకొని కార్యాలయ సూపరింటెండెంట్ వరకు ఒక్కో పోస్టుకు రూ.5లక్షల చొప్పున వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అనుకూలమైన వ్యక్తులకు ఇప్పించేందుకు మెరిట్‌లో ఉన్న వారికి ఎవరికి సందేశాలు పంపలేదని, మెరిట్‌లో లేని వారికి మాత్రమే మొబైల్‌కు సందేశాలు పంపారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మూడు రోజులుగా ఈ సెక్షన్ చూసే సిబ్బంది అంతా ఒకే గదిలో మకాం వేసి అవినీతికి తెర లేపినట్లు తెలుస్తోంది. గతంలో కాంట్రాక్టు ఉద్యోగాల నియామక విషయంలో కూడా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో అనేక అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఉద్యోగుల సెక్షన్‌లుకూడా మార్చినప్పటికీ యథావిధిగా ఈ అక్రమాలు జరుగుతున్నాయని నిరుద్యోగులు వాపోతున్నారు.

కౌన్సెలింగ్ వాయిదా : డీఎంహెచ్‌వో వెంకటరమణ

స్టాఫ్ నర్సుల ఎంపిక ప్రక్రియలో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం వాయిదా వేశాం. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తాం. నిరుద్యోగులు ఎలాంటి ఆందోళన చెందవద్దు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి


ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి స్వాగతం పలుకుతున్న అధ్యాపకులు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అధ్యాపక, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు అవగాహన, ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శనివారం వరంగల్‌లోని పలు విద్యా విద్యా సంస్థలను సందర్శించారు. రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో నర్సిరెడ్డి మాట్లాడుతూ... అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను మండలిలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేశానన్నారు. మరోసారి అవకాశమిచ్చి గెలిపిస్తే పూర్తి స్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు నరేంద్రనగర్, శివనగర్, పైడిపెల్లి ప్రభుత్వ పాఠశాలలు, ఆరెపలి, గీసుగొండ, పరకాల గురుకులాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాస్, అధ్యాపకులు, జూనియర్ కళాశాల అధ్యాపకులు, యూటీఎఫ్ వరంగల్ జిల్లా ప్రతినిధులు టి. కుమార్, సుజన్‌ప్రసాదరావు, రవూఫ్, ఎన్. శ్రీనివాస్, బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

22న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సీహెచ్. ఉమారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రెండ్స్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్‌లో హైదరాబాద్, వరంగల్, హనుమకొండ, కాజీపేటల్లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, బ్రాంచి రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటీవ్స్, తెలుగు బీపీవో, టెలిమార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్స్‌గా పనిచేయుటకు ఆసక్తి గల వారు జాబ్ మేళాలో పాల్గొనాల్సిందిగా ఆమె కోరారు. డిగ్రీ, ఎంబీఏ, ఇంజనీరింగ్ పాసైన యువతీ, యువకులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని ఆమె తెలిపారు. అర్హత, ఆసక్తిగల యువతీ యువకులు ఈ నెల 22న ములుగు రోడ్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని ఆమె కోరారు.

పిడుగుపడి గిరిజన మహిళ మృతి

- సొమ్మసిల్లి పడిపోయిన మరో మహిళ


మౌనిక మృతదేహం

కేసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లి శివారు మేగ్యాతండాకు చెందిన లకావత్ మౌనిక (23) శనివారం మధ్యాహ్నం పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందింది. తండావాసులు తెలిపిన ప్రకారం. తండాకు సమీపంలోని వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంఖానిపేట పరిధిలోని పత్తి తీసేందుకు మేగ్యతండా చెందిన పలువురు కూలీలు వెళ్లారు. మధ్యాహ్నం అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో కూలీలంతా సమీపంలోని చెట్టు వద్దకు పరిగెత్తారు. వీరిలో ముందుగా మౌనిక చెట్టు కిందకు వెళ్లడంతో అదే సమయంలో భారీశబ్దంతో చెట్టుపై పిడుగు పడింది. వెంటనే పిడుగు నుంచి వచ్చిన విద్యుదాఘాతానికి గురైన మౌనిక అక్కడికక్కడే కిందపడిపోయింది. ఆమెను వాహనంలో మహబూబాబాద్‌కు తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలపడంతో మౌనిక మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. మృతురాలికి భర్త మహేష్, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త, కుమారుడిని చూసి తండావాసులు కంటతడి పెట్టారు. ఇదిలా ఉండగా మౌనికతో పాటు మరో మహిళా కూలీ లకావత్ అనిత సొమ్మసిల్లిపడిపోయి తర్వాత తేరుకుంది. వీరి వెనుక ఐదారుగురు కూలీలు చెట్టు కిందకు వచ్చేందుకు ప్రయత్నించారు. వీరంతా కొద్దిక్షణాలు ముందుగా చెట్టుకిందకు వచ్చి ఉంటే భారీ ప్రాణ నష్టం జరిగేదని తండావాసులు తెలిపారు. ఇదిలా ఉండగా నెక్కొండ, కేసముద్రం మండలాల సరిహద్దులో ఈ ఘటన చోటు చేసుకోవడంతో పోలీసుస్టేషన్ల పరిధి విషయంలో సందిగ్ధం నెలకొంది. దీంతో మృతదేహానికి మహబూబాబాద్‌లో పోస్టుమార్టం నిర్వహించామని, ఘటన జరిగిన ప్రాంతం నెక్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండడంతో కేసును నెక్కొండకు బదిలీ చేయనున్నట్లు కేసముద్రం ఎస్‌ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

● వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

కాశిబుగ్గ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తున్నదని వర్ధన్న పేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. 9వ రాష్ట్ర సబ్ జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ పోటీ లను శనివారం ఎమ్మెల్యే ప్రారం భించారు. ఇన్‌ఫాంట్ జీసస్ స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగాల్లో క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా కల్పిస్తున్నదని గుర్తు చేశారు. క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా తెలంగాణ క్రీడా పాలసీని తీసుకు వస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యశారద, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీరగోని రాజ్‌కు మార్, కార్యదర్శి పూజారి అశోక్‌బాబు, అసోసియేషన్ నేతలు అజీజ్, టి.రాజేందర్, జిల్లా క్రీడల అధికారి సత్యవాణి, కైలాస్‌యాదవ్, కార్పొరేటర్ సులోచన సారయ్య, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నేతలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

● వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలకు రూ.28 కోట్లు మంజూరు ● విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాయిని వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

బాలసముద్రం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): పశ్చిమ నియోజవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషిచేస్తున్నానని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. హనుమకొండ బాలసముద్రంలోని పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ.. పశ్చిమ నియోజక ర్గంలో 8 నెలల్లోనే 10 ఏళ్ల అభివృద్ధి చేశానన్నారు. వరం గల్ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.28కోట్లు మంజూరు చేయడం ఆనందకరమన్నారు. 70 ఏళ్ల కిందట అప్పటి ప్రధాని నెహ్రూ పాలిటెక్నిక్ కళా శాలకు శంకుస్థాపన చేశారని, అదే కళాశాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు సరికాదన్నారు. హైదరాబాద్‌లోని మూసీనది పనులు కాక ముందే కుంభకోణం జరిగిందని విమర్శించడం సరికాద న్నారు. కేటీఆర్‌తో సహా బీఆర్ఎస్ నాయకులు దోచుకున్న అవినీతి సొమ్మును కక్కిస్తామన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను 59 జీవోతో కొల్లగొట్టారన్నారు. భూకబ్జాలకు పాల్పడిన వారిని గుర్తిం చేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు యూట్యూబ్ చానెళ్లకు డబ్బులు ఇచ్చి తప్పుడు కథనాలను ప్రసారం చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ దుష్ప్రచారాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కుడా పరిధిలో కొంతమంది సోయి లేకుండా పని చేస్తున్నారని, అలాంటి అధికారులు పద్ధతి మార్చుకోవాల న్నారు. త్వరలోనే కార్పొరేషన్‌లో ప్రక్షాళన చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఈ.వి.శ్రీనివాస్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు విద్యార్థి విభాగం కీలకం

మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్



కరుణ్‌ను అభినందిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్

కాజీపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీకి విద్యార్థి విభాగం కీలకమని, రాబోయే రోజుల్లో విద్యార్థి విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామని మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం కాజీపేటకు చెందిన బీఆర్ఎస్‌వీ నాయకుడు గబ్బెట కరుణ్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్, కరుణ్‌లు కేక్‌కట్ చేశారు. అనంతరం కరుణ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థి విభాగం ముందుం డాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నార్లగిరి రమేశ్, గబ్బెట శ్రీనివాస్, కోండ్ర శంకర్, పులి రజినీకాంత్, పోలపల్లి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు జీటీఏ సన్మానం



కొత్త ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న జీటీఏ సభ్యులు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల డీఎస్సీలో ఎంపికై పాఠశాలలకు వస్తున్న ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం (జీటీఏ) ఆధ్వర్యంలో సన్మానించారు. శనివారం వరంగల్‌లోని మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీటీఏ జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి ప్రకాశ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్ మాట్లాడుతూ.. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో సంఘం ముందుంటుందన్నారు. అనంతరం కొత్త పంతుళ్లకు జీటీఏలో సభ్యత్వాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ డి. రవి, గౌరవ అధ్యక్షుడు పి. బుచ్చిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి. వీరాచారి, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు, ఎం. రాజేంద్రం, శ్రీధరాచార్యులు, కిరణ్, భిక్షపతి, రఘు, అశోక్, రాజు, నవీన్, రాజేందర్, రాజు, ఉపేందర్, రవిచందర్, ఉమ, స్వాతి, ప్రసన్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలో అంతర్ కళాశాలల క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలను కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థుల క్రీడా వందనాన్ని ఆయన స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, స్నేహపూర్వకంగా క్రీడా స్ఫూర్తిని పాటించాలన్నారు. కాగా, మొదటి రోజు కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్, సాఫ్ట్ పోటీలు నిర్వహించగా, మొదటి రోజు కేయూ ఇంజనీరింగ్ కాలేజ్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ విద్యార్థుల మధ్య నిర్వహించిన కబడ్డీ పోటీలో విద్యార్థులు నువ్వా నేనా అన్నట్లుగా తలపడ్డారు. ఈ కార్యక్రమంలో కేయూ స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి, పీడీ డాక్టర్ బాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.36వేల గుట్కా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లను చూపుతున్న పోలీసులు

మట్టెవాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మట్టెవాడ పోలీసు స్టేషన్ పరిధిలో నిషేధిత గుట్కాలను విక్ర యిస్తున్నారని సమాచారంతో శనివారం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. రామన్నపేటలోని విఘ్నేశ్ కిరాణంలో తనిఖీ చేసి రూ.36,310 విలువ గల గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పవన్ కుమార్ తెలిపారు. కిరాణ షాపు యజమాని వెలిమాల రాజుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కమిటీ నియామకాల్లో పారదర్శకత పాటించాలి



ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హసన్‌పర్తి, అక్టోబరు 19, (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ కమిటీల నియామకాల్లో పారదర్శకత పాటించాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు శనివారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌కు మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ మాట్లా డు తూ.. ఇందిరమ్మ కమిటీలు పారదర్శకంగా చేపట్టాలని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, సీనియర్ నాయకులు కందుకూరి చంద్రమోహన్, చాతళ్ల వేణుగోపాల్, నద్దునూరి నాగరాజు, జెట్టి రాజేందర్, మాజీ సర్పంచ్ జనగాం శరత్‌కుమార్, భగవాన్ రెడ్డి, కొయ్యడ గోపి, గణేష్, మూల దేవేందర్, క్రిష్ణాది రాజేష్, రవి పాల్గొన్నారు.

మాలల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మర్యాల కృష్ణ

కాజీపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి చింతగట్టు క్యాంపులోని కేఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించే మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ మాల మహానాడు కాజీపేట అధ్యక్షుడు మర్యాల కృష్ణ కోరారు. కాజీపేట రైల్వే కాలనీ దేవాలయంలో శనివారం మాలమహానాడు ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మర్యాల కృష్ణ మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చాలని, వర్గీకరణ పేరుతో రిజర్వేషన్లు ఎత్తివేయాలని కుట్రలు చేస్తున్నారన్నారు. రేపు జరగబోయే ఆత్మీయ సమేళనంలో అన్నివిషయాలు చర్చిస్తారన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో మాలలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయా లని పిలుపునిచ్చారు కార్యక్రమంలో నాయకులు బండి విజయ్, పప్పుల గోవర్ధన్, సీహెచ్ కొమ్మా లు, జి. కుమారస్వామి, ఈ . సత్యనారాయణ, శేఖర్, కొత్తరవి, కాందారి రాజమౌళి పాల్గొన్నారు.

మహాసేన ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా మోతీలాల్



నియామకపత్రాన్ని అందుకుంటున్న మోతీలాల్‌నాయక్

మట్టెవాడ, అక్టోబరు 19(ఆంధ్ర జ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహా సేన ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన భూక్య మోతీ లాల్ నాయక్‌ను నియ మిస్తూ ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కొంగర అనిల్‌కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. శనివారం వరంగల్‌లోని ఒక ప్రైవేట్ హోటల్‌లో మహాసేన రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్ఎస్ఎంబీ తెలంగాణ, ఏపీ రాష్ట్ర ఇన్‌చార్జి వసుకుల ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో మహిళలు సఖి సేవలు పొందాలి

శంభునిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అత్యవసర, ఆపద సమయాల్లో మహిళలు సఖి సెంటర్ సేవలు పొందాలని వరంగల్ సఖిసెంటర్ కేస్ వర్కర్ స్వప్న అన్నారు. మహిళల హక్కులు, చట్టాలపై సఖి సెంటర్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని శంభునిపేట, ఉర్సు ప్రాంతాల్లోని మహిళా సంఘాల గ్రూపులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలు, మహిళలు, బాలికలకు స్వప్న పలు విషయాలపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సఖి సెంటర్ నిరాశ్రయులు, బాధితులకు న్యాయ సేవలను అందించడంతో పాటు ఆశ్రయం కల్పిస్తుందన్నారు. 181కు కాల్‌చేసి సఖి సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మహిళలు, బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్ట్స్ వితరణ

మడికొండ, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం కడిపికొండలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు అదే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొండ్ర మంజుల స్వంత ఖర్చుతో టీషర్ట్స్ కుట్టించి శనివారం బహూకరించారు. ఈసందర్భంగా ఎంఈవో మనోజ్‌కుమార్, హైస్కూల్, ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

సీపీని కలిసిన నరకాసుర వధ ఉత్సవ కమిటీ సభ్యులు



సీపీకి వినతిపత్రాన్ని ఇస్తున్న కమిటీ సభ్యులు

కరీమాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా ఉర్సు గుట్ట రంగలీలా మైదానంలో నిర్వహించే నరకాసుర వధ ఉత్సవాలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం ఉత్సవ కమిటీ సభ్యులు సీపీ అంబర్‌కిషోర్ ఝాను కలిశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో సీపీకి పుష్పగుచ్ఛం అందజేసి, వినతిపత్రాన్ని సమర్పించారు. నరకాసుర వధ వేడుకలను వేలాది సంఖ్యలో ప్రజలు హాజరవుతారని, ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగుకుండా పోలీసులు సహకరించాలని కోరారు. సీపీని కలిసిన వారిలో ఉత్సవ కమిటీ సహాయ కార్యదర్శి ఆవునూరి రామ్మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి వనం కుమార్, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, ఆర్గనైజర్లు బాలకొమురెల్లి, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనపై వ్యాస రచన పోటీలు



ప్రమాణం చేస్తున్న ఎఫ్‌సీఐ సిబ్బంది

కాజీపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాజీపేట సోమిడి ప్రభుత్వ పాఠశాలలో శనివారం అవినీతి నిర్మూలనపై పలు పోటీలు నిర్వహించారు. యాంటీ కరప్షన్ అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఆ తర్వాత అవినీతి నిర్మూలనపై ప్రమాణం చేశారు. కాజీపేట ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ మేనేజ.ర్ కె.రాజేంద్ర ప్రసాద్, మోహన కృష్ణ, సిబ్బంది అనిల్, జగదీష్, రాజు హరికిషన్, పాఠశాల హెడ్‌మాస్టర్ శోభతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎల్ఐసీ ఉద్యోగుల సమావేశం



పాల్గొన్న ఎల్ఐసీ ఉద్యోగులు

బాలసముద్రం,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని ఎల్ఐసీ కార్యాలయంలో వరంగల్ డివిజన్ ఎన్‌వోఐ డబ్ల్యూ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. కె. వెంకటేశ్వర్లు, శివశంకర్, సూరికుమార్, రఘువీర్‌రెడ్డి, ఆర్ఎల్‌కే ప్రసాద్, సోమేశ్వర్ పాల్గొన్నారు.

కళాకారుల విభాగం జిల్లా కో-ఆర్డినేటర్‌గా వెంకటేశ్



వెంకటేశ్

మడికొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం హనుమకొండ జిల్లా కో-ఆర్డినేటర్‌గా కాజీపేట మండలం మడికొండకు చెందిన వెన్నమల్ల వెంకటేశ్‌ను హనుమకొండ జిల్లా కోర్డినేటర్‌గా నియమించినట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి శనివారం తెలిపారు. తనను జిల్లా కో ఆర్డినేటర్‌గా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్‌కు, సహకరించిన యెల్ల పోశె ట్టి, గడ్డం సుధాకర్, బీరు సురేందర్, పాలేటి రాజుకు వెంకటేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి



వినతిపత్రాన్ని చూపుతున్న అంజయ్య

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరుపట్ల అంజయ్య కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. రాయపర్తి మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఎంపికలో అర్హులను కాకుండా డబ్బులు తీసుకొని అనర్హులకు కేటాయిస్తున్నారని ఆరోపించారు. అవినీతికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గురితప్పని విలుకాడు పుస్తకావిష్కరణ

కేయూ క్యాంపస్, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి): కేయూ జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్ రూపొందించిన గురితప్పని విలుకాడు పుస్తకాన్ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి హైదరాబాద్ సెక్రటేరియెట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంగాని మల్లేశ్వర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై గురితప్పని విలుకాడు పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్‌ఠాకూర్, మేడిపల్లిసత్యం, ఎమ్మెల్సీ దండె విఠల్‌తో పాటు గ్రంథాలయ చైర్మన్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేం నరేందర్‌రెడ్డి, సంగాని మల్లేశ్వర్

బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ నేతలు

కాశిబుగ్గ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కాశిబుగ్గలో శనివారం జరిగింది. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, రాష్ట్ర నేతలు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు మహేష్, నాగరాజు, కుమార్, పరమేశ్వర్, రంజిత్, బాకం హరిశంకర్, శ్యాంసుందర్, నరేష్, అరుణ్, మహమ్మద్ రఫి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



శంభునిపేటలో సభ్యత్వ నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

శంభునిపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్మికులు వినియోగి ంచుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు కర్నె రవీందర్ అన్నారు. శనివారం శంభునిపేట జంక్షన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్ర మాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రవీందర్ కార్మికులకు సభ్యత్వాలను అందించి మాట్లాడారు. కార్మిక బీమా పథకానికి ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్మికుల కోసం మోదీ సర్కారు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కాంట్రాక్టు పోస్టుల తుది జాబితా విడుదల

వరంగల్ మెడికల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ హనుమకొండ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద వివిధ కేడర్లలో 31 పోస్టుల భర్తీకి సంబంధించి తుది జాబితాను శనివారం విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కె.లలితాదేవి తెలిపారు. ఫిబ్రవరి 2024లో దరఖాస్తు చేసుకున్న వారి మెరిట్ లిస్టులను డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రదర్శించామన్నారు. అధికారిక వెబ్‌సైట్‌లో సైతం అందుబాటులో ఉందని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గమనించాలని పేర్కొ న్నా రు. జాబితా మూడు రోజుల వరకు అందు బాటులో ఉంటుందని, ఎంపికైన అభ్య ర్థుల కు కౌన్సెలింగ్ తేదీ తెలియజేస్తామని తెలిపారు.

పాలకుర్తి ఎస్ఐ, సీఐలను సస్పెండ్ చేయాలి

బాలసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి ఎస్ఐ, సీఐలను సస్పెండ్ చేయాలని లంబాడ హక్కుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాలకుర్తి మండలం మేకల తండా గ్రామానికి చెందిన లకావత్ శ్రీనుపై పోలీసులు వేధింపులు చేశారని వెంకట్ తెలిపారు. పోలీసుల వేధింపులు తాళలేక శ్రీను తన ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు శ్రీను చావుకు కారకులైన పాలకుర్తి ఎస్ఐ, సీఐలను సస్పెండ్ చేయాలని, మృతుడి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని వెంకట్ కోరారు. న్యాయం జరగకపోతే గిరిజన సంఘాలను కలుపుకుని పెద్దఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

సుభాష్‌రెడ్డి మృతిపై ఎమ్మెల్యే సంతాపం

బాలసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లింగాల సుభాష్ రెడ్డి శనివారం మృతి చెందాడు. కాగా, ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతిపై సంతాపం ప్రకటిం చి వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

టీయూఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా భిక్షపతి



హసన్‌పర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా హసన్‌పర్తికి చెందిన పద్మశా లి సంఘం నేత దీకొండ భిక్షపతిని నియమిస్తూ టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామకానికి సహకరించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులకు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చిందు యక్షగాన వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సారయ్య



వడ్డెపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర చిందు యక్షగాన వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ సర్వసభ్య సమావేశం శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా హసన్‌పర్తి మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ చిందు యక్షగాన కళాకారు డు గజవెల్లి సారయ్య (యేసోబు) ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యద ర్శులుగా బేతాళ సురేందర్, పిల్లిట్ల ముకుం దం, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పిల్లిట్ల మహేశ్వర్, గడ్డం కనకయ్య, సంయుక్త కార్యదర్శులుగా గజ్జెల శ్రీనివాస్, గడ్డం రాజేశ్వర్‌లను ఎన్నుకున్నారు.

నేడు సంకటహర చతుర్థి వేడుకలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో ఆదివారం సంకహర చతుర్థి వేడుకలు నిర్వహిస్తున్నట్లు దత్తక్షేత్రం ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు తెలిపారు. ఆదివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం ఉంటుందన్నారు. స్వామివారిని భక్తులు దర్శించుకోవాలని వామన్‌రావు తెలిపారు.

నేటి అరుణోదయ కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలి

ఖిలావరంగల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నర్సంపేటలో ఆదివారం నిర్వహించే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర జనరల్ కౌన్సిల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు కోరారు. శనివారం ఖమ్మం రోడ్ వై జంక్షన్ వద్ద అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం నర్సంపేటలో అమరవీరుల స్థూపం నుంచి అరుణోదయ కళాకారులతో ప్రదర్శన ప్రారంభమ వుతుందన్నారు. అనంతరం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర జనరల్ కౌన్సిల్, బహిరంగసభ జరుగుతుందన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో పీవైఎల్ జిల్లా నాయకుడు గంద్రాతి హరిబాబు, ఐఎఫ్‌టీయూ నగర ప్రధాన కార్యదర్శి బన్న నర్సింగం, సాంబయ్య, కృష్ణ, ఎమ్డీ అక్బర్, అమర్ పాల్గొన్నారు.

ఫీజు కట్టలేక స్కూల్లో నిలుచున్నా..

- రాజకీయాల్లో ఉన్నా కారు కూడా నాన్న కొనలేదు..
- మెడిసిన్ చదివేటప్పుడే నజీర్‌తో అప్పుడే ప్రేమలో పడ్డా..
- పేదలకు సేవ చేసేందుకే ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌గా చేరాను..
- ఎంపీగా గెలవడం కన్నా.. పేదలకు మేలు చేయడమే మిన్న..
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో 'ఆంధ్రజ్యోతి ఇన్నర్ వ్యూ'

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)



రాష్ట్ర రాజకీయాల్లో పేరుమోసిన బడా లీడర్.. మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా పని చేసిన నేత గారాలపట్టి ఆమె. అయినా.. స్కూల్ ఫీజు కట్టలేదంటూ ఉపాధ్యాయులు నిలబెట్టిన సందర్భాలు ఉన్నాయి. మెడిసిన్ చదువు కోసం ఆర్టీసీ బస్సు, ఆటోల్లో వెళ్లిన రోజులూ ఉన్నాయి. డాక్టర్‌గా కార్పొరేట్ ఆస్పత్రిలో ప్రాక్టీస్ చేసి నాలుగు రాళ్ల వెనుకేసుకునే అవకాశం ఉన్నా.. సర్కారు దవాఖానలో వైద్యురాలిగా చేరింది. కొడుకులు లేరనే లోటు తండ్రికి లేకుండా చేసి రాజకీయాల్లో వారసురాలిగా అరంగ్రేటం తోనే ఓరుగల్లులో విజయం సాధించి మరో రాణిరుద్రమగా గుర్తింపు పొందారు. ఆమె.. కడియం కావ్య. ఓరుగల్లు రాజకీయాల్లో కీలకంగా ఉన్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె, వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య 'ఇన్నర్ వ్యూ' ఆమె మాటల్లోనే..

ఫీజు కట్టలేదని నిలుచోపెట్టారు..

నా బాల్యం అంతకూడా హనుమకొండ టీచర్స్ కాలనీలోనే గడిచింది. ఏడో తరగతి వరకు కాకతీయ స్కూల్‌లో చదువుకున్నా. మా నాన్న కడియం శ్రీహరి రాజకీయాల్లోకి వచ్చిన రోజుల్లో నాకు, మా చెల్లికి స్కూల్ ఫీజు సకాలంలో చెల్లించేవారు కాదు. మా నోట్‌బుక్‌లో ఫీజు చెల్లించాలని ఉపాధ్యాయులు రాసి పంపించేవారు. ఒక్కోసారి అందరు పిల్ల లతో మమ్మల్ని కూడా నిల్చోపెట్టేవారు. నాన్న వద్ద డబ్బులు లేక పోవడమే ఈ సమస్య అని సర్దుకునేవాళ్లం. మా నాన్న రాజకీయాల్లో బిజీగా ఉండటంతో చాలాసార్లు మాతో గడిపే వారు కాదు. ఒక్కోసారి ఉదయం 6గంటలకు బయటకు వెళితే.. రాత్రి పొద్దుపోయాక వచ్చేవారు. అయితే ఉన్నత చదువుల విషయంలో ఆయన దృష్టిపెట్టారు. కొంత సమయం కేటాయించేవారు. నాన్న లెక్చరర్ కావటంతో వివిధ సబ్జెక్టుల్లో మా ప్రతిభను అప్పుడప్పుడు పరీక్షించేవారు. చిన్నప్పటి నుంచి నాకు డాక్టర్‌ను కావాలనే కోరిక ఉండేది. దానికి నాన్న ప్రోత్సాహం తోడవ్వటంతో డాక్టర్ అయ్యాను.

> నాన్న రాజకీయాల్లో అనుసరించిన నీతి, సేవా, ధర్మాన్నే నేనూ అనుసరిస్తున్నా. అప్పుడు ప్రభుత్వ వైద్యురాలిగా, ఇప్పుడు
>
> **ఎంపీగా వచ్చే జీతం కోసం చూస్తున్నా..**
>
> ఎంపీగా నాకు వచ్చే జీతం కోసమే ఎదురుచూస్తున్నాను. సుదీర్ఘకాలం ఎన్నో పదవుల్లో ఉన్నప్పటికీ నీతివంతమైన రాజకీయం చేయాలనేదే నాన్న నేర్పిన రాజకీయ విద్య అదే అనుసరిస్తున్నాను.

ఆర్టీసీ బస్సుల్లో కాలేజీకి వెళ్లాను..

సుదీర్ఘకాలం నాన్న ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా పనిచేశారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా కొనసాగటంతో ప్రభుత్వ పరంగా వాహన సదుపాయం ఉండేది. దీంతో ఆయనకు ఎప్పుడూ కూడా సొంతంగా కారు కొనాలనే ఆలోచన రాలేదు. అయితే 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో నాన్నకు టికెట్ రాలేదు. ఏ పదవి లేకుండా పోయింది. స్నేహితుల కార్లు కూడా అందుబాటులో లేవు. దీంతో నాకు కాలేజీకి వెళ్లేందుకు కారు లేకుండా పోయింది. మెడిసిన్ ఫైనల్ ఇయర్ కావటంతో పంజాగుట్ట నుంచి సంతోష్ నగర్‌లోని డక్కన్ మెడికల్ కాలేజీకి ఆర్టీసీ బస్సులో చాలారోజులు ప్రయాణం చేసి కాలేజీకి వెళ్లాను. ఒక్కోసారి ఆటోలో కూడా ప్రయాణించి కాలేజీకి వెళ్లి చదువుకున్నా.

ప్రేమ గురించి నాన్నకు నేనే చెప్పా..

నేను మెడికల్ చదువుతున్నప్పుడే నజీర్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరం కలిసి మెడిసిన్ పూర్తి చేశాం. మొదట ఫ్రెండ్స్‌గానే ఉన్నప్పటికీ నజీర్ వ్యక్తిత్వం బాగా నచ్చింది. దీంతో ఒకరినొకరం పూర్తిగా అర్థం చేసుకున్నాం. జీవితంలో నన్ను బాగా చూసుకోగలడని నిశ్చయించుకున్న తరువాత పెళ్లి చేసుకోవాలని నిర్ణయానికి వచ్చాను. ఒక రోజు నా ప్రేమ గురించి నాన్నకు చెప్పాను. నజీర్‌ను ఇంటికి ఆహ్వానించి నాన్నకు పరిచయం చేశాను. నాన్నలో ఏదో ఆందోళన కనిపించింది. కులం, మతం కాని వ్యక్తితో పెళ్లి అంటే ఎట్లా అని ఆలోచించారు. నాన్నకు దగ్గరగా ఉండే ఇద్దరు స్నేహితులతో మాకు కౌన్సెలింగ్ కూడా ఇప్పించారు. చివరికి నజీర్‌తో మాట్లాడిన తరువాత నాన్నకు నమ్మకం కలిగింది. మా పెళ్లికి ఒప్పుకున్నారు. అంబేద్కర్ జయంతి రోజు ఏప్రిల్ 14న ఎంగేజ్మెంట్. ఆగస్టు 26న మా వివాహం జరిగింది. నాన్న నజీర్‌ను ఓ అల్లుడిగా కాకుండా ఓ కొడుకులాగే ప్రేమగా చూస్తారు.

సేవ కోసమే ప్రభుత్వ ఆస్పత్రిలో డ్యూటీ చేశా..

ఎంబీబీఎస్ పూర్తి అయిన తరువాత ఓ ప్రవేటు అస్పత్రిలో ట్రైనింగ్ చేశాను. ప్రైవేటు అస్పత్రిలో పనిచేస్తే డబ్బులు సంపాదించొచ్చు. కానీ, పేదలకు సేవ చేయాలనే ప్రభుత్వ అస్పత్రిలో చేరాలని అనుకున్నా. విషయం నాన్నకు చెబితే నీకు నచ్చినట్లు చెయ్.. అని సలహా ఇచ్చారు. దీంతో వర్ధన్నపేట పీహెచ్‌సీలో వైద్యురాలిగా చేరాను. సుమారు ఐదేళ్ల సేవలందించాను. కొన్ని వేల మందికి వైద్యసేవలు అందించాను. ఎంతో మందిని ప్రత్యక్షంగా కలుసుకుని వారు పడుతున్న కష్టాలను గుర్తించాను. మంచి వైద్యం కోసం ఎంజీఎంతోపాటు ఇతర ప్రభుత్వ అస్పత్రులకు పంపించాను.

చిన్నప్పటి నుంచే రాజకీయాలపై ఆసక్తి

చిన్నతనం నుంచి నాన్నలాగా రాజకీయాల్లోకి రావాలనే కోరిక ఉండేది. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల వరకు దగ్గరుండి చూశాను. ఓసారి జడ్పీ చైర్మన్ ఎన్నిక కోసం సభ్యులు తక్కువ పడితే క్యాంపు పెట్టారు. అక్కడున్నవారితో మాట్లాడితే రాజకీయాలపై కొంత అవగాహన కలిగింది. అప్పటి నుంచే పొలిటికల్ ఎంట్రీపై ఆసక్తి ఉండేది. ఈలోగా డాక్టర్‌గా ప్రభుత్వ అస్పత్రిలో కొంతమందికు సర్వీసు చేసే అవకాశం కలిగింది. దీంతో రాజకీయాల్లోకి రావాలనే ఆలోచనతో గత ఏడాది నవంబరులో వైద్యవృత్తికి రాజీనామా చేశాను.

బీఆర్ఎస్ నుంచి ఎంపీ టికెట్ ఇస్తామని అప్పటి నుంచే చెబుతూవచ్చారు. అనూహ్యంగా జరిగిన కొన్ని రాజకీయ పరిణామాల్లో పార్టీ మారాల్సి వచ్చింది. కాంగ్రెస్ నుంచి పోటీ చేసి వరంగల్ ఎంపీగా విజయం సాధించాను. పోటి చేసిన తొలి ఎన్నికలోనే విజయం సాధించటం చాలా ఆనందంగా ఉంది. పార్లమెంట్‌లో తొలిసారి అడుగు పెట్టడం మరుపురాని ఘట్టమే. పార్లమెంట్‌కు రాష్ట్రపతి వస్తుంటే ప్రధానమంత్రితో పాటు కేంద్ర మంత్రులు, ఎంపీలు స్వాగతం పలకడం వంటి వాటిని తొలిసారి చూసిన క్షణం మరువలేనివి.

> **సంక్షేమం, అభివృద్ధిపైనే ఫోకస్**
>
> ఎంపీగా గెలిచాననే సంతోషం కంటే.. పేదలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు ఏం చేయాలనే తపనే ఎక్కువగా ఉంది. కేంద్ర ప్రభుత్వం నుంచి సాధ్యమైనన్ని ఎక్కువ నిధులు తీసుకరావటంతోపాటు విద్య, వైద్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ప్రణాళిక రుపొందిస్తున్నాను. ఐదేళ్ల కాలంలో వరంగల్‌ను సాధ్యమైనంత అభివృద్ధి చేయాలని ఆలోచిస్తున్నాను. మామూనురు ఎయిర్‌పోర్టు, స్మార్ట్ సిటీ, యూనివర్సిటీ అభివృద్ధి, భూపాలపల్లితో పాటు ఇతర ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ, ప్రభుత్వ అస్పత్రుల్లో పేదలకు మెరుగైన సౌకర్యాలు, తదితర వాటిపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాను. ప్రజలు నమ్మకంతో గెలిపించారు. అంతే నమ్మకంతో వారికి సేవల చేయాలనే దృఢసంకల్పంతో ఉన్నాను.

రాష్ట్ర విద్య కమిషన్‌లో కేయూకు చోటు

- సలహాదారులుగా ఇద్దరు కేయూ ప్రొఫెసర్ల నియామకం
- కె.వెంకటనారాయణ, మురళీమనోహర్‌కు అవకాశం



వెంకటనారాయణ, మురళీమనోహర్

కేయూ క్యాంపస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర విద్య కమిషన్ అడ్వయిజరీ కమిటీలో వరంగల్ కాకతీయ యూనివర్సిటీ నుంచి ఇద్దరు ప్రొఫెసర్లకు అవకాశం కల్పించింది. కేయూ అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్, ప్రముఖ సామాజిక వేత్త ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ, దూరవిద్య కేంద్రం మాజీ డైరెక్టర్, ప్రముఖ విద్యావేత్త కె.మురళీమనోహర్‌లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. వర్సిటీ నుంచి తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సలహాదారులుగా ఇద్దరిని నియమించడంపై వర్సిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. వీరితో పాటు సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ జి.హరగోపాల్, కరీంనగర్ శాతవాహన వర్సిటీ ప్రొఫెసర్ సూరెపల్ల సుజాత, ఎంవీఎఫ్ నేషనల్ కన్వీనర్ పి.వెంకట్‌రెడ్డి, యూనిసెఫ్ ఎడ్యుకేషన్ స్పెషలిస్టు ఎం.శేషగిరి తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిషన్ అడ్వయిజరీ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. ఎడ్యుకేషన్ కమిషన్‌కు చైర్మన్‌గా రిటైర్డు ఐఏఎస్ అధికారి అకునూరి మురళిని గతంలోనే రాష్ట్రప్రభుత్వం నియమించింది.

ఆర్కెస్ట్రా ఆరో ప్రాణం

- సంగీతంలో పిల్లల వైద్యుడి ప్రావీణ్యం
- విద్యార్థి దశ నుంచే గాయకుడిగా రాణింపు



డాక్టర్ శివకుమార్

వరంగల్ మెడికల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయనో సీనియర్ పిల్లల వైద్యుడు. వృత్తిలో భాగంగా చిన్నారులకు వైద్యం అందిస్తాడు. కానీ సంగీతం అంటే మహా ప్రాణం. ఆర్కెస్ట్రా అంటే ఆరో ప్రాణం.. వైద్య వృత్తిలో ఎంత బిజీగా ఉన్నా ఆర్కెస్ట్రాపై మమకారం చంపుకోలేదు. విద్యాభ్యాసం నుంచే కలలు, సంగీతంపై మమకారం పెంచుకొని ఇప్పటికీ ఆచరిస్తున్నాడు.

ఎంజీఎం ఆస్పత్రి, సీకేఎం ఆస్పత్రిలో సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందాక రామన్నపేటలోని ఓ హాస్పిటల్‌లో పిల్లల వైద్యుడిగా కొనసాగుతున్న డాక్టర్ శివకుమార్ బాల్యం నుంచే కళా రంగంలో రాణించాలని పట్టుదలతో ప్రయత్నించారు. 1973లో ఎనిమిదో తరగతి చదువుతున్నప్పుడు వరంగల్ ఏబీవీ హైస్కూల్‌లో వారసత్వం, నామకరణం అనే నాటకాలలో ప్రతిభ కనబరిచారు. ఇలా ఆరంభమైన కళాపోషణ.. ఎంబీబీఎస్ విద్యాభ్యాసం వరకు కొనసాగింది. కేఎంసీలో కూడా ఏ కార్యక్రమం జరగాలన్నా ప్రార్థన గీతం ముగింపు డాక్టర్ శివకుమార్ చేయాల్సిందే. సంగీతంపై మమకారంతో డిప్లొమా పూర్తి చేశారు. ఇప్పటికీ కాకతీయ వైద్య కళాశాలలో ఏ ఉత్సవం జరగాలన్నా డాక్టర్ శివకుమార్ ఆర్కెస్ట్రాతో అలరించాల్సిందే. తన తండ్రి ఆయుర్వేద వైద్యుడైన కోటయ్య గారి దగ్గర నుంచి వారసత్వంగా కలలపై మమకారం పెంచుకున్నారు. ఇలా ఇప్పటి నుంచి మొదలై ఆరు పదుల వయస్సులో కూడా ఆర్కెస్ట్రా అంటే ప్రాణంగా జీవిస్తున్నారు. 2001లో వరంగల్ స్వర్ణ ప్యాలెస్‌లో నిర్వహించిన పాడుతా తీయగా కార్యక్రమంలో ఉషా, సారంగపాణితో పాటలు పాడి అందరినీ మెప్పించారు. పితృ అమావాస్య రోజున పితృలకు ఆశీర్వచనం కోసం వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తున్నారు. అందుకే ఆయనను డాక్టర్ అయ్యగారూ.. అని కూడా రామన్నపేట వాసులు సంబోధిస్తారు. ఈ మధ్య గిరిజా కళ్యాణం సీనియల్‌లో కూడా ఓ పాత్రకు ఎంపికయ్యారు. వృత్తిలో కొనసాగుతూనే.. తనకు ఇష్టమైన కళారంగాన్ని మాత్రం ప్రాణంగా భావిస్తూ కళాకారులుగా అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆరోగ్య సమస్యలపై అశ్రద్ధ వద్దు

- వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా
- పోలీసు సిబ్బందికి ఉచిత మెగా వైద్య శిబిరం

హనుమకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బందికి ఎదురయ్యే ఆరోగ్య సమస్యల పట్ల అశ్రద్ధ వహించొద్దని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు చెందిన పోలీసు సిబ్బంది, హోంగార్డు సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత పోలీసు ఉద్యోగులు, పోలీసు అమరవీరుల కుటుంబసభ్యుల కోసం ప్రత్యేక ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. భీమారంలోని శుభం కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి సీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్స్, శరత్ మాక్స్ విజన్ ఐ హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ ఉచిత మెగా హెల్త్ క్యాంపులో జనరల్ ఫిజీషియన్, కార్డియాలజీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, న్యూరాలజీ, పల్మనాలజీ, మెడికల్ గ్యాస్ట్రో, కంటి విభాగాలకు చెందిన వైద్యనిపుణులు పోలీసు సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన సిబ్బందికి డాక్టర్ల సూచనల మేరకు షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, సీఎఫ్టీఈ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సీపీ అంబర్ కిషోర్ ఝా సైతం కంటి పరీక్షలను చేయించుకున్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించుకున్న పోలీసు సిబ్బంది కేవలం పరీక్షలతో సరిపెట్టుకోకుండా డాక్టర్లు సూచించిన సలహాలను పాటిస్తూ సమయానికి మందులను తీసుకుంటూ సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలన్నారు. ముఖ్యంగా విధి నిర్వహణలో



శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

ఎన్ని ఒత్తిళ్లు ఉన్నప్పటికీ ఆరోగ్యం కోసం నిరంతరం వ్యాయామం, యోగా చేయడంతో పాటు దైనందిన ఆహారపు అలవాట్లలో మార్పు అవసరమని అన్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉంటే శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించగలమని అన్నారు. ఈ వైద్య శిబిరంలో సహకరించిన మెడికవర్, మాక్సీ విజన్ హాస్పిటల్స్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బందికి సీపీ అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో వెస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్‌తో పాటు ఏసీపీలు, ఆర్‌ఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలను మరువొద్దు

- సీపీ అంబర్ కిశోర్ ఝా..
- పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ

హనుమకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : శాంతి, భద్రతల పరిరక్షణకు ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులను ప్రజలు మరువొద్దని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా తెలిపారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే) పురస్కరించుకొని శనివారం పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. సీపీతోపాటు పోలీసు అమర వీరుల కుటుంబ సభ్యులు ఇందులో పాల్గొన్నారు. ఆశోకా జంక్షన్ నుంచి వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలోని అమరవీరుల స్థూపం వద్దకు చేరుకొని అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. నక్సలైట్ల చేతుల్లో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు వృథాపోవని, వారి త్యాగాల ద్వారా నేడు ప్రశాంతవాతావరణం నెలకొందని అన్నారు. అలాగే అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీపీ తెలిపారు. ఈ కొవ్వొత్తుల ర్యాలీలో డీసీపీ రవీందర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్ కుమార్, రవితో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, జాగృతి కళాబృందం కళాకారులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న పోలీసు అమరవీరుల కుటుంబాల మహిళలు



కేయూ వీసీగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

- అభినందనలు తెలిపిన వర్సిటీ వర్గాలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ నూతన ఉప కులపతిగా ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. కేయూ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, వర్సిటీ పాలక మండలి సభ్యులు నూతన వీసీ ప్రతాప్‌రెడ్డిని సాదరంగా ఆహ్వానించారు. వర్సిటీ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ పుల్లూరి సుధాకర్, డాక్టర్ పి.నవీన్, డాక్టర్ సుకుమారి, డాక్టర్ చిర్ర రాజుగౌడ్, డాక్టర్ బొద్దిరెడ్డి రమారెడ్డి, డాక్టర్ కరుకాల అనితారెడ్డి పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా నూతన ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. అందరి సహకారంతో వర్సిటీని అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు. వర్సిటీలో సమస్యలను చిత్తశుద్ధిలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అభినందనల వెల్లువ

కేయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రతాప్‌రెడ్డికి వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నేతలు వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛం, శాలువాలు అందచేసి ఘనంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అకూట్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ, ప్రొఫెసర్ మొలుగూరి శ్రీనివాస్, డాక్టర్ రమేశ్‌కుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఎమ్డీ మస్తాఫా, ఎఫ్‌వో తోట రాజయ్య, టీచింగ్, నాన్ టీచింగ్ ఏఆర్ ప్రణయ్‌కుమార్, పీఆర్‌వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ నరసింహరావు, కేయూ ఎన్జీవోస్ సంఘం జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి, సతీశ్‌బాబు, తోట ప్రభాకర్, ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ,డాక్టర్ పుల్లా శ్రీనివాస్, బొక్క మొగిళి, నమిండ్ల కిరణ్‌కుమార్, మంద నరేశ్, మాలవత్ తిరుపతి, సోరపాక అనిల్, సంగి శివాజీలతోపాటు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధకులు వీసీకి అభినందనలు తెలిపారు.

ఫ్లెక్సీల మోత

కాకతీయ యూనివర్సిటీ నూతన వీసీగా ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని గతంలో ఎన్నడూలేని విధంగా పరిపాలన భవనం ఎదుట కొందరు భారీగా స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అయితే గతంలో వర్సిటీలో ఫ్లెక్సీలు కట్టి స్వాగతాలు తెలిసిన సందర్భాలు లేకపోవడంతో నూతనంగా నయాట్రెండ్ ఫ్లెక్సీలతో స్వాగతం పలకడం వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది.

కిట్స్‌లో ముగిసిన 'సంశోధిని-24'

హసన్‌పర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ సెమినార్ హాలులో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం సంశోధిని-24 కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి అధ్యక్షతన శనివారం ఘనంగా ముగిసింది. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, కిట్స్ స్టూడెంట్ విద్యార్థి చాప్టర్, కిట్స్ టెక్నికల్ క్లబ్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌తో పాటు 10 విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో ప్రాజెక్టు ఎక్స్‌పో, ఇన్నోవిజన్, ట్రెజర్ హంట్, 70పైచిలుకు సాంకేతిక కార్యక్రమాలతో పాటు విద్యార్థులను పరిశ్రమకు సిద్ధంగా ఉన్న ఇంజనీర్లుగా తయారు చేయడానికి, సీటీసీ ఉపాధిని సాధించడానికి ఆవిష్కరణ, ఇంక్యుబేషన్, రీసెర్చ్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ వంటి అనేక అంశాలపై అవగాహన కల్పించారు. ఫెస్ట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.శ్రీలత, ప్రోగ్రాం కోకన్వీనర్ ప్రొఫెసర్ ఎం.నర్సింహారావు, ఐఎస్‌టీఈ కిట్స్ చాప్టర్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ మధుకర్‌రెడ్డి, కోఆర్డినేటర్స్ డాక్టర్ ఎస్.సునీల్ ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ బి.విజయ్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, పీఆర్‌వో డాక్టర్ డి.ప్రభాకరాచారి పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు

ఓరుగల్లుకు స్మార్ట్ 'స్వాగతం'



వరంగల్–హైదరాబాద్ ప్రధాన రహదారి రాంపూర్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు



వరంగల్ - ఖమ్మం ప్రధాన రహదారి బొల్లికుంట వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు

ఓరుగల్లు ఆంటేనే కళలు, చారిత్రక కట్టడాలకు నిలయం. నిత్యం నలుదిక్కుల నుంచి వేలాది మంది వివిధ పనులు, ఉద్యోగ నిర్వహణకు వచ్చిపోతుంటారు. చారిత్రక ఓరుగల్లులోకి వచ్చేవారిని ఆహ్వానించేందుకు నలుదిక్కులా భారీ స్వాగత తోరణాలు అధికారులు. ఏర్పాటు చేస్తున్నారు. స్మార్ట్ సిటీ నిధులతో ఏర్పాటు చేసిన ఈ తోరణాల నిర్మాణం పూర్తయితే నగరానికి ప్రత్యేక ఆకర్షణ రానుంది.

– ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

పరుచుకున్న మంచు తెరల పరదా



వరంగల్ - నర్సంపేట ప్రధాన రహదారిపై కమ్ముకున్న పొగమంచు



తెలతెలవారుతుండగా మంచుతెరలు కమ్ముకుంటున్నాయి. శీతాకాలం ప్రారంభంలోనే రహదారులను మంచు ఆవహిస్తోంది. మంచు బిందువుల జల్లుల్లో వ్యవసాయ పనులకు, ఇతర పనులకు వెళ్లేవారు తడిసి ముద్దవుతున్నారు. వరంగల్ - నర్సంపేట రహదారిని శనివారం మంచు దుప్పటి కప్పేసింది. వివిధ పనులకు వెళ్లే వాహనదారులు, పాదాచారులు మంచులోనే ప్రయాణించారు.

– ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

ఆదివారం



కపుల్స్ ప్రతీది షేర్ చేసుకోవాలి!

నలభై ఐదేళ్ల వయసులోనూ యంగ్‌హీరోయిన్లతో పోటీపడుతూ ప్రేక్షకులను అలరిస్తున్నారు విద్యాబాలన్. ఎప్పుడూ చీరకట్టులో కనిపించే విద్యాబాలన్ వుమెన్ ఓరియెంటెడ్ చిత్రాలతో ప్రత్యేక గుర్తింపును సాధించారు. వైవాహికజీవితం సంతోషంగా ఉందంటున్న విద్యాబాలన్ గురించి మరికొన్ని విశేషాలు ఇవి...

'పరిణీత' సినిమాతో 2005లో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన విద్యాబాలన్ ఆ తరువాత వెనుదిరిగి చూసుకోలేదు. వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. "నా 24 ఏళ్ల వయసులో 'పరిణీత' అవకాశం వచ్చింది. ఆ సమయంలో ఏదో సాధించాలనే బలమైన కోరిక ఉండేది. ఇప్పుడు తలుచుకుంటే అప్పుడు ఎంత ఆత్మవిశ్వాసంతో ఉన్నానో అనిపిస్తుంది. సినిమా రంగంతో సంబంధం లేకుండా వచ్చిన ఒక అమ్మాయి ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడమంటే మాటలు కాదు. నేనేమీ సినిమాలు చూస్తూ పెరగలేదు. మాది మధ్యతరగతి సంప్రదాయ కుటుంబం" అని అంటారు విద్యాబాలన్. సిద్ధార్థ్‌రాయ్ కపూర్‌ని పెళ్లి చేసుకున్న విద్యాబాలన్ అద్దె ఇంట్లో నివసిస్తున్నారంటే ఆశ్చర్యపోకుండా ఉండలేరు. అయితే దీనికి ఒక కారణం ఉందంటారామె. "ఒక మంచి ఇల్లు చూసి తీసుకుందామని చాలా వెతికాం. దాదాపు 25 ఇళ్లు చూశాం. కానీ నచ్చలేదు. ఒకే ఒక్క ఇల్లు నచ్చింది.

అది అద్దెకు మాత్రమే ఇస్తామన్నారు. అన్ని రకాలుగా నచ్చడంతో అద్దె అయినా ఫర్వాలేదని దిగిపోయాం. అద్దె ఇళ్లలో ఉండను అని నేను చాలా సార్లు చెప్పాను. కానీ ఈ ఇల్లు చాలా కంఫర్టబుల్‌గా ఉంది. అందుకే తప్పలేదు. గార్డెన్, సీ వ్యూ..వంటి నాకు నచ్చినవి ఎన్నో ఉన్నాయి" అని కారణాన్ని పంచుకుంటారు విద్యాబాలన్.

పని మాత్రమే సీరియస్

విద్యాబాలన్ చిత్రాలను చూసిన వారెవరైనా సీరియస్ నటి అనుకుంటారు. కానీ ఆమె చాలా సరదాగా ఉంటారు. వుమెన్ ఓరియెంటెడ్ చిత్రాల ఎంపిక వల్ల ఆ ముద్ర పడిపోయింది. "నిజానికి నేను సీరియస్ పర్సన్‌ని కాను. నా పనిని మాత్రమే సీరియస్‌గా చేస్తాను. వుమెన్ ఓరియెంటెడ్ సినిమాల్లో సీరియస్ టోన్ ఉంటుంది. నేను అలాంటి రోల్స్‌ని ఎక్కువ చేయడంతో సీరియస్ నటి అన్న ముద్ర పడిపోయింది" అని అంటారు విద్యాబాలన్.

చీర నా ఫేవరేట్

విద్యాబాలన్ ఎక్కువగా చీరకట్టులోనే కనిపిస్తారు. చీరలను అమితంగా ఇష్టపడటం వెనక కారణం ఏమైనా ఉందా అంటే నా దృష్టిలో సెక్సీయెస్ట్ గార్మెంట్ శారీనే అంటారు. "మీరు గుడికి వెళుతున్నట్టయితే చీరను ఒక రకంగా ధరించవచ్చు. అదే పార్టీకి వెళుతున్నట్లయితే అదే చీరను ఇంకో స్టయిల్‌లో కట్టుకోవచ్చు. ఒకవేళ మీ వర్క్‌ప్లేస్‌కు వెళుతుంటే మరోరకంగా ధరించవచ్చు. నా దృష్టిలో వెర్సటైల్ గార్మెంట్ ఇది. అందుకే నాకు చీరలు ధరించడమంటే ఇష్టం" అని అంటారు విద్యాబాలన్.

వైవాహిక జీవితం..

సినిమా రంగానికే చెందిన సిద్ధార్థ్‌రాయ్ కపూర్‌ని వివాహం చేసుకున్నారు విద్యాబాలన్. పెళ్లయిన తరువాత కూడా సినిమాల్లో బిజీబిజీగా గడుపుతున్నారామె. "పెళ్లి అనేది ఇద్దరి మధ్య ముడిపడిన బంధం. అందులో మూడో వ్యక్తి జోక్యం అవసరం లేదు. భార్యాభర్తల బంధం బాగుండాలంటే కమ్యునికేషన్, షేరింగ్ చాలా ముఖ్యం. భార్యాభర్తల మనసులో ఏముందో మూడో వ్యక్తి తెలుసుకోలేరు. ఒకరి గురించి మరొకరు ఏమనుకుంటున్నారో మూడో వ్యక్తి ఎలా కనుక్కుంటాడు. ప్రతీ జంట ఒక ప్రత్యేకమైన శైలిని కలిగి ఉంటారన్నది నా నమ్మకం. అయితే నా దృష్టిలో ఇద్దరూ ఓపెన్‌గా మాట్లాడుకుంటే చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. నేను, సిద్ధార్థ్ ప్రతీదీ చర్చించుకుంటాం. ఒకవేళ ఒకరికి కోపం వచ్చినా, ప్రేమ కలిగినా నిజాయితీగా దాన్ని వ్యక్తపరుస్తాం. అది చాలా ముఖ్యం. ప్రతీదీ షేర్ చేసుకోవడం కపుల్స్‌కి చాలా అవసరం. ఎంత బిజీగా ఉన్నా ఇద్దరూ కలిసి కొంత టైం స్పెండ్ చేయడం కూడా ముఖ్యమే. సంతోషంగా ఎలా జీవించాలో సిద్ధార్థ్‌కు బాగా తెలుసు. నాకు అది తెలియదు. నేను చాలా డిసిప్లిన్‌గా ఉంటాను. జీవితాన్ని ఎలా చేయాలో, ఎలా రిలాక్స్ కావాలో తనే నేర్పించాడు. ఇద్దరం కలిసి ట్రావెల్ చేయడాన్ని ఇష్టపడతాం" అని అంటారు విద్యాబాలన్. ఆమె నటించిన రోమాంటిక్ కామెడీ చిత్రం 'దో ఔర్ దో ప్యార్' ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలయింది.

> షూటింగ్ లేకపోతే వీలైనంత వరకు ఇంటికే పరిమితమవుతాను. కుటుంబసభ్యులతో గడపడానికి ఇష్టపడతాను. ఎక్కువగా నిద్రపోతాను. పుస్తకాలు చదువుతాను. సినిమాలు చూస్తాను. రిలాక్స్ అవుతాను. సోషల్ మీడియాలో వచ్చే అన్నిపోస్టులను చదవను. నేనేదైనా పోస్టు చేయాలనకుంటే నా సోషల్ మీడియా టీమ్ ఆ పనిచేసి పెడుతుంది. ఇన్‌స్టాలో ఫొటోలు చూస్తుంటాను. కామిక్ రీల్స్ అంటే ఇష్టం.

గోల్డెన్ రేషియో

మన దీపిక బంగారమే!

ప్రపంచం మొత్తంలో పది మంది అత్యంత అందమైన అతివలను ప్రతి ఏటా ఎంపిక చేస్తూ ఉంటారు. 'గోల్డెన్ రేషియో ఫార్ములా' ఆధారంగా ఎంపిక చేసే ఆ పది మంది అందగత్తెల్లో మన బాలీవుడ్ భామ దీపికా పదుకొనె కూడా ఉంది. ఆ విశేషాలు తెలుసుకుందాం!

లండన్‌లో స్థిరపడిన ఫేసియల్ కాస్మొటిక్ సర్జన్, డాక్టర్ జులియన్ డి సిల్వ, ప్రతి ఏటా, ప్రపంచ వ్యాప్తంగా పది మంది అందమైన మహిళలను ఎంపిక చేసి, ర్యాంకుల వారీగా వాళ్ల పేర్లను ప్రకటిస్తూ ఉంటాడు. అందుకోసం అతను గోల్డెన్ రేషియో ఫార్ములాను అనుసరిస్తూ ఉంటాడు. శాస్త్రీయ కొలతలతో అందాన్ని కొలవడం ఈ గ్రీకు ఫార్ములా ప్రత్యేకత. ముఖం పొడవు, వెడల్పుల ఆధారంగా గోల్డెన్ రేషియోను లెక్కిస్తారు. 1.618 నిష్పత్తికి దగ్గరగా ఉన్న విలువలను ఆదర్శ సౌందర్యంగా లెక్కించడం ఆనవాయితీ! ఈ నిష్పత్తిని ప్రత్యేకమైన ముఖ లక్షణాలకు కూడా అన్వయిస్తూ ఉంటారు.

గోల్డెన్ రేషియో స్కోర్లు

డాక్టర్ డి సిల్వ, ఎంపిక చేసిన పది మంది అందగత్తెల్లో మొదటి స్థానాన్ని ఇంగ్లీషు నటి, జోడీ కోమర్ సొంతం చేసుకుంది. ఈమె గోల్డెన్ రేషియో, 94.52 శాతం. ఆమె పెదవులు, ముక్కు తీరు, 98.7 శాతం స్కోరును దక్కించుకున్నాయి. ముక్కు కొలత, పెదవుల ఆకారం, కళ్ల ప్రదేశాలు కూడా ఆమెకు మంచి మార్కులే తెచ్చిపెట్టాయి. ఇదిలా ఉంటే, డాక్టర్ డి సిల్వ ప్రపంచంలోని పది మంది అందగత్తెల్లో దీపికా పదుకొనెకు తొమ్మిదో స్థానాన్ని కల్పించాడు. ఈ పోటీలో దీపిక 91.22 స్కోరును పొందడం విశేషం. 2018లో కూడా దీపికాను, యుకెలోని వార్తాపత్రిక, ఈస్టర్న్ ఐ, సెక్సీయెస్ట్ ఇండియన్ విమెన్‌గా ప్రకటించింది. తాజాగా తల్లైన ఈ 38 ఏళ్ల బాలీవుడ్ భామ, నవంబరు ఒకటిన విడుదల కాబోతున్న సింఘం ఎగైన్ చిత్రంలో కనిపించబోతోంది. ఒక్కో సినిమాకు 15 నుంచి 30 కోట్ల రెమ్యునరేషన్ తీసుకుంటూ, ప్రస్తుతం బాలీవుడ్‌లో అత్యంత ఎక్కువ రెమ్యునరేషన్ తీసుకుంటున్న తారగా కూడా దీపిక పేరు తెచ్చుకుంది.

వీళ్లే ఆ పది మంది

స్కోర్ ఆధారంగా ఎంపికైన పది మంది అందగత్తెల్లో ఇంగ్లీషు నటి జోడీ కోమర్ 94.52 శాతాన్ని సాధిస్తే, అమెరికన్ నటి, గాయని, జెండాయా 94.37 శాతాన్ని, అమెరికన్ మోడల్, బెల్లా హదీద్, 94.35 శాతాన్నీ, అమెరికన్ గాయని,



బియాన్సే 92.44, మెరికన్ గాయని, నటి ఆరియానా గ్రాండె, 91.81, అమెరికన్ గాయని టేలర్ స్విఫ్ట్ 91.64, బ్రిటిష్ మోడల్ జోర్డాన్ డన్, 91.39, అమెరికన్ టివి పర్సనాలటీ, కిమ్ కర్దాషియాన్ 91.28, భారతీయ హిందీ నటి దీపిక పదుకొనె, 91.22 శాతం, దక్షిణ కొరియా మోడల్, హో యాన్ జుంగ్, 89.63 శాతం స్కోరునూ సొంతం చేసుకున్నారు.

> మనం ముఖం పొడవు, వెడల్పులను కొలిచి, ఆ విలువలను పొడవు, వెడల్పులతో భాగిస్తే వచ్చే ఫలితమే గోల్డెన్ రేషియో. ఆ ఫలితం 1.62కు దగ్గరగా ఉండాలి. ఈ అంకెను 'ఫై' అంటారు. ఈ పేరు, గ్రీకు శిల్పి ఫైడియాస్ నుంచి వచ్చింది. ఇతను తాను చెక్కే విగ్రహాలకు ఇదే సూత్రాన్ని అన్వయిస్తూ ఉంటాడు.

గోల్డెన్ రేషియో అంటే?

మనం ముఖం పొడవు, వెడల్పులను కొలిచి, ఆ విలువలను పొడవు, వెడల్పులతో భాగిస్తే వచ్చే ఫలితమే గోల్డెన్ రేషియో. ఆ ఫలితం 1.62కు దగ్గరగా ఉండాలి. ఈ అంకెను 'ఫై' అంటారు. ఈ పేరు, గ్రీకు శిల్పి ఫైడియాస్ నుంచి వచ్చింది. ఇతను తాను చెక్కే విగ్రహాలకు ఇదే సూత్రాన్ని అన్వయిస్తూ ఉంటాడు. ఈ కాన్సెప్ట్ ఆధారంగా ఒకరి ముఖాన్ని అంచనా వేసేటప్పుడు, ఆ ముఖంలో ఆకట్టుకునే లక్షణమేదో, గోల్డెన్ రేషియో సూత్రాల ఆధారంగా ఆ లక్షణానికి ఎంత స్కోరును కేటాయించవచ్చో లెక్కిస్తారు. ముఖంలో వేర్వేరు అవయవాల మధ్య ఉండే వ్యత్యాసం, దూరాలను కూడా కచ్చితంగా లెక్కిస్తారు. ఉదాహరణకు, వెంట్రుకలకూ కళ్లకూ మధ్య ఉండే దూరం, రెండు కళ్లకూ మధ్య ఉండే దూరం, ముక్కు దిగువ నుంచి చుబుకం వరకూ ఉన్న దూరాలను లెక్కించి, ఆదర్శవంతమైన నిష్పత్తితో సరిపోల్చుతారు. ఆ నిష్పత్తి 1.62 నిష్పత్తికి ఎంత దగ్గరగా ఉంటే, గోల్డెన్ రేషియో స్కోర్‌ను అంత ఎక్కువ ఉన్నట్టు లెక్క. సాధారణంగా ఈ కొలతలను, నిష్పత్తులనూ కాస్మొటిక్ సర్జరీలు, ఈస్థటిక్స్‌లో ముఖాన్ని అందంగా కనిపించేలా తీర్చిదిద్దే క్రమంలో ఉపయోగిస్తూ ఉంటారు. ప్రపంచంలోని పది మంది అందగత్తెలను ప్రకటించిన డాక్టర్ డి సిల్వ ఈ గోల్డెన్ రేషియో గురించి మాట్లాడుతూ... "కళ్లు, పెదవులు, ముక్కు మొదలైన, ముఖంలోని ఎలిమెంట్స్‌ను పరీక్షించడం కోసం మా క్లినిక్‌లో డిజిటల్ మ్యాపింగ్‌ను ఉపయోగిస్తాం. తర్వాత ఈ ఎలిమెంట్స్‌ను గోల్డెన్ రేషియోతో సరిపోల్చి, వాళ్ల ఆకర్షణను లెక్కిస్తాం. అలాగే ముక్కు, కళ్లు, పెదవుల మధ్య దూరాన్ని సాఫ్ట్‌వేర్ సహాయంతో విశ్లేషించి, వాటిని గోల్డెన్ రేషియోతో సరిపోల్చి, అలైన్‌మెంట్‌ను నిర్ధారిస్తాం" అంటూ సౌందర్య స్కోర్‌ను లెక్కించే విధానాన్ని వివరిస్తున్నాడు.

జీబ్రా స్ట్రిప్పింగ్ తెలుసా?

నవంబర్ నుంచి ఇక వరుసగా పండగలు వస్తాయి. పండగలు వచ్చాయంటే ఫ్రెండ్స్ రావటం .. పార్టీలు చేసుకోవటం మామూలే! కొన్ని సార్లు ఈ పార్టీల వల్ల మర్నాడు ఉదయం హ్యాంగోవర్లు రావటం కూడా మామూలే! ఈ మధ్యకాలంలో ఇలాంటి హ్యాంగోవర్లను తప్పించుకోవటానికి- జీబ్రా స్ట్రిప్పింగ్ అనే కొత్త పద్ధతిని పౌష్టికాహార నిపుణులు సూచిస్తున్నారు.

ఈ పద్ధతిలో ఆల్కహాల్ తాగిన వెంటనే నాన్ ఆల్కాహాలిక్ డ్రింక్స్‌ను తాగుతారు. దీని వల్ల అదనంగా ఆల్కహాల్ తాగటం తగ్గుతుంది. దీనితో లివర్‌పై ఒత్తిడి తక్కువ అవుతుంది. హ్యాంగోవర్ కూడా ఉండదు. ఇక పార్టీలకు వెళ్లే సమయంలోనే ముందుగానే ప్లాన్ చేసుకొమ్మని నిపుణులు సూచిస్తున్నారు. వీరి సూచనల ప్రకారం..

- ముందుగానే ఎంత ఆల్కహాల్ తాగాలనే విషయాన్ని నిర్ణయించుకోవాలి. ఎటువంటి పరిస్థితుల్లో అంత కన్నా ఎక్కువ తాగకూడదు.
- ఈ మధ్యకాలంలో అన్ని చోట్ల మాక్‌టైల్స్ లభిస్తున్నాయి. వీలైనంత వరకు ఆల్కహాల్ బదులుగా ఈ మాక్‌టైల్స్‌ను తాగితే మంచిది.
- ఇతరులు ఒత్తిడి చేస్తున్నారని వేగంగా ఆల్కహాల్ తాగకూడదు. వీలైనంత నెమ్మదిగా తాగాలి. దీని వల్ల ఆల్కహాల్ ఇన్‌టేక్ తగ్గుతుంది.

టాలీవుడ్‌లో కామియో మెరుపులు

డిజిటల్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధి చెంది, ఓటీటీలు అందుబాటులోకి రావడంతో వీక్షకులకు యూనివర్సెల్ కంటెంట్ విపరీతంగా అందుబాటులోకి వచ్చింది. భాషలతో సంబంధం లేకుండా పాన్ వరల్డ్ కథలు ప్రేక్షకుల్ని అలరిస్తున్నాయి. దాంతో ఓటీటీ ప్రస్తుతం నిత్య అవసరాల్లో ఒకటిగా మారిపోయింది. దీని వల్ల థియేటర్లకు వెళ్లి సినిమాలు చూసే వారికి సంఖ్య నెమ్మదిగా తగ్గుతూ వచ్చింది. న్యూ ఏజ్, కొత్త తరహా కంటెంట్‌కు అలవాటు పడిన వీక్షకుడిని ఆకర్షించాలంటే చూడని కథను చూపించాలి. తెరపై అద్భుతాలను ఆవిష్కరించాలి. వీటితోపాటు తెరపై నచ్చిన స్టార్లు, గొప్ప కాంబినేషన్లతో అయినా మెస్మరైజ్ చేయాలి. లేదంటే కొత్తదనం కోరుకునే ఆడియన్స్‌ని థియేటర్స్‌కు తీసుకు రావడం చాలా కష్టమే! మళ్లీ ప్రేక్షకుల్ని థియేటర్ బాట పట్టించటానికి దర్శక నిర్మాతలు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. ఏదో ఒక పాత్రలో ప్రముఖ నటి లేదా నటుడిని కామియో రూపంలో జొప్పిస్తున్నారు.

కథ రసవత్తరంగా సాగుతున్న సమయంలో హఠాత్తుగా ఒక స్టార్ మెరుపులా తెరపై మెరవటం ఆ పాత్ర కథకు చాలా కీలకం కావడం ఈ మధ్యకాలంలో చాలానే చూశాం. కొన్ని సందర్భాల్లో ఆ పాత్ర సినిమాకు కీలకం కావచ్చు, అతిథిగా మెరిసే పాత్ర కూడా కావచ్చు. ఇలా ప్రేక్షకుల్ని ఆకర్షించడం ఓ ట్రెండ్‌గా మారింది. అయితే ఇది తెలుగు తెరకు కొత్తేమీ కాదు. గతంలోనూ ఇలాంటి కామియో రోల్స్ చేసిన తారలు ఉన్నారు. దీని వల్ల ప్రేక్షకులతోపాటు ఆ సినిమా హీరోతోపాటు కామియో చేసిన నటుడి అభిమానులను ఆకర్షించే అవకాశం ఉంది.

ఇటీవల కాలంలో చూసుకుంటే ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి 2898 ఎడి' చిత్రంలో రాజమౌళి భైరవకు రైవల్‌గా, రామ్‌గోపాల వర్మ చెఫ్ చింటుగా, దుల్కర్ సల్మాన్ పైలట్‌గా, విజయ్ దేవరకొండ అర్జునుడిగా, మాళవిక నాయర్ ఉత్తరగా ఓ రాణి పాత్రలో, ఫరియా అబ్దుల్లా కాంప్లెక్స్‌లో డ్యాన్సర్‌గా కాసేపు కనిపించి మెప్పించారు. అలాగే రవితేజ హీరోగా హరీష్ శంకర్ రూపొందించిన మిస్టర్ బచ్చన్ చిత్రంలో యాత్ యువరాజ్‌గా తనదైన శైలిలో మెప్పించాడు సిద్ధూ. కమిటీ కుర్రాళ్లు క్లైమాక్స్‌లో మెగా డాటర్ నిహారిక ఓ పాటలో మెరిసింది. నవదీప్ నటించిన 'లవ్ మౌళి'లో రానా గెస్ట్‌గా కనిపించి మెప్పించారు. 'మా నాన్న సూపర్ హీరో'లో రాజు సుందరం మెరిశారు.

కొందరు హీరోలు అయితే ఎప్పుడూ హీరోలుగానే కనిపించాలా? సినిమాకు అవసరం, ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది అంటే కామియో చేయడానికి ఏ మాత్రం ఆలోచించడం లేదు. గతంలో హిందీ చిత్రాల్లో నటించిన నాగార్జున చాలా ఏళ్ల గ్యాప్ తర్వాత హిందీ చిత్రం 'బ్రహ్మాస్త్ర'లో నటించారు. ఇందులో నాగార్జున పోషించిన పాత్ర ఆర్కియాలజిస్ట్ పాత్ర సినిమాకు కీలకంగా నిలిచింది. హిందీ ప్రేక్షకులతోపాటు తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించారు. వెంకటేశ్ కూడా తన స్నేహితుడు సల్మాన్ ఖాన్ కోసం 'కబీ ఈద్ కబీ దివాలీ'లో కీ రోల్ చేశారు. సినిమాలు చేస్తున్నారు. గత ఏడాది సంక్రాంతి బరిలో విజయం సాధించిన చిరంజీవి 'వాల్తేరు వీరయ్య'లో మాస్ మహారాజ రవితేజ చిరుకి తమ్ముడికి కీలక పాత్ర పోషించి మెప్పించారు. గతంలో వీరిద్దరూ అన్నయ్య సినిమాలో కలిసి నటించారు. అలాగే చిరంజీవి హీరోగా నటించిన 'గాడ్ ఫాదర్'లో బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ కీలక పాత్ర పోషించారు. ఈ మధ్యకాలంలో విడుదలయిన విజయ్ 'గోట్' సినిమాలో ఒక సీనులో ధోని కనిపిస్తాడు. రజనీకాంత్ 'కూలీ' సినిమాలో అమీర్‌ఖాన్ ఒక చిన్న పాత్రలో కనిపించనున్నాడనే వార్త ప్రేక్షకులకు కొత్త కిక్‌ను ఇచ్చింది.



బాలీవుడ్‌లో మామూలే...

టాలీవుడ్‌లో ఒకప్పుడు కామియో పాత్రలు అడపాదడపా కనిపిస్తుండేది. బాలీవుడ్‌లో మాత్రం తరచూ ఏదో ఒక సినిమాలో స్టార్ టు స్టార్ కామియో చూస్తుంటాం.

> గతంలో దర్శకుడు, నిర్మాత ఏదో ఒక సన్నివేశంలో కనిపించేవారు. దాసరి నారాయణరావు, రామానాయుడు, ఎంఎస్ రాజు, అనీల్ రావిపూడి ఇలా చెప్పుకుంటే ఎందరో ఉన్నారు. ఏదో ఒక చిత్ర పాత్ర పోషించి మెప్పించేవారు. ప్రేక్షకులకు థ్రిల్ ఫీలయ్యేలా చేసేవారు. ఆ తర్వాతి కాలంలో ఈ కామియోలు తగ్గాయి. కానీ కోవిడ్ తర్వాత ప్రేక్షకులను ఆకర్షించటానికి దర్శకులు దీనిని ఒక వ్యూహంగా వాడుకుంటున్నారు. కల్కి 2898 సినిమాలో రాజమౌళి, రామ్‌గోపాల్ వర్మ, విజయ్ దేవరకొండలు చిన్న చిన్న పాత్రల్లో మనకు కనిపిస్తారు. అవన్నీ సినిమాకు బోనస్‌గా నిలిచాయి. అభిమానులకు కొత్త అనుభూతిని కలిగించాయి.

> సీనియర్ హీరోలు, యంగ్ హీరోలు కలిసి 'కీరోల్స్' చేయడం మంచి పరిణామం. ఎలాగూ ఆయా సినిమా హీరోకి ఉన్న స్టార్‌డమ్ వల్ల ఆ చిత్రంపై అంచనాలు కామన్‌గానే ఉంటాయి అదే సినిమాలో ఇంకో హీరో కీ రోల్‌లో యాడ్ అయితే అదనపు బలం చేకూరుతుంది. ప్రస్తుతం ఉన్న ఇదే ట్రెండ్ కొనసాగితే భవిష్యత్తులో కామియోలు లేకుండా సినిమాలను ఊహించుకోవటమే కష్టం అవుతుంది.

పఠాన్ సినిమాలో సల్మాన్‌ఖాన్, టైగర్ 3 సినిమాలో షారూక్ ఖాన్, ఆల్వాలో హృతిక్ రోషన్, ఘూమర్ సినిమాలో అమితాబ్ బచ్చన్, బ్యాడ్ న్యూస్ సినిమాలో అనన్యపాండేలు ఒక మెరుపు మెరిసి ప్రేక్షకులకు అలరించారు. తాజాగా హిట్ అయిన 'స్త్రీ2' సినిమా ఉత్కంఠగా సాగుతున్న సమయంలో హఠాత్తుగా అక్షయ్‌కుమార్ ఒక మెరుపులా మెరుస్తాడు. చాలా మంది ప్రేక్షకులకు ఇంటికి తిరిగి వచ్చేసిన తర్వాత కూడా అక్షయ్ పాత్ర గుర్తుండిపోతుంది. అలాగే టాలీవుడ్‌లో మంచు విష్ణు కీలక పాత్రలో తెరకెక్కుతున్న కన్నప్ప చిత్రంలో ప్రభాస్, కాజల్, శరత్‌కుమార్, అక్షయ్ కుమార్, ప్రీతి ముకుందన్, మోహన్‌లాల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అంతే కాదు బాలీవుడ్ సినిమాల్లో టాలీవుడ్ హీరోలు కామియో పాత్రలు చేసి పాన్ ఇండియా సినిమాలుగా మారుస్తున్నారు. హిందీలో ఆమిర్‌ఖాన్ హీరోగా అద్వైత్ చందన్ తెరకెక్కించిన 'లాల్‌సింగ్ చద్దా'లో అక్కినేని నాగచైతన్య కీలక పాత్ర పోషించారు. గతంలో హిందీ చిత్రాల్లో నటించిన నాగార్జున చాలా ఏళ్ల గ్యాప్ తర్వాత హిందీ చిత్రం 'బ్రహ్మాస్త్ర'లో నటించారు. ఇందులో నాగార్జున పోషించిన పాత్ర ఆర్కియాలజిస్ట్ పాత్ర సినిమాకు కీలకంగా నిలిచింది. విశ్వనాయకుడు కమల్‌హాసన్ కమ్‌బ్యాక్ సినిమాలో తమిళ స్టార్ హీరో సూర్య రోలెక్స్ అనే అద్భుతమైన పాత్ర పోషించారు. అది సినిమాకు చాలా ప్లస్ అయింది. చిత్రంలో సూర్య ఎంట్రీతో మూవీ లవర్స్ థియేటర్స్‌లో గోల పెట్టారు.

మరోవైపు మలయాళ స్టార్స్ మమ్ముట్టి, పృథ్వీరాజ్ కూడా కామియో పాత్రలు చేస్తున్న జాబితాలో ఉన్నారు. సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో అఖిల్ హీరోగా నటించిన 'ఏజెంట్'లో మమ్ముట్టి కీ రోల్ చేశారు. పాన్ ఇండియా చిత్రం సలార్‌లో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించారు. హీరో దుల్కర్ సల్మాన్ నటించిన తెలుగు చిత్రం సీతారామం లో సుమంత్ కీ రోల్ చేశారు. చిరంజీవి నటించిన 'ఆచార్య', గాడ్ ఫాదర్ చిత్రాల్లో సత్యదేవ్ కీలక పాత్ర పోషించారు. హీరోగా ఫామ్‌లో ఉన్న మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ 'ముఖచిత్రం'లో కీ రోల్ చేశారు.

ఈ వారమే విడుదల

ఈరోజు నుంచి వచ్చే శనివారం వరకు వివిధ ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు



ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఫ్యామిలీ ప్యాక్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 23
ది కమ్‌బ్యాక్:2004 బోస్టన్ రెడ్ సాక్స్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 23
బ్యూటీ ఇన్ బ్లాక్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 24
టెర్రిటరీ	వెబ్‌సిరీస్	అక్టోబర్ 24
దట్ నైన్టీస్ షో	వెబ్‌సిరీస్	అక్టోబర్ 24
దో పత్తీ	హిందీ చిత్రం	అక్టోబర్ 25
డోంట్ మూవ్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 25
హెల్‌బౌండ్ 2	కొరియన్ సిరీస్	అక్టోబర్ 25
అమెజాన్ ప్రైమ్		
నాటిలిస్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 25
జ్విగాటో	హిందీ చిత్రం	అక్టోబర్ 25
జియో సినిమా		
ది బైక్‌రైడర్స్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 21
ఫ్యూరియోసా: ఎ మ్యాడ్ మ్యాక్స్ సాగా	తెలుగు డబ్బింగ్	అక్టోబర్ 23
ది మిరండా బ్రదర్స్	హిందీ చిత్రం	అక్టోబర్ 25
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
ది లెజండ్ ఆఫ్ హనుమాన్ 5	తెలుగు డబ్బింగ్ సిరీస్	అక్టోబర్ 25
జీ 5		
ఐందం వేదం	తమిళ చిత్రం	అక్టోబర్ 25
ఏ జిందగీ	హిందీ చిత్రం	అక్టోబర్ 25
ఆపిల్ టీవీ ప్లస్		
బిఫోర్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 25




ఆ రహస్యం ఏమిటి?

కృతీసనన్, కాజోల్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన హిందీ చిత్రం 'దో పత్తీ'. శశాంక్ చతుర్వేది దర్శకత్వం వహించారు. కృతీసనన్ నిర్మించడంతో పాటు ద్విపాత్రాభినయం చేశారు. కాజోల్ కెరీర్‌లో తొలిసారి పోలీస్ అధికారి పాత్రను పోషించారు. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే చిత్రమిది. కవలలైన అక్కచెల్లెళ్లు ఇద్దరూ ఒకే అబ్బాయిపైన మనసు పడడం, వారి జీవితాల్లో జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో కథ సాగుతుందని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. అక్కచెల్లెళ్ల పోరాటం ఎలాంటి విపత్కర పరిస్థితులకు దారి తీసింది, పోలీస్‌లకు తెలియకుండా వారు దాచాలనుకున్న రహస్యాలేవిటి అనేది సినిమాపై ఆసక్తిని పెంచింది.



కీలకంగా సాహూ పాత్ర



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మట్కా'. డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించారు. నవంబర్ 14న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ చిత్రంలో నవీన్‌చంద్ర సాహూ అనే కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన పాత్రను పరిచయం చేస్తూ శనివారం చిత్రబృందం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. నవీన్‌చంద్ర స్కూటర్‌పై కూర్చొని తీక్షణంగా చూస్తున్న లుక్ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి కథానాయికలు. సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్. సినిమాటోగ్రఫీ: ఏ కిశోర్‌కుమార్.

తెలంగాణ యాస కోసం కష్టపడ్డా

అజయ్



'చాలా రోజుల తర్వాత నా మనసుకు నచ్చిన పాత్ర 'పొట్టేల్' చిత్రం ద్వారా దొరికింది. ఇందులో పటేల్ అనే పాత్ర పోషించాను. చాలా షేడ్స్ ఉన్నాయి. అందుకే కథ వినగానే ఈ సినిమా తప్పకుండా చేయాలని నిర్ణయించుకున్నాను' అని నటుడు అజయ్ అన్నారు. యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించగా, సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. నిశాంక్ రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగె నిర్మించారు. ఈ నెల 25న విడుదలవుతున్న సందర్భంగా అజయ్ మీడియాతో ముచ్చటించారు. 'కథలో కీలకమైన పాత్ర కావడంతో బాగా చేయకపోతే సినిమా దెబ్బతింటుందనే భయం ఏర్పడింది. ఈ సినిమాకు కథ, నా పాత్ర అద్భుతంగా కుదిరాయి. సాహిత్ కథను ఎంత అద్భుతంగా చెప్పాడో, సినిమాను అంతే అద్భుతంగా తెరకెక్కించాడు. కథలో సందేశం పాలు ఎక్కువ ఉన్నా దానికి వాణిజ్య హంగులు అద్దిన తీరు మెప్పిస్తుంది. తెలంగాణ యాసలో సంభాషణలు పలకడానికి కొంచెం కష్టపడాల్సి వచ్చింది. విజిల్స్ పడే సన్నివేశాలు చాలా ఉన్నాయి. విక్రమార్కుడులో నేను పోషించిన విలన్ పాత్రకు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత ఆ స్థాయి విలనిజం పండించే పాత్ర ఇప్పటివరకూ మళ్లీ దక్కలేదు. ఈ సినిమా ఆ లోటు తీరుస్తుంది' అని చెప్పారు.

మా అబ్బాయి కోసం బతకాలనుకున్నా

సోనాలి బింద్రే

క్యాన్సర్ అనగానే చాలామంది అది కలిగించే శారీరక బాధలు గురించే మాట్లాడతారు. కానీ, అది మానసికంగా కలిగించే నష్టం అపారం. క్యాన్సర్ సర్వైవర్‌గా తాను ఈ విషయాన్ని మరింత స్పష్టంగా చెప్పగలనన్నారు నటి సోనాలీ బింద్రే. జీవీకె హెల్త్ హబ్ ప్రారంభించిన మేక్ యువర్ పింక్ మార్క్ ప్రచారంలో భాగంగా శనివారం జూబ్లీహిల్స్‌లోని సంస్థ ప్రాంగణంలో ఓ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సోనాలీ బింద్రే మాట్లాడుతూ 'మీకు క్యాన్సర్ వచ్చిందని తెలియగానే ఆందోళనకు గురైతే అది మిమ్మల్ని మరింత కుంగదీస్తుంది. అటువంటి సందర్భంలో మానసిక బలం ముఖ్యం. నా విషయానికి వస్తే మానసికంగా బలంగా ఉండడంతో పాటు చిన్న వయసులో ఉన్న మా అబ్బాయి కోసం బతకాలనుకున్నా. కుటుంబ సభ్యులు, స్నేహితులు



నాకు పూర్తిగా మద్దతు అందించారు. రోజువారీ ధ్యానం, యోగా, చిన్న చిన్న విజయాల ద్వారా అవసరమైన మానసిక స్థైర్యం సంపాదించుకున్నా' అని చెప్పారు. 'క్యాన్సర్ అనే పదమే భయంకరమైనది. దాని బారిన పడితే ఇక జీవితం ముగిసినట్లే అన్నది వాస్తవం కాదు. మనం ముందు వ్యాధిని గుర్తిస్తే, చికిత్స ద్వారా క్యాన్సర్‌ను జయించవచ్చు. మనలో చాలామంది ఆరోగ్యంగా ఉన్నాం కాబట్టి వైద్య పరీక్షలు అవసరం లేదనుకుంటారు. రెగ్యులర్‌గా పరీక్షలు చేయించుకుంటే, ఈ తరహా సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్సలను పొందవచ్చు. మగవారంతా కూడా ఇళ్లలోని తమ ఆడవారికి పరీక్షలు చేయించాలి' అని కోరారు సోనాలి.

హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)




నాగచైతన్య, శోభితా ధూళిపాళ్లకు ఇటీవలే నిశ్చితార్థం అయిన సంగతి తెలిసిందే. నిశ్చితార్థం తర్వాత శోభితాతో కలసి దిగిన మొదటి ఫొటోను నాగచైతన్య తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టారు. ఈ పోస్టుకు కామెంట్స్‌ను డిసేబుల్ చేయడం గమనార్హం.

అన్నా అని పిలిస్తే ఫీలయ్యా



అందమైన అమ్మాయిని చూస్తే ఎవరికైనా మాట్లాడాలనిపిస్తుంది. సరదాగా కాసేపు కబుర్లు చెప్పాలనిపించడమూ కామన్. అయితే అప్పుడు ఆ అమ్మాయి 'అన్నా' అంటే మాత్రం అబ్బాయిలు తట్టుకోలేరు. ఈ విషయంలో మన సినిమా హీరోలు కూడా అతీతం కాదు. సరిగ్గా ఇలాంటి పరిస్థితే శివకార్తికేయన్‌కు ఎదురైందట. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా 'అమరన్' ఆడియో వేడుకలో చెప్పారు. "నేను ఓ టీవీ చానెల్‌లో పనిచేసేటప్పుడు సాయిపల్లవిని మొదటిసారి కలిశాను. అందులో ఓ షో కోసం నేను వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నప్పుడు సాయి పల్లవి ఆ కార్యక్రమానికి వచ్చారు. ఇండస్ట్రీలో ఆమె పేరే ఒక బ్రాండ్. 'ప్రేమమ్' సినిమాలో ఆమె నటనను చూసి ఫోన్ చేసి ప్రశంసించాను. ఆమె అందుకు 'థ్యాంక్యూ అన్నా' అన్నారు. సాయి పల్లవి అలా పిలిచేసరికి ఫీల్ అయ్యా" అని చెప్పారు. ఈ విషయాన్ని శివ కార్తికేయన్ స్టేజీ మీద చెప్తున్నంత సేపూ సాయి పల్లవి నవ్వుతూనే ఉన్నారు.

సన్నీ యాక్షన్ మోడ్



బాలీవుడ్ హీరో సన్నీడియోల్ కథానాయకుడిగా గోపిచంద్ మలినేని దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కుతోంది. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. సన్నీడియోల్ పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ సినిమా టైటిల్‌ను ప్రకటించి, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'జాత్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. శరీరమంతా రక్తపుధారలు కారుతుండగా, పెద్ద ఫ్యాన్‌ను పట్టుకొని యాక్షన్ మోడ్‌లో ఉన్న సన్నీడియోల్ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచింది. రణ్‌దీప్ హుడా, వినీత్‌కుమార్ సింగ్, సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: థమన్ ఎస్, సినిమాటోగ్రఫీ:రిషి పంజాబీ.

రేణు దేశాయ్ చండీ హోమం



శరత్ పూర్ణిమ సందర్భంగా గణపతి, చండీ హోమం చేశారు సినీ నటి రేణు దేశాయ్. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ పూజలో అకీరా నందన్ కూడా పాల్గొన్నాడు. 'మన పూర్వీకులు అనుసరించిన సాంప్రదాయాలు, ఆచారాలను పిల్లలకు నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులుగా మనపై ఉంది. డెకరేషన్‌పైనే ఎక్కువ శ్రద్ధ పెట్టాల్సిన అవసరం లేదు. ఆర్భాటంగా పూజలు చేసుకోవడానికి బదులుగా ఇలా హోమం, పూజలపైనే ఫోకస్ చేస్తే సరిపోతుంది' అని రేణు దేశాయ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు.

పోరాటాలే ఈ స్థాయికి చేర్చాయి



బుల్లి తెరపై నట ప్రస్థానం ఆరంభించి.. ఆ తర్వాత వెండితెరపై నటించిన ఐదో చిత్రంతోనే జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు మానసి పరేఖ్. ఇటీవల జరిగిన 70వ జాతీయ అవార్డుల్లో.. గుజరాతీ చిత్రం 'కచ్ ఎక్స్‌ప్రెస్'తో ఉత్తమ నటిగా పురస్కారాన్ని అందుకొని టాక్ ఆఫ్ ద నేషన్‌గా నిలిచారు. ఇటీవలే ఆంగ్ల మీడియాతో ముచ్చటించిన ఆమె.. తన కెరీర్ తొలి రోజులను గుర్తుచేసుకున్నారు.

"మనం చేసే పోరాటాలే మనమేంటో ప్రపంచానికి తెలియజేస్తాయి. నేను ఎన్నో పోరాటాలు చేసి కష్టపడ్డాను కాబట్టే.. ఈ స్థాయికి చేరుకోగలిగానని నమ్ముతాను. కష్టాల తర్వాత వచ్చే విజయంలో ఉండే ఆనందాన్ని మాటల్లో వర్ణించలేం. అదొక అనిర్వచనీయమైన అనుభూతి. అప్పుడే ప్రతి క్షణాన్ని ఆస్వాదించగలుగుతాం. మనపై మనకు నమ్మకం ఉంటేనే ఏదైనా సాధించగలం" అని చెప్పారు.

కబుర్లు..

తెలంగాణ పల్లె కథ



రాకింగ్ రాకేశ్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్), అనన్య కృష్ణన్, తనికెళ్ల భరణి, ధన్‌రాజ్ కీలకపాత్రలు పోషించారు. గరుడవేగ అంజి దర్శకత్వం వహించారు. శనివారం చిత్ర బృందం నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు సాయిరాజేశ్ చేతుల మీదుగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సాయిరాజేశ్ మాట్లాడుతూ 'ట్రైలర్ చాలా బావుంది. ఈ సినిమాతో రాకేశ్ మంచి స్థాయికి వెళ్లాలి. తెలంగాణ గ్రామీణ సంస్కృతిని అద్భుతంగా చూపించిన ఈ చిత్రాన్ని ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు. రాకింగ్ రాకేశ్ మాట్లాడుతూ 'ఈ సినిమాను మూడు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించాలనేది నా కోరిక. మా దర్శకుడు సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. చరణ్ అర్జున్ మంచి సంగీతం అందించారు' అని చెప్పారు. అంజి మాట్లాడుతూ 'దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ కూడా నేనే చేశాను. సాయి రాజేశ్ మంచి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. హీరోయిన్ అనన్య అద్భుతంగా నటించారు' అని చెప్పారు.

ఫ్యామిలీ చిత్రం



చిన్నా హీరోగా, మధుప్రియ, రుచిక హీరోయిన్లుగా సుభాని దర్శకత్వంలో ఎం. అనిత నిర్మిస్తున్న చిత్రం 'జై జై దుర్గమ్మ'. సంగీతం జయసూర్య. ఈ చిత్రం ట్రైలర్‌ని ప్రముఖ నిర్మాత సాయి వెంకట్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత చిన్నా మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా నిర్మించాము. ఫ్యామిలీతో కలిసి ఆనందించవలసిన చిత్రం' అని అన్నారు.

సరికొత్తగా నరుడి బతుకు



శివకుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'నరుడి బ్రతుకు నటన'. రిషికేశ్వర్ యోగి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, డాక్టర్ సింధురెడ్డి నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈనెల 25న ఈ చిత్రం విడుదలవుతోంది. శనివారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన సుధీర్‌బాబు మాట్లాడుతూ 'శివ, నితిన్ ప్రసన్న నటన బావుంది. ఈ మూవీ సరికొత్తగా ఉండబోతోంది' అని చెప్పారు. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ "నరుడి బ్రతుకు నటన' చిత్రబృందాన్ని చూసినప్పుడు నాకు నా పాత రోజులు గుర్తుకొచ్చాయి. నేను కెరీర్ ఆరంభంలో నిర్మించిన కొన్ని మంచి చిత్రాలను అంతర్జాతీయ వేదికల మీద ప్రదర్శించగలిగాను కానీ థియేటర్లలో విడుదల చేయలేకపోయాను. అందుకే ఒక మంచి సినిమాను తీసిన ఈ నిర్మాతలకు సాయంచేసేందుకు ముందుకొచ్చాను' అన్నారు. శివ, నితిన్ ప్రసన్న నటన సినిమాకు ప్రత్యేకాకర్షణ అని రిషికేశ్వర్ తెలిపారు. ఎంతో కష్టపడి ఈ సినిమా చేశాం, ప్రేక్షకులు ఆదరించాలి అని సింధురెడ్డి కోరారు.

నిర్మాతగా సంతృప్తినిచ్చింది




అంజన్ రామచంద్ర, శ్రావణిరెడ్డి హీరో హీరోయిన్లుగా నటించిన 'లవ్‌రెడ్డి' చిత్రం చక్కటి ఆదరణతో కొనసాగుతోన్న సందర్భంగా చిత్రబృందం శనివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత మదన్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ "లవ్‌రెడ్డి సినిమా చూస్తున్న ప్రేక్షకులు భావోద్వేగానికి గురవుతున్నారు. ఈ సినిమాకు పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరికీ మంచి పేరొచ్చింది. నిర్మాతకు నాకు సంతృప్తినిచ్చింది. ప్రేక్షకులు మరింతగా మా చిత్రాన్ని ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు స్మరణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచారానికి తగినంత సమయం దొరక్కపోయినా సినిమా విడుదలయ్యాక ప్రేక్షకులకు చేరువైంది. ప్రతి ఒక్కరూ మంచి సినిమా తీశారని ప్రశంసిస్తున్నారు' అని చెప్పారు. రాతిగుండెను సైతం కరిగించేలా క్లైమాక్స్ ఉందని ప్రేక్షకులు చెబుతున్నారని శ్రావణి తెలిపారు. 'లవ్‌రెడ్డి' థియేటర్లలో గెలిచాడు అని అంజన్ రామచంద్ర తెలిపారు.

బౌలర్లు మాయ చేసేనా?

న్యూజిలాండ్ లక్ష్యం 107
సర్ఫరాజ్ భారీ శతకం
పంత్ సెంచరీ మిస్

భారత్ రెండో ఇన్నింగ్స్ 462


సర్ఫరాజ్ (150)

1 టెస్టుల్లో వేగంగా (62 ఇన్నింగ్స్) 2500 పరుగులు సాధించిన వికెట్ కీపర్‌గా పంత్. ఈక్రమంలో అతను ధోనీ (69 ఇన్నింగ్స్)ని అధిగమించాడు.

3 టెస్టుల్లో ఎక్కువసార్లు (7) 90+ దగ్గర అవుటైన మూడో భారత బ్యాటర్‌గా పంత్. సచిన్ (10) టాప్‌లో ఉన్నాడు. అలాగే టెస్టుల్లో 99 దగ్గర అవుటైన నాలుగో వికెట్ కీపర్‌గా పంత్. గతంలో మెకల్లమ్, ధోనీ, బెయిర్‌స్టో కూడా ఇలాగే వెనుదిరిగారు.

3 ఒకే టెస్టులో డకౌట్, 150+ స్కోరు నమోదు చేసిన మూడో భారత బ్యాటర్‌గా సర్ఫరాజ్. గతంలో మాధవ్ ఆప్టే (0, 163 నాటౌట్), నయన్ మోంగియా (152, 0) ఉన్నారు.


పంత్ (99)

బెంగళూరు: మూడున్నర దశాబ్దాల తర్వాత న్యూజిలాండ్ జట్టు భారత గడ్డపై టెస్టు విజయం అందుకునేలా కనిపిస్తోంది. ఆ జట్టు చివరి రోజు ఆదివారం 107 పరుగులు సాధిస్తే చాలు. అయితే అంతకుముందు భారత్‌కు అంతా సవ్యంగా సాగుతుందనుకున్న వేళ.. ఒక్కసారిగా బ్యాటర్ల తడబాటు. ఓ దశలో సర్ఫరాజ్ (195 బంతుల్లో 18 ఫోర్లు, 3 సిక్సలతో 150) వీరోచిత శతకం, రిషబ్ పంత్ (105 బంతుల్లో 9 ఫోర్లు 5 సిక్సలతో 99) అద్భుత పోరాటం ఫలితంగా జట్టు 408/3 స్కోరుతో పటిష్ఠంగా కనిపించింది. దీంతో మరో 150-200 పరుగులైనా జత చేస్తారని అంతా భావించారు. కానీ రెండో కొత్త బంతి అందుకున్న కివీస్ బౌలర్లు మ్యాచ్ గమనాన్నే మార్చేశారు. టపటపా వికెట్లు తీసేయడంతో 54 పరుగుల వ్యవధిలోనే భారత్ చివరి 7 వికెట్లను కోల్పోయింది. దీంతో రెండో ఇన్నింగ్స్‌లో రోహిత్ సేన 462 రన్స్‌కు ఆలౌటైంది. మ్యాట్ హెన్రీ, ఓరోక్ మరోసారి చెలరేగి మూడేసి వికెట్లతో దెబ్బతీశారు. ఎజాజ్ పటేల్‌కు రెండు వికెట్లు దక్కాయి. 107 పరుగుల లక్ష్యం కోసం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కివీస్ నాలుగోరోజైన శనివారం ఆట ముగిసేసరికి కేవలం నాలుగు బంతులు ఆడి పరుగులేమీ చేయలేదు. వెలుతురు లేమి కారణంగా మ్యాచ్‌ను ముందుగానే ముగించారు. ఆదివారం కూడా వరుణుడు అటంకపరిచే అవకాశం ఉంది. దీంతో టీమిండియా ఓటమి నుంచి తప్పించుకోవాలంటే రోజంతా వర్షం కురవాలి.. లేదంటే బౌలర్లు ఏమైనా అద్భుతం చేయాలి. ఇక.. కివీస్ ఇక్కడ చివరిసారిగా 1989లో టెస్టు గెలవడం గమనార్హం.

సర్ఫరాజ్-పంత్ అద్భుత పోరాటం: ఓవర్‌నైట్ స్కోరు 231/3తో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ తొలి సెషన్‌లో పూర్తి ఆధిపత్యం చూపింది. యువ బ్యాటర్లు సర్ఫరాజ్-పంత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. దాదాపు ప్రతీ ఓవర్‌లో బౌండరీతో చెలరేగారు. సర్ఫరాజ్ తన సహజశైలిలో ఆడేస్తూ చక్కటి ఫోర్‌తో తొలి సెంచరీ (110 బంతుల్లో)ని పూర్తి చేశాడు. అటు ఆరంభంలోనే రనౌట్ నుంచి తప్పించుకున్న పంత్ కుదురుకున్నాక బ్యాట్ ఝుళిపించాడు. సౌథీ ఓవర్‌లో 6,4 కొట్టిన పంత్.. ఎజాజ్ ఓవర్‌లో 6,6,4తో చెలరేగాడు. 54 బంతుల్లోనే పంత్ ఫిఫ్టీ పూర్తయ్యింది. అయితే ఉదయం 11కు వర్షం కురవడంతో మ్యాచ్‌కు రెండు గంటల అంతరాయం ఏర్పడింది. ఈ సమయంలోనే లంచ్ బ్రేక్‌ను ప్రకటించారు.

కొత్త బంతితో బెంబేలు: రెండో సెషన్ ఆరంభంలోనూ సర్ఫరాజ్-పంత్ జోరును చూపారు. ఎడాపెడా బౌండరీలతో స్కోరును 80 ఓవర్లలో 400కి చేర్చారు. కానీ ఆ ఓవర్ తర్వాత కివీస్‌కు కొత్త బంతి తీసుకునే అవకాశం రావడంతో భారత్‌కు కష్టాలు మొదలయ్యాయి. చక్కటి పేస్, బౌన్స్‌తో బ్యాటర్లను ఇబ్బందిపెట్టారు. దీంతో పరుగుల సంగతి ఏమో కానీ వికెట్లు కూడా కాపాడుకోలేకపోయారు. 150 పరుగులతో ఉన్న సర్ఫరాజ్‌ను ముందుగా సౌథీ అవుట్ చేయడంతో తడబాటు ఆరంభమైంది. దీంతో నాలుగో వికెట్‌కు 177 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే.. సెంచరీకి పరుగు దూరంలో పంత్‌ను ఓరోక్ బౌల్డ్ చేశాడు. బ్యాట్ ఎడ్జ్ తీసుకున్న బంతి నేరుగా వికెట్లను తాకింది. కుదురుకున్న ఇద్దరు బ్యాటర్లు పెవిలియన్ చేరడంతో భారత్ భారీ ఆధిక్యంపై ఆశలు వదులుకుంది. సెషన్ చివరి ఓవర్‌లో రాహుల్ (12)ను కూడా ఓరోక్ అవుట్ చేశాడు. ఇక ఆఖరి సెషన్ అయితే పది ఓవర్లలోనే ముగిసింది. హెన్రీ టెయిలెండర్లను టపటపా పెవిలియన్ చేర్చడంతో భారత్ స్వల్ప లక్ష్యాన్నే ప్రత్యర్థి ముందుంచగలిగింది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 46;
న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 402.
భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (స్టంప్డ్) బ్లండెల్ (బి) ఎజాజ్ 35; రోహిత్ (బి) ఎజాజ్ 52; కోహ్లి (సి) బ్లండెల్ (బి) ఫిలిప్స్ 70; సర్ఫరాజ్ (సి) ఎజాజ్ (బి) సౌథీ 150; పంత్ (బి) ఓరోక్ 99; రాహుల్ (సి) బ్లండెల్ (బి) ఓరోక్ 12; జడేజా (సి) యంగ్ (బి) ఓరోక్ 5; అశ్విన్ (ఎల్బీ) హెన్రీ 15; కుల్దీప్ (నాటౌట్) 6; బుమ్రా (సి) బ్లండెల్ (బి) హెన్రీ 0; సిరాజ్ (సి) సౌథీ (బి) హెన్రీ 0; **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 99.3 ఓవర్లలో 462 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-72, 2-95, 3-231, 4-408, 5-433, 6-438, 7-441, 8-458, 9-462, 10-462. **బౌలింగ్:** సౌథీ 15-2-53-1; హెన్రీ 24.3-3-102-3; ఓరోక్ 21-4-92-3; ఎజాజ్ పటేల్ 18-3-100-2; ఫిలిప్స్ 15-2-69-1; రచిన్ 6-0-30-0.
న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (బ్యాటింగ్) 0; కాన్వే (బ్యాటింగ్) 0; **మొత్తం:** 0.4 ఓవర్లలో 0/0. **బౌలింగ్:** బుమ్రా 0.4-0-0-0.

జీరో టు హీరో!

లావుగా ఉండడంతో ఎగతాళి.. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించినా సెలెక్టర్ల నుంచి రాని పిలుపు. నిరాశ ఆవరించినా.. సర్ఫరాజ్ మాత్రం తన బ్యాటింగ్ విన్యాసాలతో సెలెక్టర్ల తలుపు బాదుతూనే ఉన్నాడు. గిల్ ఫిట్‌నెస్ లేమితో.. తుది జట్టులో చాన్స్ దక్కించుకొన్న 26 ఏళ్ల సర్ఫరాజ్ తొలి ఇన్నింగ్స్‌లో జీరో అయ్యాడు. కానీ, రెండో ఇన్నింగ్స్‌లో ఆడిన తీరు అతడి ప్రతిభపై నెలకొన్న అనుమానాలను పటాపంచలు చేశాయి. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు బాధ్యతాయుతంగా ఆడాడు. కోహ్లీలాంటి సీనియర్లే ఆచితూచి ఆడుతున్న పరిస్థితుల్లో సర్ఫరాజ్ ప్రత్యర్థి బౌలర్లపై వ్యూహాత్మకంగా దాడి చేసి వారిని ఒత్తిడిలోకి నెట్టాడు. ఇక, పంత్‌తో కలసి బ్యాటింగ్ చేయాల్సి వచ్చినప్పుడు పరిణతి కనబర్చాడు. రిషబ్ కాలికి బంతి తగలడంతో అతడిని ఎక్కువగా పరుగులు తీయించలేదు. అంతేకాకుండా లెఫ్టామ్ స్పిన్నర్ వచ్చినప్పుడు పంత్‌కు ఎక్కువగా స్ట్రయిక్ ఇస్తూ.. తాను ఎక్కువగా పేసర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. మొత్తంగా ఒక్క ఇన్నింగ్స్‌తో తాను ఎవరికీ బ్యాకప్ కాదనే విషయాన్ని చాటాలనే కసి మాత్రం అతడిలో కనిపించింది. ఇన్నేళ్ల కష్టానికి.. ఎదురుచూపులకు దక్కిన ఫలితమే.. సర్ఫరాజ్ భావోద్వేగ సంబరాలు!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



ఎవరో కొత్త చాంప్!

న్యూజిలాండ్‌తో సౌతాఫ్రికా ఫైనల్ నేడు

మహిళల టీ20 వరల్డ్ కప్

దుబాయ్: ఎంతో కాలంగా ఊరిస్తున్న ప్రతిష్ఠాత్మక ఐసీసీ ట్రోఫీని దక్కించుకొనే సువర్ణావకాశం న్యూజిలాండ్ ముంగిట నిలిచింది. సోఫీ డివైన్ సారథ్యంలోని కివీస్ మహిళలు ఆదివారం జరిగే టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఢీకొననున్నారు. టోర్నీకి ముందు టీ20లలో కివీస్ వరుసగా 10 మ్యాచ్‌ల్లో ఓటమి పాలైంది. దాంతో ఈసారి మెగా టోర్నీలో ఆ జట్టుపై పెద్దగా అంచనాలు లేవు. కానీ సుజీ బేట్స్, అమీలియా కెర్, లియా తహుహులాంటి స్టార్లతో కూడిన ఆ జట్టు టోర్నీలో అద్భుతాలు సృష్టించి తుదిపోరుకు చేరింది. అయితే తొలి టైటిల్‌పై కన్నేసిన సౌతాఫ్రికా మహిళలను అడ్డుకోవడం ఆషామాషీ కాదు. ఆస్ట్రేలియాను సెమీస్‌లో చిత్తు చేయడం సఫారీల సత్తాను తెలియజేసింది. ఈ నేపథ్యంలో ఎవరవుతారో కొత్త చాంపియన్ చూడాలి.

హాకీ కుర్రాళ్ల శుభారంభం

జొహోర్ (మలేసియా): సుల్తాన్ జొహోర్ కప్ టోర్నీలో భారత జూనియర్ హాకీ జట్టు బోణీ చేసింది. శనివారం మ్యాచ్‌లో భారత్ 4-2తో జపాన్‌పై గెలిచింది.


భారత్ 'ఎ' భళా

తొలి మ్యాచ్‌లో పాక్‌పై విజయం

అల్‌అమెరాత్ (ఒమన్): ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ టీ20 టోర్నీ గ్రూపు 'బి'లో భారత 'ఎ' జట్టు 7 పరుగులతో పాకిస్థాన్ 'ఎ'ని చిత్తు చేసింది. భారత్ 'ఎ' తొలుత 20 ఓవర్లలో 183/8 స్కోరు చేసింది. తిలక్ వర్మ (44) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా, ప్రభ్‌సిమ్రన్ (36), అభిషేక్ శర్మ (35) ధనాధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. ముఖీమ్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో పాకిస్థాన్ 'ఎ' 20 ఓవర్లలో 176/7 స్కోరే చేసింది. అరాఫత్ (41), యాసిర్ ఖాన్ (33) రాణించారు. అన్షుల్ 3, నిషాంత్, రసీఖ్ రెండేసి వికెట్లు సాధించారు.

హైదరాబాద్ 244/5

డెహ్రాడూన్: రాహుల్ రాధేష్ (82 బ్యాటింగ్), హిమతేజ (78) సత్తాచాటడంతో రంజీ గ్రూప్-బీలో ఉత్తరాఖండ్‌తో మ్యాచ్‌లో హైదరాబాద్ దీటుగా బదులిస్తోంది. రెండోరోజైన శనివారం ఆట ముగిసేసరికి తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 244/5 స్కోరు చేసింది. రాహుల్, తనయ్ (17) క్రీజులో ఉన్నారు. దేవేంద్ర 2 వికెట్లు తీశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 313/8తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఉత్తరాఖండ్ 325 రన్స్‌కు ఆలౌటైంది. తనయ్ 4 వికెట్లు పడగొట్టాడు.



టైటాన్స్‌కు పరాజయం

● **పీకేఎల్‌లో తలైవాస్ బోణీ**

హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో తొలి మ్యాచ్‌లో విజయంతో శుభారంభం చేసిన తెలుగు టైటాన్స్‌కు రెండో మ్యాచ్‌లోనే ఓటమి ఎదురైంది. శనివారం ఇక్కడి గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 29-44తో తమిళ తలైవాస్ చేతిలో చిత్తయింది. తలైవాస్ రైడర్లు నరేందర్ ఖండోలా, సచిన్ సూపర్-10లు సాధించగా.. సాహిల్ గులియా 5 టాకిలింగ్స్ చేశాడు. కాగా, టైటాన్స్ కెప్టెన్ పవన్ సెహ్రావత్ 10 పాయింట్లు స్కోరు చేసినా ఫలితం లేకపోయింది. ఇక, ఆడిన తొలి మ్యాచ్‌లోనే గెలిచి తలైవాస్ లీగ్‌లో అద్భుత బోణీ చేసింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ పుణెరి పల్టన్ 35-25తో హరియాణా స్టీలర్స్‌ను చిత్తుచేసింది. డిఫెండర్ గౌరవ్ ఖత్రి ఏడు పాయింట్లతో పుణెరి విజయంలో కీలకపాత్ర పోషించాడు.

వెలుతురులేమిపై వాగ్వాదం



న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌కు దిగాక కేవలం నాలుగు బంతుల్లోనే ఆటను ఆపేశారు. దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో అంపైర్లు లైట్ మీటర్ చెక్ చేసి వెలుతురులేమితో నాలుగో రోజు ఆటను ముగిస్తున్నట్టు ప్రకటించారు. వెంటనే కివీస్ బ్యాటర్లు పెవిలియన్‌కు వెళ్లారు. అయితే భారత కెప్టెన్ రోహిత్ మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. వెలుతురు బాగానే ఉంది కదా అని ఆకాశానికేసి చూపిస్తూ అంపైర్లతో వాగ్వాదానికి దిగాడు. రోహిత్‌కు కోహ్లీ కూడా కలిశాడు. పిచ్ బౌలింగ్‌కు సహకరిస్తుండడంతో వేగంగా వికెట్లు తీయాలనేది భారత్ ఉద్దేశం. అప్పటికి మ్యాచ్‌కు ఇంకా 15 నిమిషాల సమయం ఉంది. కానీ అంపైర్లు ససేమిరా అనడంతో పాటు కాసేపటికే భారీ వర్షం కురవడంతో పిచ్‌ను కవర్లతో కప్పేశారు.

ఒకే వేదికపై అప్పుడూ.. ఇప్పుడూ!



సర్ఫరాజ్ కీలక సమయంలో సెంచరీతో జట్టును ఆదుకొన్నాడు. వంద మార్క్ చేరిన అనంతరం అతడు మైదానంలో జోష్‌తో సంబరాలు చేసుకొన్నాడు. అతడి సెలెబ్రేషన్స్ చూసి కెప్టెన్ రోహిత్‌తో పాటు కోహ్లీ నవ్వుకున్నారు. కాగా.. ఈ సందర్భంగా కోహ్లీ, సర్ఫరాజ్ ఒకే వేదికపై పంచుకొన్న ఆనందాలను బీసీసీఐ ఎక్స్‌లో పోస్టు చేసింది. 2015లో రాజస్థాన్‌తో ఐపీఎల్ మ్యాచ్‌లో బెంగళూరు తరఫున 17 ఏళ్ల సర్ఫరాజ్ 21 బంతుల్లో 45 పరుగులు చేయడంతో జట్టు స్కోరు 200 మార్క్ అందుకొంది. ఆ సమయంలో సర్ఫరాజ్ డగౌట్‌కు వస్తున్నప్పుడు కోహ్లీ 'దండం' పెట్టి ప్రశంసించాడు. ఇప్పుడు అదే మైదానంలో టీమిండియా తరఫున సర్ఫరాజ్ సెంచరీ సాధిస్తే.. కోహ్లీ నవ్వుతూ అతడిని ప్రోత్సహించాడు.

టెక్ మహీంద్రా లాభం రెండింతలు

క్యూ2లో రూ.1,250 కోట్లుగా నమోదు.. ఒక్కో షేరుకు రూ.15 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25).. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) టెక్ మహీంద్రా ఏకీకృత నికర లాభం రెండింతలకు పైగా పెరిగి రూ.1,250 కోట్లకు చేరుకుంది. ఆస్తుల విక్రయం ద్వారా ప్రత్యేక ఆదాయం సమకూరడం ఇందుకు దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి టెక్ మహీంద్రా లాభం రూ.493.9 కోట్లుగా నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో ఆదాయం వార్షిక ప్రాతిపదికన 3.49 శాతం వృద్ధితో రూ.13,313.2 కోట్లకు పెరిగింది. కాగా, జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ లాభం 46.81 శాతం, రెవెన్యూ 2.36 శాతం వృద్ధి చెందాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను సంస్థ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.15 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపులకు అర్హులైన వాటాదారులను గుర్తించేందుకు నవంబరు 1ని రికార్డు తేదీగా నిర్ణయించింది.

కొత్తగా 6,653 మంది చేరిక

ఐటీ సేవల రంగంలో డిమాండ్ కాస్త నెమ్మదించినప్పటికీ, మా వ్యూహాత్మక మెరుగుదల ప్రయత్నాల్లో పురోగతిని కొనసాగించగలిగామని టెక్ మహీంద్రా సీఈఓ మోహిత్ జోషి అన్నారు. వ్యాపారాన్ని క్రమంగా కదం తొక్కించడంతో పాటు 15 శాతం నిర్వహణ లాభాల మార్జిన్ సాధన కోసం మోహిత్ జోషి ఈ ఏప్రిల్‌లో ఫోర్టియస్ పేరుతో మూడేళ్ల వ్యూహాత్మక ప్రణాళికను ఆవిష్కరించారు. గడిచిన మూడు నెలల్లో కంపెనీ 60.3 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్‌ను దక్కించుకుంది. నికరంగా 6,653 మందిని ఉద్యోగంలో చేర్చుకుంది. దాంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,54,273కు చేరుకుంది.

కోటక్ బ్యాంక్ లాభంలో 5% వృద్ధి

న్యూఢిల్లీ: సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికానికి గాను కోటక్ మహీంద్రా బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 5 శాతం పెరిగి రూ.3,344 కోట్లకు చేరుకుంది. ఆదాయం రూ.15,900 కోట్లకు ఎగబాకింది. అందులో స్థూల వడ్డీ ఆదాయం రూ.13,216 కోట్లుగా, నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.7,020 కోట్లుగా ఉంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 4.91 శాతానికి తగ్గింది. గత నెల చివరి నాటికి బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 1.49 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.43 శాతానికి తగ్గాయి.

తగ్గిన ఆర్‌బీఎల్ బ్యాంక్ లాభం

ముంబై: సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఆర్‌బీఎల్ బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 24 శాతం తగ్గి రూ.223 కోట్లకు పరిమితమైంది. క్రెడిట్ కార్డు, సూక్ష్మ రుణాల వ్యాపారాల్లో ఒత్తిడి కారణంగా ఆస్తుల నాణ్యత క్షీణించడం ఇందుకు కారణమైందని బ్యాంక్ పేర్కొంది. గత ఏడాదిలో జూలై-సెప్టెంబరు కాలానికి బ్యాంక్ రూ.294 కోట్ల లాభాన్ని ఆర్జించింది.

అదరగొట్టిన యూకో బ్యాంక్

క్యూ2 లాభంలో 50 శాతం వృద్ధి.. రూ.603 కోట్లుగా నమోదు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో ఆకర్షణీయమైన ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం ఏకంగా 50 శాతం వృద్ధితో రూ.603 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం రూ.402 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం కూడా రూ.5,866 కోట్ల నుంచి రూ.7,071 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 20 శాతం వృద్ధితో రూ.1,917 కోట్ల నుంచి రూ.2,301 కోట్లకు పెరిగింది. సెప్టెంబరు త్రైమాసికంలో అంచనాలకు తగ్గట్టుగానే బ్యాంక్ పనితీరును కనబరిచిందని, ఈ కాలంలో నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.84 శాతం నుంచి 3.10 శాతానికి పెరిగిందని యూకో బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అశ్వనీ కుమార్ వెల్లడించారు. కాగా రానున్న త్రైమాసికాల్లో కూడా ఇదే జోరును కొనసాగించవచ్చని అంచనా వేస్తున్నట్టు ఆయన తెలిపారు. వచ్చే ఏడాది మార్చినాటికి ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉండటంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ ఎన్ఐఎం 2.9-3 శాతం ఉండొచ్చని అంచనా వేస్తున్నట్టు ఆయన చెప్పారు. అంతేకాకుండా ఈ ఆర్థిక సంవత్సరానికి రుణ వృద్ధి రేటు 12-14 శాతం ఉంటుందని భావిస్తున్నట్టు అశ్వనీ కుమార్ పేర్కొన్నారు. కాగా సెప్టెంబరు త్రైమాసికంలో స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 4.14 శాతం నుంచి 3.18 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.11 శాతం నుంచి 0.73 శాతానికి తగ్గాయన్నారు. సెప్టెంబరు ముగిసే నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం 13.56 శాతం వృద్ధి చెంది రూ.4,73,704 కోట్లకు చేరుకుంది.

క్యూఐపీ ద్వారా రూ.2,000 కోట్ల సమీకరణ

ప్రస్తుత అక్టోబరు-డిసెంబరు (క్యూ3) త్రైమాసికంలో క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా రూ.1,500-2,000 కోట్ల వరకు నిధులు సమీకరించాలని చూస్తున్నట్టు అశ్వనీ కుమార్ తెలిపారు. కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) నిబంధనలు చేరుకునే వ్యూహంలో భాగంగా క్యూఐపీకి సన్నాహాలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ క్యూఐపీ ద్వారా యూకో బ్యాంక్‌లో ప్రభుత్వ వాటా 2-3 శాతం తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం బ్యాంక్‌లో ప్రభుత్వానికి 95.39 శాతం వాటా ఉంది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం రూ.16,821 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.16,821 కోట్ల స్టాండ్ అలోన్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆర్జించిన రూ.15,976 కోట్ల లాభంతో పోలిస్తే 5 శాతం వృద్ధి కనబరిచింది. కాగా, త్రైమాసిక సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.85,500 కోట్లకు చేరుకుంది. 2023-24లో ఇదే కాలానికి రెవెన్యూ రూ.78,406 కోట్లుగా నమోదైంది. గత త్రైమాసికంలో బ్యాంక్ ఏకీకృత నికర లాభం 6 శాతం వృద్ధితో రూ.17,826 కోట్లుగా నమోదైంది.

హెచ్‌డీబీ రూ.12,500 కోట్ల ఐపీఓ: హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ రూ.12,500 కోట్ల ఐపీఓ ప్రతిపాదనకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు ఆమోదం తెలిపింది. బ్యాంక్ అనుబంధ విభాగమే ఈ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్. ఈ ఐపీఓలో భాగంగా తమ వాటా నుంచి రూ.10,000 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా విక్రయించనున్నట్టు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెల్లడించింది. ఇందుకుతోడు రూ.2,500 కోట్ల తాజా ఈక్విటీ జారీతో కలిపి హెచ్‌డీబీ ఫైనాన్షియల్ ఐపీఓ సైజు రూ.12,500 కోట్లకు చేరుకోనుంది.

బిజినెస్

ఈనెల 25 నుంచి అఫ్కాన్స్ ఐపీఓ

న్యూఢిల్లీ: షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు చెందిన అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 25న ప్రారంభమై 29న ముగియనుంది. సెబీకి సమర్పించిన పత్రాల (ఆర్‌హెచ్‌పీ) ప్రకారం.. ఐపీఓ ద్వారా కంపెనీ మొత్తం రూ.5,430 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఇందులో రూ.1,250 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన రూ.4,180 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది.

ఎస్ఎంపీపీ రూ.4,000 కోట్ల ఇష్యూ: రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ సంస్థ ఎస్ఎంపీపీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి అనుమతి కోరుతూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ ద్వారా రూ.4,000కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

భారత మార్కెట్లోకి ఈఎల్ అండ్ ఎన్ లండన్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ లైఫ్‌స్టైల్, కేఫ్ బ్రాండ్ ఈఎల్ అండ్ ఎన్ లండన్.. భారత మార్కెట్లోకి ప్రవేశించింది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ బ్రాండ్స్ లిమిటెడ్ (ఆర్‌బీఎల్)తో కలిసి తొలి స్టోర్‌ను ముంబైలో ప్రారంభించింది. భారతీయ కుటుంబాలకు సరికొత్త స్టైల్స్‌ను అందుబాటులోకి తీసుకురావటంతో పాటు కాఫీ ప్రియుల కోసం ప్రత్యేకమైన అనుభవాన్ని అందించేందుకు దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టినట్లు ఈఎల్ అండ్ ఎన్ లండన్ వెల్లడించింది. ఫుడ్ అండ్ బెవరేజెస్ విభాగంలో స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునేందుకు ఈఎల్ అండ్ ఎన్‌తో భాగస్వామ్యం ఎంతగానో తోడ్పడనుందని ఆర్‌బీఎల్ మాతృసంస్థ రిలయన్స్ రిటైల్ తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	79,420 ▲	72,800 ▲	1,07,000 ▲
ముంబై	77,410 ▲	70,908 ▲	92,283 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	510
వరంగల్	497	గోదావరి	510
చిత్తూరు	538	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	130
వరంగల్	120	గుంటూరు	130
కరీంనగర్	120	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	129
కర్నూలు	120	నెల్లూరు	129
విశాఖపట్నం	120	అనంతపురం	129
గోదావరి	130		

వడ్డీ, పెనాల్టీ మినహాయింపులకు ఎలా దరఖాస్తు చేయాలి?



రాంబాబు గొండాల

ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 'వడ్డీ, పెనాల్టీ మినహాయింపు'నకు ఎవరు అర్హులో ఇంతకుముందు చెప్పుకోవటం జరిగింది. వాస్తవానికి ఇలాంటి ఆమ్నెస్టీ పథకం గురించి జీఎస్‌టీలో నమోదైన వ్యాపారులందరూ ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారు. అందుకే ప్రభుత్వం చేసిన ఈ ప్రకటనకు విశేష స్పందన లభిస్తోంది. మరి ఈ ప్రయోజనం ఎలా పొందాలి? దాని విధి విధానాలు ఏమిటో తెలుసుకుందాం.

ఈ ప్రయోజనం పొందటానికి కేసులను మూడు విభాగాలుగా విభజించారు. మొదటిది.. నోటీస్ ఇచ్చినప్పటికీ సంబంధిత ఆర్డర్ జారీ చేసి ఉండకూడదు. రెండోది.. ఆర్డర్ జారీ చేసినా దానికి సంబంధించిన అప్పీల్ ఆర్డర్ జారీ చేసి ఉండకూడదు. మూడోది.. అప్పీల్ ఆర్డర్ జారీ చేసినప్పటికీ ట్రైబ్యునల్ ఆర్డర్ జారీ చేసి ఉండకూడదు. ముందుగా చెప్పినట్లు ఈ కేసులన్నీ 'నాన్ ఫ్రాడ్' క్యాటగిరీ కింద ఇవ్వబడిన నోటీసులు అయ్యి ఉండాలి లేదా 'ఫ్రాడ్' క్యాటగిరీలో ఇచ్చినప్పటికీ దానిని అప్పీల్ లేదా పై స్థాయిలో నాన్ ఫ్రాడ్ మార్పి ఉండాలి.

మొదటి క్యాటగిరీ కేసులకు సంబంధించి వడ్డీ లేదా పెనాల్టీకి సంబంధించిన ప్రయోజనం పొందాలంటే.. ఫారమ్ జీఎస్‌టీ ఎస్‌పీఎల్-01 అనే అప్లికేషన్‌ను సంబంధిత వివరాలు అన్నీ నింపి ఆన్‌లైన్‌లో దాఖలు చేయాలి. అలాగే మిగతా క్యాటగిరీకి సంబంధించిన కేసులకు ఫారమ్ జీఎస్‌టీ ఎస్‌పీఎల్-02 దరఖాస్తును ఆన్‌లైన్‌లో దాఖలు చేయాలి. ఈ అప్లికేషన్ దాఖలు చేయటానికి పూర్వమే అంటే 2025 మార్చి 31 లోపు సంబంధిత ట్యాక్స్ చెల్లించి ఉండాలి. పన్ను కట్టిన వివరాలు, మినహాయింపు కోరే వడ్డీ, పెనాల్టీ వివరాలతో సంబంధిత దరఖాస్తును 2025 జూన్ 30 లోపు దాఖలు చేయాలి. అయితే కొన్ని సందర్భాలలో ఫ్రాడ్ క్యాటగిరీ కేసులను 'నాన్ ఫ్రాడ్' కేసులుగా మార్చుతూ అప్పీల్‌లో లేదా పై స్థాయిలో ఉత్తర్వులు ఇవ్వటం జరుగుతుంది. దీని ప్రకారం కట్టాల్సిన పన్నును 'నాన్ ఫ్రాడ్'కు సంబంధించిన నియమాల ప్రకారం లెక్కించి ఒక ఆర్డర్‌ను కింది స్థాయి అధికారి జారీ చేయటం జరుగుతుంది. అలాంటి సందర్భంలో మాత్రం ఇలా ఆర్డర్ జారీ చేసిన తేదీ నుంచి ఆరు నెలలలోపు జీఎస్‌టీ ఎస్‌పీఎల్-02 ను దాఖలు చేయాల్సి ఉంటుంది.

ఇక ముఖ్యంగా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం. అప్లికేషన్ దాఖలు చేసే సమయానికి ఎలాంటి అప్పీల్ లేదా పిటిషన్స్ పెండింగ్‌లో ఉండకూడదు. అలాగే కొంతమంది ఇప్పటికే సంబంధిత పన్నును అంటే ఈ ప్రకటన వెలువడటానికి పూర్వమే చెల్లించి ఉండవచ్చు. వారు కూడా దీనికి అర్హులే. ఒక వ్యక్తికి లేదా సంస్థకు ఒకటి కంటే ఎక్కువ నోటీసులు ఇచ్చి ఉంటే ప్రతి నోటీసుకు విడివిడిగా దరఖాస్తులు దాఖలు చేయాలి. అలాగే నోటీసులో లేదా ఆర్డర్‌లో డిమాండ్ చేసిన పన్ను మొత్తాన్ని చెల్లించి ఉండాలి. ఉదాహరణకు ఒక వ్యక్తికి రెండు రకాల ఉల్లంఘనలకు గాను రూ.కోటి చొప్పున రూ.2 కోట్లకు డిమాండ్ నోటీస్ ఇచ్చారనుకుందాం. దీంతోపాటు వడ్డీ, పెనాల్టీ విధించారు. ఇప్పుడు ఆ వ్యక్తి రూ.కోటి మేర వడ్డీ, పెనాల్టీ మినహాయింపు కోరుతూ ఇంకొక రూ.కోటికి అప్పీల్‌కు వెళ్లలేదు. మినహాయింపు కావాలంటే నోటీసులో ఉన్న మొత్తాన్ని చెల్లించాలి.

అలాగే ఈ మినహాయింపు 2019-20 వరకు ఉన్న ఉల్లంఘనలకే వర్తిస్తుంది. ఒకవేళ ఒకే నోటీసులో తరువాతి కాలం కూడా కలిసి ఉంటే.. ఆ తదుపరి కాలానికి సంబంధించిన పన్నును కూడా చెల్లించినప్పుడే ఈ మినహాయింపు లభిస్తుంది. కానీ, ఈ మినహాయింపు మాత్రం 2019-20 వరకు గల వడ్డీ, పెనాల్టీలకే లభిస్తుంది. తదుపరి కాలానికి వర్తించదు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

అప్పుడు కలవని వాళ్లు

ఇప్పుడు పిలుస్తున్నారు

ఉద్దేశపూర్వకంగా గందరగోళం సృష్టిస్తున్నారు.. ఇలా ఎందుకు చేస్తున్నారో అర్థం చేసుకోండి

- బంగారంలాంటి అవకాశాన్ని కోల్పోవద్దు
- అపోహలు వీడి ఆందోళనలు విరమించండి
- గ్రూప్ 1 అభ్యర్థులకు సీఎం రేవంత్ హితవు



హైదరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): "గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ల కోసం కలిసేందుకు వస్తే అనుమతించనివాళ్లు ఇప్పుడు అభ్యర్థులను పార్టీ కార్యాలయానికి పిలిచి మాట్లాడుతున్నారు. అశోక్‌నగర్‌కు కూడా వెళుతున్నారు. మూడు రోజులుగా కొంత మంది గ్రూప్ 1 అభ్యర్థులను రెచ్చగొడుతున్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కలవని వాళ్లు ఇప్పుడు ఎందుకు ఇలా చేస్తున్నారో ఆలోచించాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఉద్దేశపూర్వకంగా గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యమ సమయంలో నిరుద్యోగులను ఉసిగొల్పి వారి ప్రాణాలు బలిగొని రాజకీయంగా లబ్ధి పొంది ఉన్నత పదవులు చేపట్టిన వాళ్లు ఇప్పుడు కొంగ జపం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ విషయాన్ని యువత గుర్తించాలని కోరారు. గ్రూప్-1 అభ్యర్థులు అపోహలను విడిచి.. ఆందోళనలు విరమించాలని హితవు పలికారు. రాష్ట్ర పోలీస్ అకాడమీలో జరిగిన పోలీస్ డ్యూటీ మీట్- 2024 ముగింపు కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. "పదేళ్లుగా నోటిఫికేషన్లు రాలేదు. వచ్చిన నోటిఫికేషన్ల ప్రశ్న పత్రాలనూ పల్లీ బఠానీ మాదిరిగా పంచిపెట్టారు. అప్పుడే నిరుద్యోగ అభ్యర్థులకు అండగా నిలబడ్డాను. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేశాం. అనేక విభాగాల్లో ఖాళీల భర్తీ చేపట్టాం. తెలంగాణ వచ్చినప్పటి నుంచీ గ్రూప్-1 నోటిఫికేషన్ రాలేదు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చాం. అప్పుడే అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి తెస్తే తగు మార్పులు చేసి నోటిఫికేషన్ ఇచ్చే వాళ్లం. ఇప్పుడు ప్రిలిమ్స్ పరీక్షలు పూర్తి చేశాం. సోమవారం నుంచి మెయిన్స్ పరీక్షలు జరగబోతున్నాయి. ఈ సమయంలో నిబంధనలు మార్చాలంటూ కొందరు ఉద్దేశపూర్వకంగా ఆందోళనలు చేస్తున్నారు. జీవో 29 ప్రకారం విధివిధానాలు ఖరారు చేసిన తర్వాతే నోటిఫికేషన్ ఇచ్చాం. రిజర్వేషన్లు, పోస్టుల భర్తీ విషయంలో అన్ని విషయాలు పరిగణనలోకి తీసుకున్నాం. తుది పరీక్ష సమయంలో నోటిఫికేషన్‌లో మార్పులు చేస్తే కోర్టులు ఊరుకుంటాయా!?" అని ప్రశ్నించారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్‌ను ప్రగతి భవన్ గేటు వద్ద నాలుగు గంటలపాటు ఎర్రటి ఎండలో నిలబెట్టిన నీచమైన చరిత్ర ఉన్నవారు ఇయ్యాల మిమ్మల్ని దగ్గరకు పిలుస్తున్నారంటే వాళ్ల కొంగ జపాన్ని అర్థం చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు. ఈరోజు మీ వద్దకు వస్తున్న వారి మాటలు నమ్మి మోసపోవద్దని, ఆనాడు కానిస్టేబుల్ కిష్టయ్య, శ్రీకాంతాచారి, వేణుగోపాల్ రెడ్డి, ఇశాన్ రెడ్డి, యాదయ్య, యాదిరెడ్డిని ఉసిగొల్పి.. వారి ప్రాణాలు బలి తీసుకుని ఉన్నత పదవులు చేపట్టారని, ఆ తర్వాత వెనక్కి తిరిగి చూడలేదని విమర్శించారు. అలాంటి వారి ఉచ్చులో పడవద్దని, ఈ ప్రభుత్వం మీ సమస్యలు పరిష్కరించేందుకు ఉందని భరోసా ఇచ్చారు.

మీకు న్యాయం జరుగుతుంది

"నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులకు చెబుతున్నా! మీకు న్యాయం జరుగుతుంది. మెయిన్స్ పరీక్షకు 31 వేలమంది అభ్యర్థుల్లో 95 శాతం మంది హాల్ టికెట్లు తీసుకున్నారు. మిగతా వారు కూడా తీసుకుని పరీక్షకు హాజరుకండి. బంగారం లాంటి అవకాశాన్ని కోల్పోవద్దు. 11 ఏళ్ల పరీక్షలు నిర్వహించాలంటూ ఆందోళనలు చేస్తే.. ఇప్పుడు వద్దని ఆందోళనలు చేస్తున్నారు. దీనిపై ఒక్కసారి ఆలోచన చేయండి. పరీక్షలు నిర్వహించడం వల్ల నాకు, నా కుటుంబానికి ఎలాంటి లాభం వచ్చేది లేదు. ఆందోళనలు విరమించి, అపోహలకు దూరంగా ఉండండి" అని హితవు పలికారు. న్యాయస్థానాలు కూడా తెలంగాణ ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తున్న పరీక్షల విధానాన్ని అంగీకరించాయని చెప్పారు. ఆందోళనలు చేస్తున్న వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయవద్దని, ఉద్యోగానికి ఎంపికైన వారికి అవి అవరోధంగా మారే అవకాశం ఉంటుందని పోలీస్ అధికారులకు సూచించారు.

పోలీసుల పనితీరుతోనే ప్రభుత్వ ప్రతిష్ఠ

పోలీసుల పనితీరుతోనే ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుందని, ఏ తప్పిదం జరిగినా దానికి మచ్చ తెచ్చేదిగా మారుతుందని సీఎం రేవంత్ అన్నారు. శాంతి భద్రతలు అదుపులో ఉంటేనే పెట్టుబడులు వచ్చి రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని చెప్పారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి వస్తుందని చెప్పారు. గ్రేహౌండ్స్‌కు చెందిన 50 ఎకరాల స్థలంలో పాఠశాల ఏర్పాటు చేస్తామని, అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్ వరకు పోలీస్ పిల్లలకు చదువు చెబుతామని వివరించారు. మొదటి దశలో 5 నుంచి 8వ తరగతి వరకు ప్రారంభించి దశలవారీగా విస్తరిస్తామని, హోం గార్డు నుంచి డీజీపీ వరకు ఎవరైనా తమ పిల్లల్ని ఈ స్కూల్‌లో చేర్పించవచ్చని చెప్పారు. దాదాపు 11 ఏళ్లపాటు పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించకపోవడంతో నైపుణ్యాన్ని వెలికి తీయలేకపోయామని, ఇకపై పతకాలు సాధించే సిబ్బందికి నగదు ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు. ప్రథమ బహుమతి సాధిస్తే రూ.5 లక్షలు, ద్వితీయ బహుమతికి రూ.3 లక్షలు, తృతీయ స్థానంలో నిలిచే వారికి రూ.1.5 లక్షలు ఇస్తామన్నారు.

డ్రగ్స్ కేసుల్లో ఎవరున్నా వదలొద్దు

నేరాల తీరు, నేరగాళ్ల ఆలోచన కొత్త పుంతలు తొక్కుతోందని, అలాంటి నేరాల్ని అడ్డుకునేందుకు పోలీసులు నైపుణ్యంతో వ్యవహరించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. డ్రగ్స్ కేసుల్లో ఎవరున్నా వదలొద్దని, గంజాయి, డ్రగ్స్ కేసుల్లో కఠినంగా వ్యవహరించాలని నిర్దేశించారు. కొత్త సినిమాలు వచ్చినప్పుడు టికెట్ ధరలు పెంచుకునేందుకు వస్తున్నారని, డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తేనే మినహాయింపులు ఇవ్వాలని ఇప్పటికే పోలీస్ ఉన్నతాధికారులకు చెప్పామని, ఈ విషయంలో సినిమా పరిశ్రమకు సంబంధించి ఎంత పెద్ద వారున్నా ప్రత్యేక మినహాయింపులు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. సినిమా వారు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ప్రజలకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాల కట్టడితోపాటు అవగాహన కల్పించాలని సూచించారు. డ్యూటీలో చేరిన నాటి నుంచి విధుల్లో కనబరిచిన ఉత్తమ ప్రతిభను వెలికి తీసేందుకే పోలీస్ డ్యూటీ మీట్ ఎంతగానో ఉపయోగపడుతుందని డీజీపీ జితేందర్ అన్నారు. డ్యూటీ మీట్ వివరాల్ని సీఐడీ చీఫ్ శిఖా గోయల్ వివరించారు. డ్యూటీ మీట్‌లో ఆయా విభాగాల్లో ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి సీఎం రేవంత్ రెడ్డి ట్రోఫీలు అందజేశారు. డ్రోన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

గ్రూప్-1 వాయిదా కుదరదు!

- నేడు ప్రభుత్వం ప్రకటించే అవకాశం
- అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రుల భేటీ
- జీవో 29, 55లపై నిపుణులతో సంప్రదింపులు

గ్రూప్-1 పరీక్షను వాయిదా వేయడం కుదరని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు ఆదివారం కీలక ప్రకటన చేయనున్నట్లు తెలిసింది. గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళన, ప్రతిపక్షాల విమర్శలతో అధికార కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందన్న అభిప్రాయాల నేపథ్యంలో.. శనివారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మంత్రులతో సమావేశమయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో జరిగిన ఈ భేటీలో పొన్నంతోపాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. జీఓ 29 సారాంశం ఏమిటి, ఆ జీఓ వల్ల ఏ వర్గాలకైనా నష్టం జరుగుతుందా, జీఓ 55లో ఏముంది, ఈ జీవోల వల్ల భవిష్యత్తులో ఎలాంటి పర్యవసానాలుంటాయి అన్న అంశాలపై టీజీపీఎస్సీ అధికారులతోపాటు న్యాయనిపుణులతో మంత్రులు మాట్లాడారు. ఈ విషయంలో ఏ ఒక్క అభ్యర్థికి నష్టం జరగవద్దని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే, గ్రూప్-1 పరీక్షను వాయిదా వేయవద్దని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది.



సచివాలయ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న గ్రూప్-1 అభ్యర్థులు

చలో సచివాలయం ఉద్రిక్తం

- అభ్యర్థుల ఆందోళనతో అట్టుడికిన అశోక్‌నగర్
- బండి సంజయ్ బైఠాయింపు, ర్యాలీతో ఉద్రిక్తత
- పాల్గొనేందుకు బీఆర్‌ఎస్ నేతల యత్నం
- వారిని అడ్డుకున్న బీజేపీ శ్రేణులు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నేతల అరెస్ట్
- సచివాలయానికి వెళ్లేందుకు సంజయ్ యత్నం
- అదుపులోకి తీసుకున్న పోలీసులు

కవాడిగూడ/చిక్కడపల్లి/హైదరాబాద్ సిటీబ్యూరో/అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 29ని రద్దు చేసిన తరువాతే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలంటూ గ్రూప్ వన్ అభ్యర్థులు నిర్వహించిన చలో సచివాలయం ఉద్రిక్తతకు దారితీసింది. అశోక్‌నగర్ చౌరస్తాలోని పిల్లర్ నెంబర్ 21 వద్ద గ్రూప్ వన్ అభ్యర్థులకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ మద్దతు ప్రకటించి స్వయంగా ఆందోళనలో పాల్గొన్నారు. అక్కడ నుంచి చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయానికి, ఆ తర్వాత అశోక్‌నగర్ చౌరస్తాకు చేరుకున్నారు. తమకు బాసటగా నిలిచిన బండి సంజయ్‌కు నిరుద్యోగులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మహిళలని కూడా చూడకుండా దారుణంగా కొట్టి 12 గంటలపాటు నిర్బంధించారని వాపోయారు. ఆ తర్వాత గ్రూప్ 1 బాధితులకు న్యాయం చేయాలంటూ అభ్యర్థులతో కలిసి బండి సంజయ్ రోడ్డుపై బైఠాయించారు. గ్రూప్ 1 అభ్యర్థులకు న్యాయం చేసేంత వరకు కదిలేది లేదని బండి సంజయ్ తేల్చి చెప్పారు. విషయం తెలుసుకున్న బీజేపీ యువ మోర్చా, మహిళా మోర్చా నాయకులు, బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి తరలి వచ్చి గ్రూప్ 1 అభ్యర్థులకు సంఘీభావం తెలుపుతూ రోడ్డుపై బైఠాయించారు. భారీగా తరలివస్తున్న నిరుద్యోగులను కట్టడి చేసేందుకు పోలీసులు ఇబ్బందులు పడ్డారు. నిరుద్యోగులను బయటకు రాకుండా అడ్డుకునేందుకు యత్నించారు. ముళ్లకంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాదాపు గంటసేపు అశోక్‌నగర్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

పోలీసులు వెళ్లిపొమ్మన్నా భీష్మించిన సంజయ్

ఈ నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు బండి సంజయ్ వద్దకు వచ్చి అక్కడి నుంచి వెళ్లిపోవాలని అభ్యర్థించారు. గ్రూప్ 1 అభ్యర్థులకు న్యాయం చేసేంతవరకు కదిలేది లేదంటూ ఆయన నిరసనను కొనసాగించారు. ఆ తర్వాత సచివాలయం ముట్టడి కార్యక్రమానికి ర్యాలీగా బయలు దేరారు. గ్రూప్ 1 అభ్యర్థులతో కలిసి బండి సంజయ్ ర్యాలీగా సచివాలయ ముట్టడికి వెళ్తుండగా లోయర్ ట్యాంక్‌బండ్ కట్టమైసమ్మ దేవాలయం వద్ద బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు ఒక్కసారిగా ర్యాలీలో పాల్గొనేందుకు యత్నించారు. మాజీమంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్, ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ తదితరులు ర్యాలీలో పాల్గొనేందుకు యత్నించారు. వీరిని బీజేపీ మహిళా కార్యకర్తలు అడ్డుకొని బీఆర్‌ఎస్ నేతలు గో బ్యాక్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. దీంతో బీఆర్‌ఎస్, బీజేపీ నేతలకు మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్తత నెలకొంది. ర్యాలీలో పాల్గొనేందుకు యత్నించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య మళ్లీ వాగ్వాదం

తెలుగు తల్లి ఫ్లైఓవర్ వద్ద రోడ్డుపై మళ్లీ బైఠాయించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ జత కలిశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు రాగానే మరోసారి బీజేపీ, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం జరిగింది. బీఆర్‌ఎస్ నేతలకు వ్యతిరేకంగా గ్రూప్ 1 అభ్యర్థులు, బీజేపీ నేతలు నినాదాలు చేశారు. 15 నిమిషాల పాటు బీఆర్‌ఎస్ నేతలు కూడా రోడ్డుపై బైఠాయించి బీజేపీ నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్రిక్తత పెరుగుతుండటంతో పోలీసులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, దాసోజు శ్రవణ్ తదితరులను అరెస్టు చేసి అక్కడ నుంచి తరలించారు. ఆ తర్వాత సచివాలయం వైపు దూసుకుపోవడానికి ప్రయత్నించిన బండి సంజయ్‌ని పోలీసులు బలవంతంగా కారులో ఎక్కించారు. సంజయ్‌ని తీసుకెళుతున్న వాహనాన్ని గ్రూప్ 1 అభ్యర్థులు, బీజేపీ నేతలు కొద్ది దూరం వెంబడించారు. సంజయ్‌ని నాంపల్లిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి చేర్చి ఊపిరిపీల్చుకున్నారు.

చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ బదిలీ

శుక్రవారం ర్యాలీ నిర్వహిస్తున్న గ్రూప్ 1 అభ్యర్థులపై లాఠీచార్జి చేయడంతో చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య బదిలీ అయ్యారు. ఆయనను స్పెషల్ బ్రాంచి(ఎస్‌బీ)కి బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.



నిరసనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

తేలని నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ టెండర్లు

హైదరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం టెండర్ల ఖరారు మరోమారు వాయిదా పడింది. ఈ పథకంపై కమిషనర్ ఆఫ్ టెండర్స్(సీవోటీ) ఏ నిర్ణయం తీసుకోలేదు. శనివారం పలు టెండర్లపై సీవోటీ చైర్మన్, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇందులో ప్రధానంగా నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం టెండర్లపై చర్చ జరిగింది. లక్ష ఎకరాలకు సాగునీటితో పాటు, తాగునీటిని అందించడానికి రూ.4350 కోట్లతో నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం చేపట్టనుంది. ఈ పథకంలో రెండు ప్యాకేజీలకు గత నెలలో టెండర్లు పిలిచారు. ఈ పథకంలో ప్యాకేజీ-1 కింద రూ.1134.62 కోట్ల టెండర్లు పిలిచారు. 3.9శాతం అధికంగా కోట్ చేసి, ఎల్-1(తక్కువ ధర)గా రాఘవ-జ్యోతి జాయింట్ వెంచర్ నిలిచింది. 4.85 శాతం అధికంగా కోట్ చేసి, మేఘా ఎల్-2గా నిలిచింది. రెండోప్యాకేజీ కింద రూ.1126.85 కోట్ల పనులకు టెండర్లు పిలవగా 3.95 శాతం అధికంగా కోట్ చేసిన మేఘా ఎల్ -1గా నిలిచింది. 4.80 శాతం అధికంగా కోట్ చేసిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఎల్-2గా నిలిచింది. దీనిపై ఇప్పటికే సీవోటీ పలు దఫాలుగా చర్చలు జరిపినా ఏ నిర్ణయం తీసుకోలేదు. ప్యాకేజీ-2 టెండర్ లెక్కప్రకారమే ఉండగా... ప్యాకేజీ-1 విషయంలో సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. దాంతో ఈనెల 21వ తేదీన మరోమారు సీవోటీ సమావేశం జరగనుంది.

ఆ రైళ్ల వేళలు మారాయ్!

- నారాయణాద్రి, పద్మావతి, సింహపురి వేళల్లో మార్పులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని వివిధ స్టేషన్ల నుంచి బయల్దేరే మూడు ప్రధాన రైళ్ల వేళల్లో మార్పులు చేశామని రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి శ్రీధర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. సికింద్రాబాద్-గూడూరు మధ్య నడిచే సింహపురి ఎక్స్‌ప్రెస్ ఇకపై ప్రతిరోజూ సికింద్రాబాద్ నుంచి రాత్రి 10.05 గంటలకు, లింగంపల్లి-తిరుపతి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి నుంచి సాయంత్రం 5.30 గంటలకు బయల్దేరతాయని వెల్లడించారు. మారిన రైళ్ల వేళలు ఆదివారం నుంచి వర్తించనున్నాయని శ్రీధర్ పేర్కొన్నారు.

గ్రూప్-1 పరీక్ష వాయిదా వేయాలి: ఏఐఎస్ఎఫ్

హైదరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 పరీక్ష నిర్వహణ విషయంలో ప్రభుత్వాలు ఇష్టారీతిగా జీవోలు తీసుకొచ్చి అభ్యర్థులకు అన్యాయం చేయడం సరికాదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ, పుట్ట లక్ష్మణ్ తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో 55 తీసుకువచ్చి నిరుద్యోగులకు వ్యతిరేకంగా పని చేస్తే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 29 తీసుకురావడం నిరుద్యోగులకు శాపంగా మారిందని ఆరోపించారు. ప్రభుత్వం మొండి వైఖరికి పోకుండా పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని, జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

తప్పుడు జీవోను షేర్ చేసిన ఉద్యోగిపై వేటు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తప్పుడు జీవోను వాట్సా‌ప్‌లో షేర్ చేసిందుకు హెచ్‌ఎండీఏలోని ఓ ఉద్యోగిపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. అలాగే డిప్యుటేషన్‌పై వచ్చిన ఆ ఉద్యోగిని సొంత శాఖకు పంపుతూ హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశాలిచ్చారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో కొన్ని భూములను నిషేధిత జాబితాలో చేర్చారని, సీఎస్ ఆదేశాలతో జీవో 22 విడుదలైనట్లుగా సోషల్ మీడియాలో వైరల్ అయింది. అయితే ఇది పూర్తిగా తప్పుడు ఉత్తర్వుగా ఉన్నతాధికారులు గుర్తించారు. దీనిపై సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన అధికారులు హెచ్‌ఎండీఏలోని బుద్ధపూర్ణిమ ప్రాజెక్టులో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న రవీందర్‌రెడ్డి దాన్ని షేర్ చేసినట్టుగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేయడంతో పాటు శుక్రవారం అరెస్టు చేసి సాయంత్రానికి బెయిల్‌పై ఆయనను విడుదల చేశారు. ఆగస్టులో తనకు వాట్సాప్‌లో వచ్చిన జీవో కాపీని మరొకరికి షేర్ చేశానని, ఆ తప్పుడు జీవోకు తనకెలాంటి సంబంధంలేదని రవీందర్‌రెడ్డి తెలిపారు.



మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ముందు మూసీకి రిటైనింగ్ వాల్ కట్టండి

ఆ తర్వాతే సుందరీకరణపై ఆలోచన చేయండి

25న మూసీ నిర్వాసితులతో కలిసి ధర్నా

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

మెహిదీపట్నం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ముందు మూసీకి రెండు వైపులా రిటైనింగ్ వాల్ కట్టాలని, డ్రెయినేజీల నీరు కలవకుండా మళ్లించాలని, ఆ తర్వాతే మూసీ సుందరీకరణ గురించి ఆలోచించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అలా కాకుండా పేదల ఇళ్లను కూల్చుతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. శనివారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని మూసీ పరీవాహక ప్రాంతాల్లో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లకు మార్కింగ్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఏళ్ల తరబడి మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలు రోడ్డున పడుతున్నారన్నారు. 30, 40 ఏళ్ల నుంచి లక్షలాది మంది ఒక్కో ఇటుక పేర్చి, ఒక్కో సిమెంటు బస్తా కొనుక్కుని ఇళ్లు కట్టుకున్నారన్నారు. వారి ఇళ్లను ఇప్పుడు కూల్చివేస్తామంటే న్యాయం కాదన్నారు. ముఖ్యమంత్రి మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. 'ఏ ప్రభుత్వమైనా పేదల కోసం పని చేయాలి.. పేదలకు ఇళ్లు కట్టి ఇవ్వాలి.. మరి రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాత ఒక్కటంటే ఒక్క ఇల్లు కూడా కట్టలే.. కనీసం కట్టేందుకు భూమి పూజ కూడా చేయలే.. కానీ కట్టిన ఇళ్లు మాత్రం కూలగొడుతున్నారని ఆరోపించారు. తాను హైదరాబాద్‌లోనే పెరిగానని, ఎప్పుడూ ఇళ్లల్లోకి వరద నీరు రాలేదన్నారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, ఇళ్లలోకి వరద నీరు రాకుండా అడ్డుకోవాలంటే రిటైనింగ్ వాల్ కట్టాల్సిన అవసరం ఉందని, గతంలో కూడా నిజాం ఉన్నప్పుడు కట్టారని తెలిపారు. అలాగే డ్రెయినేజీల నీరు కలవకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. మూసీ నిర్వాసితులు ధైర్యంగా ఉండాలని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. 'మీ ఇళ్లు కూల్చాల్సి వస్తే... వాళ్లు ముందుగా మమ్మల్ని జైలులో పెట్టి రావాల'న్నారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో సదుపాయాల కల్పనకు బీజేపీ కృషి చేసిందని గుర్తుచేశారు. మూసీ నిర్వాసితులకు అండగా ఈ నెల 25న ఇందిరా పార్కు వద్ద బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ధర్నా చేస్తామన్నారు.

రాష్ట్రంలో రిజర్వేషన్ల రద్దుకు కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో మాట్లాడారు. గ్రూప్-1 పరీక్ష రద్దు కావాలని అభ్యర్థులెవరూ కోరుకోవడం లేదని, రీషెడ్యూల్ చేయాలని మాత్రమే కోరుతున్నారని తెలిపారు. 'రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది అభ్యర్థులు టెన్షన్‌లో ఉన్నరు. వారు పరీక్ష రాసే పరిస్థితిలో లేరు. హైకోర్టులో 22 కేసులున్నయి. తీరా పరీక్ష రాసిన తర్వాత కోర్టు తీర్పు మరోలా వస్తే తమ కష్టం వృథా అవుతుందన్నదే అభ్యర్థుల ఆందోళన. భవిష్యత్తులో న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే.. పరీక్షను రీషెడ్యూల్ చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు' అని బండి సంజయ్ వివరించారు. సోనియాగాంధీ జన్మదినం తెలంగాణ నిరుద్యోగ యువతకు బలిదినం కాబోతోందని, ఆమె జన్మదినం వరకు కాంగ్రెస్ నాయకులు ఎంతమంది నిరుద్యోగులను బలి తీసుకుంటారోనని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రూప్-1 అభ్యర్థుల మీద పోలీసులు జరిపిన లాఠీచార్జిపై రాహుల్‌గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కొంతమంది పోలీసులు హాస్టళ్లలోకి చొరబడి తమతో అరాచకంగా వ్యవహరించారని మహిళా అభ్యర్థులు తెలిపారని బండి సంజయ్ వెల్లడించారు. గర్భిణిని కూడా పోలీసులు కొట్టారన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



గ్రూప్-1 అభ్యర్థులతో మాట్లాడుతున్న బండి సంజయ్

నన్ను అరెస్టు చేసే దమ్ము ఎవరికి ఉంది?

చలో సెక్రటేరియట్ ర్యాలీ సందర్భంగా తనను పోలీసులు అరెస్టు చేసినట్లు టీవీ చానళ్లలో వచ్చిన కథనాలపై కేంద్ర మంత్రి స్పందించారు. 'నన్ను అరెస్టు చేసే దమ్ము ఇక్కడ ఎవరికి ఉంది?' అని పేర్కొన్నారు. తనను అరెస్టు చేయలేదని, బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తరలించారన్నారు. కాగా, నిరుద్యోగుల ఆందోళనను విచ్ఛిన్నం చేసేందుకు బీఆర్‌ఎస్ భారీ కుట్ర పన్నిందని ఆరోపించారు. నిరుద్యోగులకు అండగా బీజేపీ నిర్వహించిన ర్యాలీలోకి బీఆర్‌ఎస్.. పథకం ప్రకారం చొరబడి విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నించిందన్నారు. అయితే, నిరుద్యోగులు అడ్డుకోవడంతో బీఆర్‌ఎస్ నేతలు వెనక్కి వెళ్లిపోయారని తెలిపారు. గ్రూప్-1 వివాదంపై చర్చ కోసం సీఎం రేవంత్ తనకు ఫోన్ చేశారంటూ జరిగిన ప్రచారంలో వాస్తవం లేదని బండి సంజయ్ తెలిపారు. చర్చలకు ఎవరూ పిలువలేదన్నారు. గ్రూప్-1 అభ్యర్థులు ఒకరిద్దరు ముందుకు వస్తే, అధికారులతో మాట్లాడిస్తామని అధికారులు తనకు తెలియజేశారన్నారు. దీని గురించి అక్కడే ఉన్న అభ్యర్థులకు చెబితే.. చర్చలు అవసరం లేదని, పరీక్షను రీషెడ్యూల్ చేయాలని, జీవో 29 రద్దు చేయాలని వారు స్పష్టం చేశారని పేర్కొన్నారు.

కేటీఆర్ యూజ్‌లెస్ ఫెలో

పేపర్ లీకేజీలు చేయడం తప్ప, గ్రూప్-1 గురించి ఏం తెలుసంటూ కేటీఆర్ తన మీద చేసిన విమర్శపై బండి సంజయ్ నిప్పులు చెరిగారు. 'ఫాల్తు రాజకీయాలు చేస్తే రోడ్లపై ఉరికిచ్చి కొడతరు. ఇంకా మీ ప్రభుత్వం ఉందనుకుంటున్నారా? యూజ్‌లెస్ ఫెలో.. పిచ్చివాగుడు వాగితే రాళ్లతో కొడతరు.. మీ భాష, అహంకారం చూసే మీ అయ్య రెస్ట్ తీసుకుంటున్నరు. థూ.. నీ బతుకేంది అని మీ పార్టీ క్యాడరే ఛీత్కరించుకుంటున్నరు. మీదో బతుకా? మీరో మనిషా? మీదో మనిషి పుట్టుకా?' అని ధ్వజమెత్తారు. 'మీరు నా గురించి మాట్లాడుతారా? మీ చీకటి బతుకేందో మాకు తెల్వదా? మీరు, రేవంత్ ఒక్కటి కాదా? డ్రగ్స్ కేసు, మీ అయ్య పేరు ఉన్న ఫోన్ ట్యాపింగ్ కేసు ఏమైంది? కాళేశ్వరం కేసు ఏమైంది? మరోసారి నా గురించి పిచ్చిపిచ్చిగా మాట్లాడితే మీ చీకటి బతుకులు బయటపెడతా' నంటూ కేటీఆర్‌ను హెచ్చరించారు. 'మీరు డ్రగ్స్ తీసుకోలేదని, నేను పేపర్ లీక్ చేశానని మీరు, మీ అయ్య, మీ కుటుంబ సభ్యులు ఏ గుడికి వస్తారో వచ్చి ప్రమాణం చేయండి' అని కేటీఆర్‌కు బండి సంజయ్ సవాల్ చేశారు. వారు అలా చేస్తే తాను ముక్కు నేలకు రాస్తానని, కేటీఆర్‌కు సెల్యూట్ చేసి క్షమాపణలు చెబుతానని ప్రకటించారు.

నిరుద్యోగులేమైనా హంతకులా?

వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరించాలా?.. అన్ని వర్గాలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారు

- సెక్యూరిటీ లేకుండా అశోక్ నగర్ వెళ్లే దమ్ముందా?
- జీవో 29ను రద్దు చేయాలి: హరీశ్



సిద్దిపేట టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హక్కుల కోసం నిరసన తెలుపుతున్న నిరుద్యోగులను పోలీసులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వారేమైనా ఉగ్రవాదులా? హంతకులా? వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరించాలా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రిజర్వేషన్ల అమలుకు, రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తోందని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను జీవో నంబర్ 55 ప్రకారం అమలు చేశామని, రేవంత్ ప్రభుత్వం ఏర్పడ్డాక దాన్ని కాదని జీవో నంబర్ 29 తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఈ జీవో వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. సిద్దిపేటలో హరీశ్ మాట్లాడారు. నాలుగు రోజులుగా నిరుద్యోగ యువతపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాడిని బీఆర్‌ఎస్ పక్షాన ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగం తమకు భగవద్గీత, బైబిల్, ఖురాన్ వంటిదని చెబుతున్న రేవంత్.. ఆ రాజ్యాంగాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. దళితులు, బలహీన, మైనార్టీ వర్గాలకు అన్యాయం చేయడమేనా కాంగ్రెస్ పాలసీ? అని నిలదీశారు. ఒకవైపు రాహుల్ గాంధీ రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకుని తిరుగుతుంటే.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అదే రాజ్యాంగాన్ని నీరుగార్చేలా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. దళితులు, బలహీన, మైనార్టీ వర్గాలకు అన్యాయం చేయడమేనా కాంగ్రెస్ పాలసీ? అని నిలదీశారు. దీనిపై దళిత వర్గానికి చెందిన భట్టి విక్రమార్క అయినా స్పందిస్తారో? లేదో? వేచి చూడాల్సి ఉందన్నారు. విద్యార్థుల ఆర్తనాదాలతో అశోక్‌నగర్ దద్దరిల్లుతోందని, లాఠీచార్జీలు, ఇనుప కంచెలతో విద్యార్థుల ఆందోళనలను అణిచివేయడం సాధ్యం కాదని అన్నారు. ఓట్లు వచ్చినప్పుడు కాదు.. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా ఇప్పుడు అశోక్‌నగర్‌కు వెళ్లే దమ్ముందా? అని ప్రశ్నించారు. కోదండరాం, రియాజ్, ఆకునూరి మురళి, ఎమ్మెల్సీ నవీన్ తదితరులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. . జీవో 29ను రద్దు చేసి, జీవో 55నే కొనసాగించాలన్నారు. వానాకాలం సీజన్ రైతు బంధు ఇవ్వబోమన్నట్టుగా మంత్రి తుమ్మల మాట్లాడుతున్నారని, దీన్ని బీఆర్‌ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

ఝార్ఖండ్‌లో డిప్యూటీ సీఎం భట్టి

» ఇండియా కూటమి పక్షాలతో సమన్వయ సమావేశం


రాహుల్‌గాంధీకి కండువా కప్పుతున్న భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడు భట్టి విక్రమార్క.. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలైన ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం), ఆర్జేడీలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. శనివారం రాంచీలో జరిగిన ఈ భేటీలో.. కాంగ్రెస్ ఆశిస్తున్న సీట్లపై మిత్రపక్షాలతో చర్చలు జరిపారు. తన తోటి సీనియర్ పరిశీలకులతో సమావేశమయ్యారు. మరోవైపు రాంచీలో నిర్వహించిన సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్‌లో పాల్గొనేందుకు వచ్చిన లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీకి భట్టి సాదర స్వాగతం పలికారు.

మేడిగడ్డకు పరీక్షలు చేసి ఎన్‌డీఎస్‌ఏకు నివేదికివ్వండి: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వరదలు తగ్గుముఖం పట్టడంతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మళ్లీ పరీక్షలు చేసి జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీకి నివేదికలు అందించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను శనివారం ఆదేశించారు. వరదలు తగ్గిన తర్వాత పరీక్షలు చేసి రిపోర్టులు ఇస్తేనే నివేదిక ఇస్తామని ఎన్‌డీఎస్‌ఏ ఇప్పటికే తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, ఈఎన్‌సీ(ఓఅండ్ఎం) బి.నాగేంద్రరావుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి ఆదేశాలిచ్చారు. అలాగే, సమ్మక్క సాగర్(తుపాకులగూడెం) ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యా కమిషన్ సలహాదారుగా ఆర్.వెంకట్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యా కమిషన్ సలహాదారుగా ఆర్. వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. ఎం.వి. ఫౌండేషన్ జాతీయ కన్వీనర్‌గా వెంకట్‌రెడ్డి బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల విద్యాహక్కు పరిరక్షణ, బాల్య వివాహాల సంప్రదాయానికి వ్యతిరేకంగా ఉద్యమ నిర్మాణంలో గత రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. తెలంగాణతో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల అనుసంధానకర్తగా వ్యవహరించారు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలతో పాటు యూరప్, అమెరికాల్లో విస్తృతంగా పర్యటించి భాగస్వాములను బాలల హక్కుల పట్ల సంసిద్ధులను చేయడానికి, సంబంధాలు మెరుగుపర్చడానికి కృషి చేశారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధిగా ఐక్యరాజ్య సమితిలో పాల్గొని వివిధ దేశాల్లో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు తగిన సూచనలు చేశారు.

మరింత పటిష్ఠంగా మధ్యవర్తిత్వ వ్యవస్థ

» సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం నరసింహ

న్యూఢిల్లీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దేశంలో మధ్యవర్తిత్వ వ్యవస్థను మరింత సంస్థాగతం చేసి పటిష్ఠపరచాల్సి ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం నరసింహ అన్నారు. జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ కమిటీ సిఫారసులకు అనుగుణంగా ఆర్బిట్రేషన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను నెలకొల్పాల్సిన అవసరం ఉందని తెలిపారు. శనివారం ఢిల్లీలో నానీ పాల్కీవాలా ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటు చేసిన జాతీయ సదస్సులో ఆయన కీలక ప్రసంగం చేశారు. ఆర్బిట్రేషన్ ప్రమోషన్ కౌన్సిల్‌కు స్వతంత్ర ప్రతిపత్తి ఉండాలని, వివిధ వర్గాల వారికి అందులో ప్రాతినిధ్యం ఉండాలని సూచించారు. ఆర్బిట్రేషన్ తీర్పుల అమలును పర్యవేక్షించేందుకు ప్రస్తుతం దేశంలో ఒక యంత్రాంగం అంటూ లేదని గుర్తు చేశారు. భారతదేశంలో ఉన్న ఆర్బిట్రేషన్ న్యాయనిపుణులు ప్రతిభావంతులని, ప్రపంచంలోని ఏ నిపుణులకూ తీసిపోరని అన్నారు. అందువల్ల ఆర్బిట్రేషన్ ప్రక్రియను సంస్థాగతం చేసి ఉత్తమ పద్ధతులను అవలంబించేందుకు వీలుగా సమర్థమైన పర్యవేక్షణ వ్యవస్థ ఉండాలని తెలిపారు. నిర్దిష్ట కాలపరిమితికి కట్టుబడి ఉండే ఆర్బిట్రేషన్ సంస్కృతి చాలా ముఖ్యమని అన్నారు. 1996లో చేసిన ఆర్బిట్రేషన్ చట్టంలో పలు నిబంధనలను రూపొందించినప్పటికీ పర్యవేక్షణ జరిపేందుకు ఎలాంటి నియంత్రణ వ్యవస్థను సూచించలేదని జస్టిస్ నరసింహ చెప్పారు. బ్రిటన్‌లో 80 శాతం ఆర్బిట్రేషన్ సంస్థాగతమైనదని తెలిపారు. దేశంలో ఈ వ్యవస్థను సంస్థాగతం చేయడంతో పాటు పర్యవేక్షణ కూడా అవసరమని అన్నారు.

26కు క్యాబినెట్ భేటీ వాయిదా

హైదరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న నిర్వహించాలనుకున్న తెలంగాణ మంత్రివర్గ సమావేశం 26వ తేదీకి వాయిదా పడింది. దక్షిణ కొరియాలోని సియోల్ నగరంలో హన్ నదిని అభివృద్ధి చేసిన తీరును పరిశీలించేందుకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ వెళ్లిన నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మంత్రులు సియోల్ పర్యటనకు శనివారం వెళ్లగా.. ఈ నెల 25న తిరిగి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఈసారి మంత్రివర్గ సమావేశంలో కొత్త ఆర్వోఆర్ ముసాయిదా బిల్లుపై చర్చించనున్నారు. రెవెన్యూశాఖ మంత్రి లేకుండా కీలకమైన ఈ బిల్లుపై చర్చించడం సరికాదని భావించి మంత్రివర్గ సమావేశాన్ని ఈ నెల 26కు సీఎం రేవంత్‌రెడ్డి వాయిదా వేశారు.

బలగం ఫేమ్ కొమురమ్మకు స్పీకర్ సాయం

బలగం సినిమా ఫేమ్ కొమురమ్మకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం రూ.లక్ష సాయం అందించారు. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య స్మారక అవార్డు ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రసాద్‌కుమార్ ఆ అవార్డు గ్రహీతలైన కొమురమ్మ, మొగిలయ్యల ఆర్థిక పరిస్థితి బాగాలేదని తెలిసి ఆర్థికసాయం చేస్తానని మాటిచ్చారు. ఈ మేరకు శనివారం కొమురమ్మను తన నివాసానికి పిలిపించుకుని రూ.లక్ష చెక్కును అందించారు. ఈ సందర్భంగా తనకు పెన్షన్ ఇప్పించాలని స్పీకర్‌కు కొమురమ్మ విజ్ఞప్తి చేశారు. మంత్రి జూపల్లితో మాట్లాడి పెన్షన్ ఇప్పించేందుకు కృషి చేస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు.

మూసీ ప్రాజెక్టుకు అధికారిక లోగో



హైదరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు కోసం శనివారం లోగోను విడుదల చేసింది. ఇందులోపైన వంతెన, కింద మూసీ అని ఇంగ్లీషు అక్షరాలతో రాసి ఉంది. ఈ లోగోకు 'ఓన్ అవర్ ఓన్ మూసీ' అని ట్యాగ్‌లైన్‌ను జత చేసింది. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అధికారిక చిహ్నంగా దీనిని ఖరారు చేసింది. ఇకపై మూసీ ప్రాజెక్టుకు సంబంధించి నిర్వహించే అధికారిక పత్రాలు, ఉత్తర ప్రత్యుత్తరాలపై ఈ లోగో దర్శనమివ్వనుంది. దీంతో పాటు ప్రభుత్వ చిహ్నం ఉంటుంది.

ముద్ర రుణాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

» రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు



హైదరాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత అందించాలన్న లక్ష్యంతో కేంద్రం అమలుచేస్తున్న ముద్ర రుణాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు ఆరోపించారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఈ పథకం పెద్దఎత్తున అమలవుతుంటే రాష్ట్రంలో మాత్రం ఎంతో వెనుకంజలో ఉందని ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24లో దేశవ్యాప్తంగా 6.67కోట్ల మందికి రూ.5.41లక్షల కోట్లు ముద్ర రుణాలు మంజూరుచేశారని పేర్కొన్నారు. తెలంగాణలో కేవలం 9.47లక్షల మందికి రూ. 10,929 కోట్ల రుణాలే మంజూరు అయ్యాయన్నారు. ఈ పథకం ఎక్కువ మందికి అందేలా సహకరించాలని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌ను కోరారు.

ఆర్థిక ఉగ్రవాదుల భరతం పడతాం

(మొదటిపేజీ తరువాయి)

ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద జరిగిన సద్భావన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ జాతీయ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గీతారెడ్డి దంపతులకు సద్భావన అవార్డు అందజేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. చెరువులు, కుంటలు ఆక్రమించుకున్న వారు.. ప్రభుత్వ భూములను, నాలాలను కబ్జా చేసి అన్యాయంగా ఏడంతస్తుల మేడలు కట్టుకున్న వారి పట్ల హైడ్రా అంకుశం లాంటిదని స్పష్టం చేశారు. మదపుటేనుగులను అణిచేందుకు అంకుశాన్ని ఏవిధంగా వాడతారో.. అలా కబ్జాదారుల పట్ల హైడ్రా అంకుశంలా పని చేస్తుందని తెలిపారు. అందుకే, చెరువులు, కుంటలు ఆక్రమించుకున్నోళ్లు.. ప్రభుత్వ భూములను అమ్ముకుని లక్షల కోట్లు సంపాదించుకున్నోళ్లు భయపడుతున్నారని, వారందరి సంగతి తేల్చేందుకు హైడ్రా వచ్చిందని చెప్పారు. అక్రమార్కులకు కంటి మీద కునుకు ఉండదని, కచ్చితంగా వారి సంగతి తేలుస్తామని హెచ్చరించారు.

మూసీ పునరుజ్జీవం వేరు.. హైడ్రా వేరు

హైడ్రా ఇప్పటి వరకూ మూసీ వైపు కన్నెత్తి కూడా చూడలేదని, మూసీ పునరుజ్జీవం వేరు.. హైడ్రా వేరు అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైడ్రా అనగానే హరీశ్ రావు, కేటీఆర్, ఈటల రాజేందర్ బయటకు వస్తున్నారని, వారి కిరాయి మనుషులు తప్ప.. పేదోళ్లు ఎవ్వరూ బయటకు రావడం లేదని మండిపడ్డారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లో పేదోళ్లు ఫామ్ హౌజ్‌లు కట్టుకోగల్గుతారా? అని ప్రశ్నించారు. "చెరువుల్లో ఫామ్‌హౌజ్‌లు కట్టి వాటిలోని డ్రైనేజీ నీళ్లను గండిపేట, హిమాయత్ సాగర్‌ల్లో కలిపిన వాళ్లు ఎంత దుర్మార్గులు.. క్రిమినల్స్.. కిరాతకులు! ఆ గాడిదల బలుపు చెప్పదల్చుకున్నా. తాగే నీళ్లలో డ్రైనేజీ నీళ్లు కలుపుతారా? వాడు వాడిన బాత్రూమ్ నీళ్లు గండిపేటలో కలిస్తే ఆ నీళ్లు తాగాలా!? మీ అందరినీ అదే చెరువుల్లో వేసి తొక్కుతాం. ఇట్లాంటి దుర్మార్గమైన పని చేసిన వీళ్లను ఒంగపెట్టి పోలీసు స్టేషన్‌లో బట్టలూడదీసి కొట్టాలి. కానీ, బాగుండదని చెరువుల పక్కనున్న అక్రమ నిర్మాణాలు కూలగొట్టుడు మొదలు పెట్టినం. దాంతో, వీళ్లంతా గగ్గోలు పెడుతున్నారు" అని మండిపడ్డారు. పేదలు నిశ్చింతగా ఉండాలని, మూసీ నిర్వాసితులను ఒప్పించకుండా ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టదని హామీ ఇచ్చారు. మెరుగైన నష్ట పరిహారం, జీవితాన్ని అందించే మంచి విధానాన్ని తీసుకొస్తామని తెలిపారు.



గీతారెడ్డికి రాజీవ్ గాంధీ సద్భావన అవార్డును అందజేస్తున్న సీఎం రేవంత్, మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు

"ఫామ్‌హౌజ్‌లను కాపాడుకునేందుకే కేటీఆర్, హరీశ్ లంగ నాటకాలు.. దొంగ మాటలు. మీ ఫామ్ హౌజ్‌లను అక్రమంగా నిర్మించారా? లేదా? బుల్కాపూర్ నాలా ఆక్రమించుకున్నావా? లేదా? అజీజ్‌నగర్‌లో హరీశ్‌రావు ఫామ్‌హౌజ్ లేదా? పోదాం పద.. అక్కడికి వస్తాను" అని మండిపడ్డారు. ఎక్కడ బుల్డోజరు వస్తుందోనని మూసీ పేరుతో నాటకాలాడుతున్నారని ధ్వజమెత్తారు. బుల్కాపూర్ నాలాను కేటీఆర్ ఆక్రమించి రోడ్డు వేసుకున్నారని, 50ఎకరాల్లో వంద కోట్లు పెట్టి పెద్ద భవంతి నిర్మించుకున్నారని తెలిపారు. పేదలను రక్షణ కవచంగా పెట్టుకొని ఫామ్‌హౌజ్‌లను కాపాడుకుంటున్నారని విమర్శించారు. "మేం అడ్డుకుంటాం. పండుకుంటామంటున్నారు. ఒక్కరు కూడా వస్తలేరు. బుల్డోజరు ఖాళీగా పెట్టిన. బిల్లా, రంగాలు ఎప్పుడొచ్చి పండుకుంటారో చెప్పండి. బుల్డోజరు నడిపే బాధ్యత హనుమంతన్నకు ఇస్తాను" అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. నిజ నిర్ధారణ కమిటీ వేద్దామని, వారి ఫామ్ హౌజ్‌లకు అఖిలపక్షాన్ని తీసుకుపోదామని, ఎప్పుడు రావాలో హరీశ్, కేటీఆర్ చెప్పాలని సవాల్ విసిరారు. అవి అక్రమ నిర్మాణాలో కాదో తేలద్దామన్నారు. వాళ్ల పప్పులుడకవని, తొందర్లోనే ఎవరిపై ఏమేం చర్యలుండాలో అవి ఉంటాయని స్పష్టం చేశారు. మత రాజకీయాలతో లబ్ధి పొందేందుకు కొన్ని పార్టీలు ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేస్తున్నాయని, అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఉత్తమ్ అన్నారు. రేవంత్ చేస్తున్న కార్యక్రమాలను మెజారిటీ ప్రజలు మద్దతు తెలుపుతున్నారని, కొంతమంది సోషల్ మీడియాలో ఇష్టారాజ్యంగా ఎడిటింగ్‌లు, మార్ఫింగులు చేస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, వాళ్లు దోచుకున్న తీరును అందరికీ ఆపాదిస్తే ఎలా? అని ప్రశ్నించారు.

బిచ్చమెత్తుకున్న రోజులు మర్చిపోయావా!?

హరీశ్‌రావుపై రేవంత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నీదో స్థాయి.. నీదో బతుకు.. అప్పట్లో కాంగ్రెస్ దయతలచి హవాయి చెప్పులు ఉన్న నిన్ను మంత్రిని చేస్తే.. ఉస్మాన్‌సాగర్ పక్కన అజీజ్‌నగర్‌లో 9 ఎకరాల్లో ఫామ్‌హౌజ్ కట్టుకున్నవ్. అంతకముందు నీకు ఏముండె!? నీ సంగతి నాకు తెలియదా? వెనకాల తొంగి తొంగి చూశానని అంటున్నారు. నేను చూసి ఉండొచ్చు. నీలాగా దొంగతనాలు చేయలేదు. నా ఇంటి ముందుకు వచ్చి చేతులు పట్టుకుని నిలబడి బిచ్చమెత్తుకున్న రోజులు మరిచిపోయావా? చెప్పులు కొనుక్కోవాలంటూ డబ్బుల కోసం నా ఇంటికి రాలేదా?" అని నిలదీశారు. వాళ్ల బాధ, భయమంతా ఫామ్‌హౌజ్‌లు కూలుతాయనేనని, అందుకే హైడ్రాను వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. మురికివాడకు వస్తావా అంటూ తనకు సవాల్ విసురుతున్నారని, అక్కడి నుంచే చార్మినార్‌వద్దకు వచ్చానని, చెప్పులు మోసే టోళ్లు గాకుండా ఫామ్‌హౌస్‌లో బోర్ల పండుకున్నోడిని రమ్మనమంటూ ధ్వజమెత్తారు. "త్యాగాలు చేసిన గాంధీ కుటుంబానికి, దోపిడీ చరిత్ర ఉన్న కేసీఆర్ కుటుంబానికి పోలికా? ఒకప్పుడు రబ్బరు చెప్పులు కూడా లేనోళ్లు ఇప్పుడు విమానాల్లో తిరుగుతున్నారు" అని ధ్వజమెత్తారు.

రియల్ ఎస్టేట్‌కు సీఎం భరోసాపై క్రెడాయ్ హర్షం

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంపై సీఎం రేవంత్‌రెడ్డి భరోసా కల్పించడంపై క్రెడాయ్ హైదరాబాద్ హర్షం వ్యక్తం చేసింది. హైడ్రా కూల్చివేతలతో స్థిరాస్తి రంగంపై అనేక అపోహలు ప్రచారంలో ఉన్న నేపథ్యంలో... అన్నిరకాల అనుమతులు పొందిన నిర్మాణాలకు ప్రమాదం ఉండదని, నిర్మాణసంస్థలు భయపడవలసిన అవసరంలేదని శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం హామీ ఇచ్చారు. రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతినకుండా చర్యలు చేపడుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు నెలాఖరులోగా..

(మొదటిపేజీ తరువాయి)

మేడ్చల్ జిల్లా కీసర మండలం రాంపల్లిలోని రెండు పడకల గృహసముదాయంలో ఇళ్లను కేటాయించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి అర్హులైన పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున ఇళ్లు మంజూరు చేయాలని ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర హౌసింగ్ జాయింట్ సెక్రటరీని కోరామన్నారు. తాము ఎలాంటి భేషజాలకు పోకుండా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటా, నిధులు అడిగి తీసుకుంటామని చెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమ గురించి కనీస ఆలోచన చేయలేదని మంత్రి ఆరోపించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, ప్రతిపక్షాలు కాళ్లల్లో కట్టెలు పెడుతున్నా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ఆగదని, పేదవాడి కన్నీరు తుడవడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మూసీ నిర్వాసితులపై కపటప్రేమ ఒలకపోస్తున్నారని, యూట్యూబ్ చానళ్లలో యాక్షన్లు చేస్తున్నారని పొంగులేటి ఎద్దేవా చేశారు.

7.4 లక్షల కోట్లు అప్పుచేశారు: పొన్నం

తెలంగాణ ఏర్పాటైన సమయంలో తాము గల్లా నిండా డబ్బులు ఉంచి ఇస్తే గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రూ.7.40 లక్షల కోట్ల అప్పు చేసిందని, రూ. 40 వేల కోట్ల బిల్లులు బకాయిల కింద చూపించిందని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. పేదలను మూసీ మురికి నుంచి దూరంగా తీసుకెళ్లేందుకు తాము ప్రయత్నిస్తుంటే బీఆర్‌ఎస్ అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో గోషామహల్, కంటోన్మెంట్ ఎమ్మెల్యేలు రాజాసింగ్, శ్రీగణేష్ పాల్గొన్నారు.

రుణానికి భూ తనఖా?

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవద్దని, బడ్జెట్ రుణాలకు వెలుపల ఇచ్చిన రుణంగా పరిగణించాలని విజ్ఞప్తి చేసింది. అయితే, టీజీఐఐసీలో ఆడిటింగ్ పూర్తి కాలేదన్న కారణంతో ఈ ప్రతిపాదనను ఆర్‌బీఐ వెనక్కి పంపించింది. టీజీఐఐసీ అధీనంలో ఉన్న భూములు, ఆర్థిక వనరుల పరిస్థితి, తిరిగి చెల్లించే సామర్థ్యం తదితర వివరాలు పంపించాలని సూచించింది. ఈ వివరాలు అందిన తర్వాతే రుణం ఇప్పించే విషయాన్ని ఆలోచిస్తామని తెలిపినట్లు సమాచారం. దీంతో ప్రభుత్వం కూడా టీజీఐఐసీ ఆర్థిక కార్యకలాపాల ఆడిటింగ్‌పై దృష్టి పెట్టింది. సాధ్యమైనంత త్వరంగా ఆడిట్‌ను పూర్తి చేయించాలని టీజీఐఐసీ చైర్మన్, ఎండీలను సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ఆదేశించారు. ఈ ఆడిటింగ్ నివేదికతో మరోసారి ఆర్‌బీఐకి ప్రభుత్వం ప్రతిపాదనలు పంపనుంది.

సాగు భూములకే భరోసా

మంత్రివర్గ ఉప సంఘం నివేదిక వచ్చాక క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం

» వచ్చే పంటకాలం నుంచి అమలు

» త్వరలో పంటల బీమా: మంత్రి తుమ్మల



హైదరాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగు భూములకే రైతు భరోసా పథకం అమలు చేస్తామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. శనివారం రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ ఎన్.కోదండరెడ్డితో కలిసి తుమ్మల మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతు భరోసాపై ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆధ్వర్యంలోని మంత్రివర్గ ఉప సంఘం నివేదిక వచ్చాక క్యాబినెట్‌లో చర్చించి, నిర్ణయం తీసుకుంటామన్నారు. వచ్చే పంట కాలం అంటే రబీ నుంచి రైతు భరోసా అమలు చేస్తామన్నారు. ఎకరానికి రూ.7,500 చొప్పున రైతు భరోసా అందిస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పంటలు సాగు చేయని, పంట యోగ్యత లేని భూములకు కూడా రైతుబంధు కింద డబ్బులు ఇచ్చిందని, అలా రూ.25 వేల కోట్లు దుర్వినియోగం అయ్యాయని తమకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. అందుకే పంట వేసిన భూములకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తమ ప్రజా ప్రభుత్వం రైతులకు ఒకేసారి ఏకంగా రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేసిందని, ఇది దేశ చరిత్రలో మొదటిసారి అని చెప్పారు. ఎంత రుణమాఫీ చేశామనే వివరాలను నియోజకవర్గాల వారీగా ప్రతి ఎమ్మెల్యేకు పంపించామన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని డిసెంబరు లోగా పూర్తి చేస్తామని, దీనికి క్యాబినెట్‌లో చర్చించి షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. రైతులను రుణవిముక్తులను చేసే బాధ్యత కాంగ్రెస్‌దని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న రైతుబంధు రూ.7,666 కోట్లు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో త్వరలోనే పంటల బీమా అమలు చేస్తామని, ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందన్నారు. గత ఐదేళ్లు పంటల బీమా పథకాన్ని ఎత్తేశారని, ఫలితంగా అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చే అవకాశం లేకపోవడంతో ఎకరానికి రూ.10 వేలు ఇస్తున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా, పత్తి కొనుగోలు కేంద్రాలూ ప్రారంభిస్తున్నామన్నారు. పంట దిగుబడులను కేంద్రం నిర్ణయించిన మద్దతు ధరకు రాష్ట్రం కొనుగోలు చేస్తోందని, కానీ కేంద్రం మాత్రం 25 శాతానికి మించి కొనడం లేదన్నారు. వందల కోట్లతో కోహెడలో మార్కెట్‌తో పాటు కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయడంతో పాటు అక్కడికి వచ్చే ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి తీసుకువస్తామన్నారు. కోదండరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త శకం మొదలైందన్నారు. సీఎం రేవంత్ రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నారని తెలిపారు.

చిరుధాన్యాలకు గొప్ప చరిత్ర

చిరుధాన్యాలకు భారతదేశంతో పాటు, తెలంగాణలో గొప్ప చరిత్ర ఉందని, పూర్వీకులు తమ ఆహారంలో చిరుధాన్యాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చేవారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన అతర్జాతీయ పోషక చిరుధాన్యాల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. గత కొన్ని దశాబ్దాలుగా జొన్నలు, సజ్జలు, రాగుల వంటి వాటి వినియోగం తగ్గిపోయిందన్నారు. 1980ల్లో చిరుధాన్యాల వినియోగం 9 మిలియన్ టన్నులు ఉంటే.. ప్రస్తుతం 4.5 మిలియన్ టన్నులకు తగ్గిందన్నారు. వాటిని రాష్ట్రంలో ఒక్కో వ్యక్తి సగటున రోజుకు 20 గ్రాములే తీసుకుంటున్నారని తెలిపారు. రోజువారీ ఆహారంలోకి వాటిని తీసుకురావడానికి ప్రయత్నించాలన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్‌బాపూజీ ఉద్యాన వన విశ్వవిద్యాలయాల వైస్‌చాన్సలర్లుగా నియమితులైన అల్దాస్ జానయ్య దండా రాజిరెడ్డి మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మార్క్‌ఫెడ్ ద్వారా దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలను మద్దతు ధరకు (క్వింటాలు రూ.2,225) కొనుగోలు చేయనున్నట్టు చైర్మన్ మార రంగారెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 100 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా, మొదట జగిత్యాల, నిర్మల్ జిల్లాలతో పాటు మరో 12 చోట్ల కేంద్రాలను శనివారమే అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మూసీకి అడ్డుపడితే మరో పోరాటమే!

బీఆర్‌ఎస్ నేతల ఇళ్లను లక్షల మందితో శాంతియుతంగా ముట్టడిస్తాం

» కోటి మంది బతుకుల బాగు కోసమే మూసీ పునరుజ్జీవం: కోమటిరెడ్డి



హైదరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని దాదాపు కోటిమంది ప్రజల జీవితాలతో ముడిపడ్డ మూసీ ప్రక్షాళన పనులను అడ్డుకుంటే మరో ఉద్యమం తప్పదని బీఆర్‌ఎస్ నేతలను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హెచ్చరించారు. మూసీ పనులకు అడ్డంపడితే బీఆర్‌ఎస్ నేతల ఇళ్లను నల్లగొండకు చెందిన లక్షల మందితో కలిసి శాంతియుతంగా ముట్టడిస్తామని హెచ్చరించారు. మూసీకి అడ్డుపడే ప్రతి రాజకీయ పార్టీని నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్ ప్రజలు నామరూపాలు లేకుండా చేస్తారని హెచ్చరించారు. మూసీ కాలుష్యంతో ప్రజలు వివిధ అనారోగ్యాలతో నానా అవస్థలు పడుతున్నారని.. ఇంకా వాళ్లు అలాగే చచ్చిపోవాలని కేటీఆర్ కోరుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ఎవరు అడ్డొచ్చినా మూసీ విషయంలో వెనకడుగువేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ప్రధాని మోదీ.. సబర్మతి, నమామీ గంగ ప్రాజెక్టులు చేపట్టినప్పుడు మాట్లాడని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల ఇప్పుడు మూసీకి ఎందుకు అడ్డంపడుతున్నారని ప్రశ్నించారు. బండి సంజయ్, కిషన్‌రెడ్డి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని.. కిషన్‌రెడ్డికి ఏమీ తెల్వదని, అసలు ఆయన రాజకీయ నాయకుడే కాదని విమర్శించారు. శనివారం సచివాలయంలో మంత్రి మాట్లాడారు. మూసీ పరీవాహక పరిధిలోని కోటిమంది బతుకులు బాగు చేసేందుకే మూసీ పునరుజ్జీవనానికి శ్రీకారం చుట్టామని, తమ ప్రభుత్వం ఏర్పడగానే మంత్రులంతా సీఎం రేవంత్‌ను కలిసి ఇదే విషయంపై చర్చించి మూసీకి పరిష్కారం చేయాలని కోరిన విషయాన్ని తెలిపారు. మూసీపై డీపీఆర్ చేసిన మెయిన్‌హార్ట్ టీ కంపెనీ 29 దేశాల్లో అద్భుతమైన కట్టడాలను నిర్మించిందని, అలాంటి కంపెనీపై ఎక్కడో పాకిస్థాన్‌లో కేసు అయ్యిందంటూ బురదజల్లడం దారుణమన్నారు. ఈ సందర్భంగా కాళేశ్వరం డీపీఆర్‌ను తయారు చేసిన వ్యాప్కోస్‌ను ఒడిసా గవర్నమెంట్ బ్లాక్ లిస్ట్‌లో పెట్టిందన్న విషయాన్ని గుర్తుచేశారు. మూసీపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చూయించిన కేటీఆర్.. ఆయన బంధువుల సంస్థ గ్లోబరినా పదుల సంఖ్యలో విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న విషయాన్ని ఎందుకు ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వేసి చూపించలేదని ప్రశ్నించారు.. కాళేశ్వరం డీపీఆర్ కోసం 2015 లోనే రూ.33కోట్లు చెల్లించారని గుర్తు చేశారు. ఇప్పుడు మూసీ డీపీఆర్‌కు రూ.141 కోట్లు చెల్లిస్తుంటే గగ్గోలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌కు అధికారం పోయినా అహంకారం తగ్గలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం పోవడంతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నట్టు కనిపిస్తోందని.. డాక్టర్‌కు చూపించుకోవాలని కేటీఆర్‌కు సూచించారు. కేసీఆర్ కొడుకుగా తప్ప కేటీఆర్‌ను ఎవరు గుర్తుకూడా పట్టరని.. అట్లాంటి వాళ్లు కూడా రేవంత్‌పై అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. 80 వేల పుస్తకాలు చదివిన ప్రపంచ మేధావి కేసీఆర్ ఫాంహౌజు నుంచి బయటికు వచ్చి మూసీ వల్ల మూడు జిల్లాల ప్రజలు పడుతున్న సమస్యలపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. కాగా కాంగ్రెస్ పుణ్యానే కేసీఆర్ యూత్ కాంగ్రెస్ నాయకులయ్యారని, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పార్టీతో ఎమ్మెల్యే అయ్యారని పేర్కొన్నారు. హరీశ్ రావు నాటకాల రాయడని, ఉద్యమం సమయంలో ఒంటిపై నీళ్లు పోసుకుని అగ్గిపెట్టె దొరకలేదని ప్రచారం చేసుకున్నాడని ఎద్దేవా చేశారు. సిద్దిపేట జిల్లా రంగనాయక్‌సాగర్ దగ్గర హరీశ్‌కు 100 ఎకరాల వ్యవసాయ క్షేత్రం ఉందని, పాల డెయిరీ, పౌల్ట్రీ వ్యాపారంతోపాటు నారాయణ కళాశాలలో వాటా ఉందన్నారు. అసలు హరీశ్‌ను కొన్ని కేసుల్లో జైలుకు పంపొచ్చన్నారు. నల్లగొండ జిల్లాలో పుట్టిన చిట్టి నాయుడు మొన్నటి ఎన్నికల్లో 3 వేల ఓట్లతో గెలిచినప్పటికీ ఆయనకు జిల్లా సమస్యలు పట్టవంటూ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు.


ప్రొఫెషనల్ గోల్ఫర్స్ అసోసియేషన్ ఆఫ్ అమెరికా ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు

200 ఎకరాల్లో గోల్ఫ్ సిటీ

» 10 వేల మందికి ఉపాధి అవకాశాలు: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రొఫెషనల్ గోల్ఫర్స్ అసోసియేషన్ ఆఫ్ అమెరికా(పీజీఏ), స్థానిక భాగస్వామి స్టోన్ క్రాఫ్ట్‌తో కలిసి హైదరాబాద్‌కు దక్షిణాన 200 ఎకరాల్లో గోల్ఫ్ సిటీని నిర్మించేందుకు ముందుకు వచ్చిందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. అమెరికాలోని టెక్సస్ రాష్ట్రంలో ఫ్రిస్కో కేంద్రంగా పని చేస్తున్న పీజీఏ ప్రతినిధి బృందం శనివారం మంత్రితో సచివాలయంలో భేటీ అయింది. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తే గోల్ఫ్ కోర్టులు, నివాస సముదాయాలు, హోటళ్లు, వినోద పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి సిద్ధమని పీజీఏ, స్టోన్ క్రాఫ్ట్ ప్రకటించినట్లు తెలిపారు. ప్రస్తుతం ముంబైలో షాపూర్జీ పల్లోంజీ సంస్థతో కలిసి పీజీఏ గోల్ఫ్ సిటీ నిర్మాణం చేపడుతోందని తెలిపారు. ఇక్కడ స్టోన్ క్రాఫ్ట్ భాగస్వామ్యంతో భారీ పెట్టుబడులు పెట్టడానికి అంగీకరించిందని వివరించారు. గోల్ఫ్ సిటీ నిర్మాణం పూర్తయితే వచ్చే పదేళ్లలో పదివేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు తెలిపారు. పీజీఏ కన్సార్టియం నిర్మించనున్న '18 హోల్' ప్రామాణిక గోల్ఫ్ కోర్సు.. దక్షిణ భారత దేశంలోనే మొట్ట మొదటిది కానుందని వెల్లడించారు. కాగా, నిర్మాణ రంగంలో దేశంలోని అన్ని నగరాలతో హైదరాబాద్ పోటీ పడి అగ్రగామిగా నిలవాలని మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. కొంపల్లిలోని ఆస్పీషియస్ కన్వెన్షన్ సెంటర్‌లో రూఫ్ అండ్ ఫ్లోర్ ప్రాపర్టీ ప్రదర్శనను మైనంపల్లి హన్మంతరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం బిల్డర్లు, రియల్ డెవలపర్లతో మాట్లాడారు. రెచ్చగొట్టే వారి మాటలు విని, హైడ్రా గురించి ఆందోళన చెందవద్దని సూచించారు. ఉత్తర హైదరాబాద్ ఇంకా విస్తరింస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రదర్శనలో 15 మంది డెవలపర్లు సుమారుగా వంద ప్రాజెక్టులను ప్రదర్శించారు.

పట్టించిన ఫోన్ కాల్

వృద్ధురాలిని, ఆమె భర్తను చంపిన ఉన్మాది

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వృద్ధురాలిపై అత్యాచారానికి యత్నించి.. ప్రతిఘటించడంతో ఆమెను, ఆ హత్యను చూసిన ఆమె భర్తను దారుణంగా హత్య చేశాడో దుర్మార్గుడు! తన సెల్‌ఫోన్ ఎక్కడుందో తెలుసుకునేందుకు హతుల సెల్ నుంచి తన సెల్‌కు ఫోన్ చేయడమే నిందితుడిని పట్టించింది. ఈ జంట హత్యలు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని కందుకూరు మండలంలో జరిగితే.. ఈ దుర్మార్గానికి ఒడిగట్టింది అదే మండలం దాసర్లపల్లికి చెందిన ఉప్పుల శివకుమార్ (25). రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లికి చెందిన చింతపల్లి మనోహర్‌రావుకు కందుకూరు మండలం కొత్తగూడలో 8 ఎకరాల మామిడితోట ఉంది. కూలీలుగా అక్కడే ఉండి పనిచేయడానికి తన సొంతూరు పెద్దకొత్తపల్లి నుంచి మూగ ఉషయ్య (70), శాంతమ్మ (65) దంపతులను పనిలో పెట్టుకున్నాడు. కందుకూరు మండలం దాసర్లపల్లికి చెందిన ఉప్పుల శివకుమార్ మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. ఈనెల 15న రాత్రి ఏడు గంటలకు బైక్ మీద వెళుతూ కొత్తగూడ గ్రామపరిధిలో ఉన్న ఉషయ్య దంపతులు పనిచేస్తున్న మామిడితోట వద్ద ఆగాడు. మద్యం మత్తులో ఉన్న శివ, తోటలోకి వెళ్లాడు. అక్కడ షెడ్డులో ఉన్న శాంతమ్మపై లైంగికదాడికి యత్నించాడు. ప్రతిఘటించడంతో ఆమెను కొడవలితో నరికి హత్య చేశాడు. అప్పుడే వచ్చిన ఉషయ్య, భార్య మృతదేహాన్ని చూసి కేకలు వేస్తూ పరుగులు తీయగా అతడిని వెంటాడి కొడవలితో నరికి చంపాడు. ఈ కేసును తేల్చేందుకు రాచకొండ సీపీ సుధీర్‌బాబు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దించారు. హత్య జరిగిన రోజు శివకుమార్ తన ఫోన్ చార్జింగ్ లేకపోవడంతో దాన్ని ఇంట్లోనే వదిలేసి బయటకొచ్చాడు. హత్యల తర్వాత తన ఫోన్ ఇంట్లో వదిలేసిన విషయం మరిచిపోయిన శివ.. తన ఫోన్ తోటలోనే ఎక్కడో పడిపోయి ఉంటుందని భావించి వృద్ధ దంపతుల మృతదేహాల వద్ద ఉన్న ఫోన్ నుంచి తన నంబరుకు కాల్ చేశాడు. అది స్విచాఫ్ ఉండటంతో రింగ్ కాలేదు. తర్వాత వృద్ధులకు చెందిన ఫోన్‌ను అక్కడే వదిలేసి పారిపోయాడు. ఆ మొబైల్‌లో చివరి కాల్ శివ కుమార్ నంబరుకు చేసి ఉన్నట్లుగా గుర్తించి అతడిని అదుపులోకి తీసుకొని కేసును తేల్చారు. శివ కుమార్‌ను విచారించిన క్రమంలో ఏడాదిన్నర క్రితం దాసర్లపల్లిలో ఓ మహిళను అతడు హత్యచేసినట్లు పోలీసులు నిర్ధారించారు. నెల్లూరు జిల్లాకు చెందిన శైలజారెడ్డి (42) తన భర్త, పిల్లలతో కలిసి కందుకూరు మండలంలోని దాసర్లపల్లి గ్రామానికి వచ్చి అరుణ ఫామ్‌హౌజ్‌లో పనికి చేరింది. 2023 మార్చి3న రాత్రి ఫామ్‌హౌజ్‌లోకి శివ వెళ్లాడు. గదిలో వంటచేస్తున్న శైలజారెడ్డిపై లైంగికదాడికి ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో అక్కడే ఉన్న గొడ్డలితో మెడపై నరికి చంపాడు. అప్పట్లో క్లూస్ టీం వంటగదిలోని వోడ్కా బాటిల్‌పై వేలిముద్రలను సేకరించింది. తాజా జంట హత్యల నేపథ్యంలో శివ వేలిముద్రలు, ఓ బాటిల్‌పై ఉన్న వేలిముద్రలతో సరిపోలడంతో పోలీసులు విచారించగా శివ ఆ నేరాన్నీ అంగీకరించాడు.

పేదల కోసం మూడు నెలలు కాదు..

మూడేళ్లు మూసీ పక్కనుంటా!

- మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలకు డబ్బులు అవసరం
- మూటలు ఢిల్లీకి పంపేందుకే మూసీ ప్రాజెక్టు
- మేం చందాలు వేసుకుని ఇస్తాం.. ఢిల్లీకి పంపు
- మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు ప్రారంభించింది మేమే
- మా ప్రణాళికలు అమలు చేస్తే చాలు:కేటీఆర్

హైదరాబాద్ సిటీ/మన్సూరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): "ప్రాజెక్టులో ఇళ్లు కోల్పోయే వారి కోసం మూడు నెలలు కాదు.. మూడేళ్లు కూడా మూసీ పక్కన ఉండేందుకు సిద్ధం. నా చిన్నతనంలో నింబోలి అడ్డా, మొజంజాహి మార్కెట్ పక్కన మయూరి హోటల్‌లో ఉన్నాను. అవి మూసీకి దగ్గరగా ఉంటాయి. మహబూబ్ నగర్ నుంచి వచ్చిన సీఎంకు హైదరాబాద్ గురించి తెలియకపోవచ్చు. చిన్నప్పటి నుంచీ ఇక్కడే ఉన్న నాకు తెలుసు" అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. మూసీ పునరుజ్జీవం, బ్యూటిఫికేషన్‌కు తాము వ్యతిరేకం కాదని, మూసీ పేరిట లూటిఫికేషన్, ఢిల్లీ మూటల దోపిడిని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రజాధనం లూటీ చేసి ఢిల్లీకి మూటలు పంపేందుకే మూసీ ప్రాజెక్టు అని ఆరోపించారు. నాగోల్‌లోని సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)ను శనివారం మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. "మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఎన్నికలున్నాయి. అక్కడి ఖర్చులకు రాహుల్ గాంధీకి పైసలు అవసరం. ఆ పార్టీకి ఉన్నది తెలంగాణ ఒక్కటే. కర్ణాటకలో ప్రభుత్వమున్నా అక్కడి సీఎం ముడా స్కాంలో ఇరుక్కున్నాడు. అందుకే తెలంగాణను కాంగ్రెస్ ఆర్థిక వనరుగా వినియోగించుకుంటోంది. మూసీ పేరిట ప్రజాధనం, హైడ్రాతో బిల్డర్ల వద్ద వసూలు చేసి పదవి కాపాడుకునేందుకు ఢిల్లీకి పంపుతున్నాడు. అయ్యా.. రేవంత్ రెడ్డి.. నీకు పదవి కాపాడుకునేందుకు పైసలు కావాలంటే మేం చందాలు వేసుకొని ఇస్తాం. ఢిల్లీకి పంపు. కానీ, పేదల కడుపు కొట్టి వేల కోట్ల దోపిడి చేస్తామంటే మాత్రం ఒప్పుకోం" అని వ్యాఖ్యానించారు. మూసీ పునరుజ్జీవాన్ని కేసీఆర్ ప్రభుత్వమే ప్రారంభించిందని, ఎస్టీపీల నిర్మాణం చేపట్టామని, మూసీకి ఇరువైపులా 15 బ్రిడ్జిలు నిర్మించాలని నిర్ణయించామని తెలిపారు. ఇవన్నీ పూర్తయ్యాక రివర్ బెడ్‌లోని 900 నిర్మాణాల యజమానులను ఒప్పించి వారికి ప్రత్యామ్నాయం కల్పించి సుందరీకరణ పనులు చేయాలని భావించామన్నారు. మూసీ వెంట రూ.10 వేల కోట్లతో ఎక్స్‌ప్రెస్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదించామని, మొత్తం ప్రాజెక్టుకు రూ.15-16 వేల కోట్లు అవసరమని అంచనా వేశామన్నారు. కొత్తగా రేవంత్‌రెడ్డి చేయాల్సిందేం లేదని, తమ హయాంలో రూపొందించిన ప్రణాళికలు అమలు చేస్తే చాలని పేర్కొన్నారు. తాము చేసిన పనులను రేవంత్ రెడ్డి తన ఖాతాలో వేసుకుంటున్నాడని, కేసీఆర్ కట్టించిన ఇళ్లను మూసీ నిర్వాసితులకు ఇస్తున్నాడని, తమ హయాంలో నిర్మాణం చేపట్టిన ఎస్టీపీలకు ఆయన ప్రారంభోత్సవం చేశాడని ఎద్దేవా చేశారు. "పాఠశాలల్లో చాక్‌పీస్‌లకు పైసల్లేవు. ఆస్పత్రుల్లో మందు గోలీలకు డబ్బుల్లేవ్. బస్తీ దవాఖానాల్లో వైద్యులకు వేతనాలివ్వరు. హోం గార్డులకు జీతాలియ్యరు. రైతు భరోసా లేదు. రుణ మాఫీ చేయరు. తులం బంగారం ఇయ్యరు. ఆరు గ్యారంటీల అమలుకు నిధులు లేవంటున్నారు. మరి మూసీకి రూ.1.50 లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారు?" అని ప్రశ్నించారు. ఎవరికీ నష్టం చేయకుండా మూసీకి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించాలని, బఫర్ జోన్‌లోని ఇళ్ల జోలికి వెళ్లవద్దని సూచించారు. అనుమతులిచ్చి.. ఆస్తిపన్ను, నల్లా, విద్యుత్తు బిల్లులు వసూలు చేస్తూ బఫర్ జోన్‌లో ఉన్న వారిని కబ్జాదారులు అనడం ఏమిటని మండిపడ్డారు. "నదీ గర్భంలో పేదల ఇళ్లు ఉంటే మంచిది కాదు. కానీ, ఎంజీబీఎస్, మెట్రో స్టేషన్ ఉండొచ్చట. పేదల ఇళ్లు కూల్చి పెద్ద మాల్స్ కడతారట" అని ఎద్దేవా చేశారు.



నాగోల్ ఎస్టీపీలో శుద్ధి చేశాక, చేయకముందు.. నీటి నమూనాలను చూపుతున్న కేటీఆర్

వృద్ధ దంపతుల దారుణ హత్య

» హైదరాబాద్, అంబర్‌పేటలో ఘటన



లింగారెడ్డి, ఊర్మిళా దేవి

అంబర్‌పేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో వృద్ధ దంపతులు హత్యకు గురయ్యారు. పిల్లలు విదేశాల్లో స్థిరపడడంతో ఒంటరిగా నివాసముంటున్న వారిని డబ్బు కోసమే ఎవరో హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. కాచిగూడ ఏసీపీ రఘు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రొద్దుటూరి లింగారెడ్డి(75), ఊర్మిళాదేవి దంపతులు బాగ్ అంబర్‌పేట డీడీ కాలనీలో నివాసముంటున్నారు. ఆ దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉండగా వివాహం అనంతరం వారంతా అమెరికాలో ఉంటున్నారు. లింగారెడ్డి.. పంజాబ్ నేషనల్ బ్యాంకులో మేనేజర్‌గా పదిహేనేళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. ప్రస్తుతం దంపతులు మాత్రమే ఉంటుండంతో లింగారెడ్డి తన నివాసంలోని ఓ వాటాను అద్దెకు ఇచ్చారు. లింగారెడ్డి ఇంట్లో పని చేసే వ్యక్తుల్లో ఒకరు సోమవారం నుంచి పనికి రావడం లేదు. మరొకరు గురువారం ఉదయం వచ్చి పని చేసి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. లింగారెడ్డి దంపతులు కూడా గురువారం నుంచి బయటకు రాలేదు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఆ ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో అద్దెకు ఉంటున్న వారు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు తలుపులు తెరిచి చూడగా లింగారెడ్డి దంపతులు విగతజీవులై పడి ఉన్నారు. దంపతులిద్దరి తలలపై బలమైన గాయాలున్నాయి. ఇంట్లోని బీరువా, అల్మారాలు తెరచి ఉన్నాయి. దొంగతనానికి వచ్చిన వారే దంపతులను హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.